



ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 300 | మంగళవారం | 30-09-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## పంచాయతీ రాజ్ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల




**రెండు విడతల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి**

**మూడు దఫాల్లో సర్పంచ్ ఎన్నికలు**

**షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం**



**అక్టోబర్ 23, 27న ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలకు పోలింగ్**

**అక్టోబర్ 31, నవంబరు 4,8న వార్డులు, సర్పంచ్ ఎన్నికలు**

**అక్టోబర్ 9న ప్రారంభమై నవంబరు 11తో ముగియనున్న ప్రక్రియ**

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. రెండు విడుతల్లో మండల పరిషత్ ప్రాదేశిక నియో జక వర్గం (ఎంపిటిసి), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గం (జెడ్‌పిటిసి), మరో మూడు విడుతల్లో గ్రామ పంచాయతీ ( సర్పంచ్, వార్డు సభ్యులు)కు మొత్తం 5 విడుతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 9న ప్రారంభమై నవంబర్ 11తో ముగించనున్నారు. ఇందులో ముందుగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు ఈ తర్వాత గ్రామ పంచాయతీల ఎన్నికలను నిర్వహించనున్నారు. అయితే గ్రామ పం చాయతీల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల కౌంటింగ్‌ను నిర్వహించనున్నారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి మొదటి విడుత ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అయితే సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికు ముదిని ప్రకటించారు. మండల పరిషత్, (ఎంపిటిసి), జిల్లా పరిషత్( జెడ్‌పిటిసి) తొలి విడత ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. 23వ తేదీ(గురువారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నుంచి 9వ తేదీ నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు.12వతేదీన నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించి అభ్యర్థుల జాబితాను అదే రోజు 5గంటలకు ప్రకటించనున్నారు. 13వ తేదీ సాయం త్రం 5 గంటలకు అభ్యంతరాల స్వీకరణ, 14వ తేదీ సాయం త్రం 5 గంటల వరకు పరిశీలన ఉం టుంది. 15 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నా మినేషన్లకు గ డువు విధించిన అధికారులు ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. రెండ వ విడుత ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13వ తేదీ న నోటిఫికేషన్ విడుదల కానుండగా 27వ తేదీ (మంగళవా రం) ఉదయం 7 గంటల నుంచి సా యంత్రం 5 గం టల వరకు ఎన్నికలను నిర్వహించనున్నారు. అభ్యర్థుల నుంచి 13వ తేదీ నుంచి 15వ తేదీ సాయం త్రం 5 గంటల వరకు మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు. 16న నామినేషన్ల స్క్రూటి నీ నిర్వహించి సాయంత్రం 5 గంటలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు అభ్యంతరాలను తరువాయి 2లో

| | ఎంపిటిసి, జెడ్‌పిటిసి | జెడ్‌పిటిసి,ఎంపిటిసి | గ్రామ పంచాయతీ | | |
|---|---|---|---|---|---|
| ఎన్నికల కార్యక్రమం | తొలి విడత | రెండవ విడత | మొదటి | రెండవ | మూడవ |
| నామినేషన్ల స్వీకరణ | అక్టోబరు 9 | అక్టోబరు 13 | అక్టోబరు 17 | అక్టోబరు 21 | అక్టోబరు 25 |
| నామినేషన్లకు చివరి తేదీ | అక్టోబరు 11 | అక్టోబరు 15 | అక్టోబరు 19 | అక్టోబరు 23 | అక్టోబరు 27 |
| నామినేషన్ల ఉపసంహరణ | అక్టోబరు 15 | అక్టోబరు 19 | అక్టోబరు 23 | అక్టోబరు 27 | అక్టోబరు 31 |
| ఎన్నికల తేదీ | అక్టోబరు 23 | అక్టోబరు 27 | అక్టోబరు 31 | నవంబరు 04 | నవంబరు 8 |
| ఓట్ల లెక్కింపు | నవంబరు 11 | నవంబరు 11 | అక్టోబరు 31 | నవంబరు 04 | నవంబరు 8 |

## మావోయిస్టుల ప్రతిపాదనను కేంద్రం ఎందుకు అంగీకరించడం లేదు?



**ప్రశ్నించిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా**

**న్యూఢిల్లీ :** మావోయిస్టుల చర్చల ప్రతిపాదనను భారత ప్రభుత్వం ఎందుకు అంగీకరించటం లేదని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐదు రోజుల పాటు చండీగఢ్‌లో జరిగిన సిపిఐ జాతీయ 25వ మహాసభ వివరాలు, నిర్ణయాలు, తీర్మానాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరస్కరించడంపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలు కోరుతున్నారు. వాళ్ళు కాల్పుల విరమణకు ప్రతిపాదన చేశారు. భారత ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదు?" అని రాజా అన్నారు. అసలు ఆపరేషన్ కగార్ అంటే ఏమిటి? అందులో ఎంత మంది మావోయిస్టులను చంపారో, ఎంత మంది గిరిజనులను చంపారో ప్రభుత్వం చెప్పగలదా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌ఘఢ్ అటవీ సంపదతో కూడిన రాష్ట్రం అని, తరువాయి 2లో

## విదేశాలలో నిర్మించే అన్ని సినిమాలపై
# 100 శాతం టారిఫ్

- హాలీవుడ్ వ్యాపారాన్ని విదేశాలు లాక్కున్నాయి
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా వెలుపల నిర్మించే విదేశీ చిత్రాలపై నూటికి నూరుశాతం సుంకాలు విధిస్తామని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చిన్న పిల్లాడి చేతిల్లో బెల్లంముక్క లాక్కు పోయినట్లు, అమెరికా సినిమా వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించుకుపోయాయని ట్రంప్ ఆరోపించారు. అంతర్జాతీయ పోటీ కారణంగా అమెరికాలో చిత్ర నిర్మాణం పతనమైందని ఆయన విమర్శించారు. ఈ సుంకాలు ఎప్పటినుండి అమలులోకి వస్తాయో తేదీని వెల్లడించలేదు.ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. కానీ ఏ అధికారంతో విదేశాల్లో తయారయ్యే చిత్రాలపై ట్రంప్ 100 శాతం సుంకాలు విధించారన్న చట్టపరమైన అధికారం వెంటనే స్పష్టమయ్యే అవకాశం లేదు. ఏ విధంగా ఈ సుంకాలను అమలు చేస్తారో వివరణ ఇవ్వాలని రాయిటర్స్ వార్తాసంస్థ చేసిన విజ్ఞప్తికి వైట్‌హౌస్ అధికారవర్గాలు స్పందించకుండా మౌనం పాటించాయి. వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ, కామ్‌క్యాస్ట్, పారమౌంట్ స్కైడాన్స్, నెట్‌ఫ్లిక్స్ వంటి భారీ నిర్మాణ సంస్థలు కూడా స్పందించలేదు. ఐతే ట్రంప్ ప్రకటనతో ఎర్లీ ట్రేడింగ్‌లో నెట్‌ఫ్లిక్స్ షేర్లు 1.5 శాతం తరువాయి 2లో



## పాట్నా కేంద్రంగా అతిపెద్ద
# సినిమా పైరసీ

- విడుదలకు ముందే 550 సినిమాలు హ్యాక్
- చిత్ర పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం
- 2024లో తెలుగు ఇండస్ట్రీకి రూ.3700 కోట్ల నష్టం
- ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపిల మెయిల్స్ కూడా హ్యాకింగ్
- ఐదుగురు ముఠా సభ్యుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ కమిషనర్ సి.వి. ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్

పాట్నా కేంద్రంగా దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠా నేరాలకు సంబంధించి పూర్తి వివరాలను బంజారాహిల్స్‌లోని ఐసిసిసి భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ వెల్లడించారు. ఈ ముఠా సినిమా పైరసీతో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వ వెబ్‌సైట్లు, అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యుల మెయిల్‌ను సైతం హ్యాక్ చేసిందని సివి ఆనంద్ తెలిపారు.ఐదేళ్లలో ఈ ముఠా ఆయా భాషలకు చెందిన 550 సినిమాలను విడుదలకు ముందే హ్యాక్ చేసి పైరసీకి పాల్పడిందన్నారు. వీరి చర్యకు సినీ పరిశ్రమ రూ. 22,400 కోట్ల నష్టపోవడమే కాకుండా రూ. 4000 కోట్లు ప్రభుత్వానికి జిఎస్‌టి రూపంలో రావాల్సిన నిధులకు చెక్ పడిందన్నారు. అంతే కాకుండా 2024లో తెలుగు ఇండస్ట్రీకి రూ. 3700 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. హైదరాబాద్‌లోని థియేటర్లలో సుమారు 100 సినిమాలను రికార్డ్ చేశారని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో ఇంత పెద్ద నేరాలకు తెగబడడం దేశంలోనే ఈ ముఠా నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. బిహార్‌కు చెందిన అశ్వనికుమార్ తరువాయి 2లో





# బతుకమ్మ విశ్వవ్యాప్తం

- రెండు గిన్నిస్ రికార్డులు
- సరూర్‌నగర్ స్టేడియంలో 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ
- ఒకేసారి 1354 మంది మహిళలతో వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

తెలంగాణ రాష్ట్రానికే ప్రత్యేకమైన బతుకమ్మ కీర్తి విశ్వవ్యాప్తమైంది. ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన గిన్నిస్ రికార్డ్‌ను సాధించింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతి పెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా ఈ రికార్డు సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. భారీ బతుకమ్మ తరువాయి 2లో

# నక్వీ తీరు ఆక్షేపణీయం

- బిసిసిఐ ఆగ్రహం... ఐసిసికి ఫిర్యాదు చేయాలని అత్యవసర సమావేశంలో నిర్ణయం
- ఎసిసి చైర్మన్ నుంచి ట్రోఫీ తీసుకోవడానికి టీమిండియా నిరాకరణకు సమర్థన



**దుబాయ్/ ముంబయి:** ఆసియా క్రికెట్ మండలి (ఎసిసి) అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పాకిస్తాన్ ఆంతరంగిక వ్యవహారాల శాఖ మంత్రి సయ్యద్ మోసిన్ రజా నక్వీ వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన నుంచి భారత క్రికెటర్లు ఆసియా కప్ ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించడాన్ని ముంబయిలో జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో సమర్థించింది. నక్వీ వ్యవహారంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి తరువాయి 2లో



# భగ్గుమన్న పిఒకె

- హక్కులకోసం, అవినీతికి వ్యతిరేకంగా వీల్–జామ్
- 38 సమస్యలు పరిష్కరించాలని అవామీ ఎఎసి డిమాండ్
- పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి?

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు (పిఓకె)లో సోమవారం ప్రజా నిరసన భగ్గుమంది హింసాకాండ చెలరేగింది. పాలకుల అవినీతి చర్యలకు వ్యతిరేకంగా వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. సహనం కోల్పోయిన పోలీసులు ప్రదర్శకులపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒకరు మరణించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా వెల్లడైంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు ఇటీవల చరిత్రలో ఎన్నడూలేనిరీతిలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. అవామీ యాక్షన్ కమిటీ తరువాయి 2లో

## కేరళలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ
# అసెంబ్లీలో తీర్మానం

- సిఎం పినరయి విజయన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి 'ప్రతిపక్ష యుడిఎఫ్' మద్దతు
- ఓటర్ల జాబితా సవరణను 'పారదర్శకం'గా నిర్వహించాలని 'ఇసి'కి శాసనసభ విజ్ఞప్తి

**తిరువనంతపురం :** ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అవలంభిస్తున్న దూకుడు ధోరణిని సోమవారం కేరళ రాష్ట్ర శాసనసభ ముక్తకంఠంతో ఆక్షేపించింది. కేరళ రాష్ట్రంలో ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టాలన్న భారత ఎన్నికల సంఘం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేరళ శాసనసభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని శాసనసభ అభ్యర్థించింది. ఎస్ఐఆర్‌పై ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## వియత్నాం తుపానులో 12 మంది మృతి

17 మంది జాలరులు గల్లంతు

**హనోయ్:** వియత్నాంలో 'బువాలోయ్' పెను తుఫాను బీభత్సం సృష్టించింది. ఈ తుపాను కారణంగా 12 మంది మరణించారు. మరో 17 మంది జాలరులు గల్లంతయ్యారు. సోమవారం ఉదయం బువాలోయ్ పెను తుఫాను వియత్నాంను ఢీకొట్టడంతో 26 అడుగుల ఎత్తున కెరటాలు పైకి లేచి అతలాకుతలం సృష్టిస్తున్నాయి. తాత్కాలికంగా నిర్మించిన వంతెనలు కొట్టుకుపోయాయి. పల్లపు ప్రాంతాలు, రోడ్లు నీట మునిగాయి. వాహనాలన్నీ పూర్తిగా నీట మునిగాయి. తాత్కాలిక, బలహీన కట్టడాలు కుప్పకూలాయి. జాడ తెలియకుండా పోయిన జాలర్లకోసం తీరగస్తీ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. తర్వాత ఈ తుపాను బలహీనపడి లావోస్ దేశంవైపు తరలివెళ్ళింది.

## పూర్వ సోవియట్ రిపబ్లిక్ మోల్డోవాలో
# యూరప్ అనుకూల పార్టీ గెలుపు

**చిసినావు:** తూర్పు యూరప్‌లో చిన్న దేశం మోల్డోవాలో ఉత్కంఠ భరితంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యూరోపియన్ యూనియన్ అనుకూల అధికార పార్టీ మళ్ళీ విజయం సాధించింది. 15 లక్షల మంది ఓటర్లు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. వీరిలో ఎక్కువమంది అమెరికా,యూరప్ డయాస్పోరాకు చెందినవారు. పార్టీ ఆఫ్ యాక్షన్ అండ్ సాలిడారిటీ (పిఎఎస్) పార్లమెంటులో ఆధిక్యం నిలబెట్టుకుంది. కౌటింగ్ తుదిదశలో ఉంది. పిఎఎస్ పార్టీకి 50.1 శాతం ఓట్లు లభించాయి. వామపక్షాలకు 24.2 శాతం ఓట్లు లభించాయి. కౌటింగ్‌పూర్తయ్యేసరికి 55 శాతం ఓట్లతో పార్లమెంటులో పిఎఎస్ 101 స్థానాల క్లియర్ మెజార్టీ సాధించగలదని విశ్లేషకులు అంచనావేశారు. ఒకప్పుడు రష్యాలో అంతర్భాగంగా ఉన్న మోల్డోవాకు రష్యాతో ఇప్పటికీ బలమైన ఆర్థిక,సాంఘిక సంబంధాలు ఉన్నాయి. కానీ ఈమధ్యకాలంలో మోల్డోవా ప్రజల్లో ఎక్కువమంది యూరోపియన్ యూనియన్‌వైపు చూస్తున్నారు. తమకు యూరోపియన్ యూనియన్ ద్వారా సురక్షితమైన జీవితం లభిస్తుందని వారు అంచనావేస్తున్నటుల



యూరప్ వర్గాల సమాచారం. ఈ ఎన్నికల్లో రష్యా దేశం జోక్యం చేసుకుని తీవ్ర ప్రభావం చూపిస్తోందని యూరోపియన్ యూనియన్ దేశాలు గగ్గోలు పెట్టడంతో ఉత్కంఠభరిత వాతావరణం మధ్య ఎన్నికల పోలింగ్, కౌటింగ్ జరిగాయి. ఐతే ఈ ఎన్నికల్లో తాము జోక్యం చేసుకోలేదని, ఐనప్పటికీ అక్కడ ఎన్నికలు న్యాయబద్ధంగా జరగలేదని రష్యా విమర్శించింది. మోల్డోవా చరిత్రలో ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని విశ్లేషకులు పేర్కొన్నారు. 1991 ఆగస్టు 27న సోవియట్‌యూనియన్ అంతర్ధానం కావడంతో అప్పటివరకూ ఉన్న మోల్డోవియన్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ స్వాతంత్ర్యం ప్రకటించుకుని మోల్డోవాగా పేరు మార్చుకుంది. మోల్డోవాకు ఒకవైపు ఉక్రేన్, మరోవైపు రుమేనియా సరిహద్దులుగా ఉన్నాయి. మోల్డోవా ప్రస్తుత దేశాధ్యక్షురాలు మైయా సాందు స్థాపించిన పార్టీ ఆఫ్ యాక్షన్ అండ్ సాలిడారిటీ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. పిఎఎస్‌పార్టీని ఆమే స్థాపించారు. దేశంలో అవినీతి, ఆర్థిక సమస్యలతోపాటు ఇయులో సభ్యత్వం తీసుకునే అంశాన్ని కూడా ఆమె పార్టీ ఎన్నికల్లో ప్రచారం చేసింది.

మోల్డోవాలో రష్యా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హర్షం ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. అధ్యక్షురాలుగా ఎన్నికైన బైయా సాందుతో తాను మాట్లాడాననీ, ఆమెకు శుభాకాంక్షలు చెప్పాననీ ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. రష్యా కుతంత్రాలను మోల్డోవా ప్రజలు తిప్పికొట్టారన్నారు.

## కె.పి.శర్మ ఓలి సహా ఐదుగురిపై
# దేశం వదలి వెళ్ళకుండా నేపాల్ ఆంక్షలు



**ఖాట్మండు:** నేపాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమంత్రి రామేశ్ లేఖక్ మరో ముగ్గురు పాస్‌పోర్టులను అక్కడి ప్రభుత్వం స్తంభింపజేసింది. వారు దేశం వదలి వెళ్ళకూడదని ఆంక్షలు విధించింది. ఈనెలారంభంలో జరిగిన జనరేషన్–జెడ్ ఉద్యమాన్ని అణచివేయడంలో కీలకపాత్ర వహించిన ఓలితోపాటు మరో నలుగురి పాస్‌పోర్టులు తాత్కాలికంగా పనిచేయకుండా స్తంభింపజేసింది. విచారణ పూర్తయిన తర్వాత ఓలి సహా ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. హోంశాఖ కార్యదర్శి గోవకర్ణ మణి దువాడి, జాతీయ దర్యాప్తు విభాగం ప్రధానాధిపతి హుతరాజ్ థాపా, ఖాట్మండు జిల్లా ప్రధానాధికారి ఛబి రిజాల్ పాస్‌పోర్టులను కూడా ఖాట్మండు లోయదాటి ఎటూ వెళ్ళకూడదు. జనరేషన్–జెడ్ ఉద్యమ అణచివేతపై దర్యాప్తు చేస్తున్న జ్యుడీషియల్ కమిషన్ చేసిన సిఫార్సు మేరకు హోం మంత్రిత్వశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కమిషన్ అధ్యక్షురాలు గౌరీ బహదూర్ కర్కి మాట్లాడుతూ, దర్యాప్తును వేగవంతం చేసేందుకు, వారిని జవాబుదారి చేసేందుకు వీలుగా ఈ ఆంక్షలు విధించినట్లు చెప్పారు. సోషల్ మీడియాపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ, దేశంలో విపరీతమైన అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై నిరసన ప్రదర్శకులు పార్లమెంటువైపు దూసుకువస్తుండగా సెప్టెంబరు ఎనిమిదోతేదీన పోలీసులు వారిని అణచివేసేందుకు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పార్లమెంటు లోపలా, చుట్టుపక్కల 19 మంది యువకులు మరణించారని హోంశాఖ గుర్తుచేసింది. ఆ తర్వాతి రోజుల్లో మృతులసంఖ్య 75కు పెరిగింది.

**దేశంలో ఉండే పోరాడతా: ఓలి**

తనకున్న ప్రజాస్వామ్యహక్కులన్నింటినీ రద్దుచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని కె.పి.శర్మ ఓలి విమర్శించారు. దేశం వదిలి తాను ఎక్కడికీ వెళ్ళేదిలేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఉండే తాను దేశంకోసం పోరాటం చేస్తానన్నారు. దేశం ఈ విధంగా సమస్యల్లో ఉన్న తరుణంలోతాడూ బొంగరంలేని ఈ ప్రభుత్వానికి అధికారం వదిలి తాను దేశం వదిలి ఎలా వెళతానని ఆయన ప్రశ్నించారు. తాను దేశం వదిలి వెళ్ళిపోతున్నట్లు వస్తున్న వార్తలను ఓలి తీవ్రంగా ఖండించారు. తాను ఎవరికీ భయపడేదిలేదని, దేశంలో శాంతి భద్రతలు, రాజ్యాంగ పాలన పునరుద్ధరణకు తాను కృషి చేస్తానన్నారు.

## అదో పెద్ద నేరస్థుల కుటుంబం!

11 మందికి చైనా కోర్టు ఉరిశిక్ష



**బీజింగ్:** చైనాలో నేరస్థుల ముఠాగా మారిన ఒక అతిపెద్ద కుటుంబానికి అక్కడి న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. ఈ కుటుంబంలో మొత్తం 39 మంది నేరస్థులున్నారు. వీరిలో 11 మందిని అతి తీవ్ర నేరస్థులుగా గుర్తించిన న్యాయస్థానం వారందరికీ ఉరిశిక్ష విధించింది. ఈ మింగ్ కుటుంబంలో చాలామంది సభ్యులున్నారు. వారిలో కొంతమందికి ఉరిశిక్షలు పడగా మిగిలినవారికి ఐదు నుండి 24 సంవత్సరాలపాటు సుదీర్ఘమైన జైలుశిక్షలు విధించారు. ఈ కుటుంబంలో కొంతమంది గ్యాబ్లింగ్ ద్వారా ప్రజలను మోసం చేసి నాలుగు బిలియన్ డాలర్లు దండుకున్నట్లు న్యాయస్థానం గుర్తించింది. ఈ పెద్ద కుటుంబంలో ఆ 39 మందీ వివిధ మార్గాలలో ప్రతి సంవత్సరం బిలియన్ల డాలర్లు మోసపూరితంగా దండుకుంటున్నారు. ఈ కుటుంబంలో అందరూ మయన్మార్ కేంద్రంగా ఆ దేశంలో అనేక నేరాలకు పాల్పడుతున్నారు. మయన్మార్‌ను కేంద్రంగా చేసుకుని ఈ కుటుంబంలోని సభ్యులందరూ స్కామ్ సెంటర్లు నడుపుతున్నారు. మయన్మార్‌లోని లాయుక్కైని పరిపాలించిన నాలుగు వంశాలలో ఒక వంశం తరపున ఈ మింగ్ కుటుంబం పనిచేస్తోంది. చైనా సరిహద్దుల్లో ఈ లాయుక్కై పట్టణం ఉంది. ఈ పట్టణంలో జూదం, మాదకద్రవ్యాల విక్రయంతోపాటు ఇతర అనేక అవినీతి కార్యకలాపాలు యథేచ్ఛగా సాగడానికి ఈ మింగ్ కుటుంబమే కారణం. ఈ ఘోరాలను తట్టుకోలేక మయన్మార్ ప్రభుత్వం 2023లో ఈ కుటుంబంలోని సభ్యులు అందరినీ అరెస్టు చేసి చైనా ప్రభుత్వానికి అప్పగించింది. చివరకు విచారణ తర్వాత సోమవారం ఈ కుటుంబసభ్యుల్లో 11 మందికి ఉరిశిక్షలను న్యాయస్థానం ఖరారు చేసింది.

## 100 శాతం టారిఫ్ (మొదటి పేజీ తరువాయి)

మేరకు పతనమయ్యా యి. అత్యాధునిక చిత్ర నిర్మాణంలో వివిధ రకాల సాంకేతిక వ్యవస్థలు వివిధ దేశాలలో కేంద్రీకృతమై ఉన్నాయి. షూటిం గ్ పూర్తయిన తర్వాత వివిధ రకాల ఎఫెక్ట్స్‌ను ఆ ఫిలిమ్‌లో నింపేందుకు కావాల్సిన వనరులు వివిధ దేశాలలో విస్తరించి ఉన్నాయి. పెట్టుబడులు సమకూర్చుకోవడంలో కూడా సహభాగస్వామ్యం పెరిగింది. పరిస్థితుల్ల సుంకాలను చిత్ర పరిశ్రమపై ఏ విధంగా ట్రంప్ అమలు చేస్తారో? అని ఈ ఏడాది ఆరంభంలోనే స్టూడియో ఎగ్జిక్యూటివ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ స్టూడియోల్లో కో–ప్రొడక్షన్ ఇప్పుడు సర్వసాధారణాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఇలాంటి భారీ చిత్రాలపై సుంకాలను ట్రంప్ ఏ విధంగా వర్గీకరిస్తారన్న సందేహాలు పొడసూపాయి. ఈ విషయాల్లో న్యాయ,వాణిజ్య విశ్లేషకులు అనేక సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. సినిమా అనేది మేధోపరమైన ఆస్తి అనీ, సేవలకు సంబంధించి ప్రపంచ వాణిజ్యంలో ఒక భాగమని వారు పేర్కొంటున్నారు. సినిమా పరిశ్రమపై కొరడా ఝుళిపించేందుకు ట్రంప్ అసాధారణ ప్రకటన చేశారు. ఈ వాణిజ్య రక్షణవాద విధానాలను సాంస్కృతిక పరిశ్రమకు కూడా విస్తరించడంవల్ల సరిహద్దులకు అతీతంగా విడుదలయ్యే చిత్రాలు నిర్మించే స్టూడియోల పైన, ఇంటర్నేషనల్ బాక్సాఫీస్ సహ–నిర్మాణాలు, ఖర్చులు–వసూళ్ళపైన నీలినీడలు కమ్ముకున్నాయి. అమెరికాలో విడుదలయ్యే తెలుసు చిత్రాలకు కూడా నష్టం కలుగుతుంది. అమెరికాలో తయారయ్యే చిత్రాలు అంతర్జాతీయ పోటీలో విదేశాల్లో ఉత్పత్తులు చేస్తున్న అమెరికా కంపెనీలు, భారీపరిశ్రమలు,సంస్థలను స్వదేశానికి రప్పించేందుకు కంకణం కట్టుకున్న ట్రంప్, స్వదేశానికి వస్తారా? లేక భారీ సుంకాలు కడతారా? అనే షరతు అందరికీ వర్తింపజేస్తున్నారు.

## నక్వీ తీరు ఆక్షేపణీయం (మొదటి పేజీ తరువాయి)

(ఐసిసి)కి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపింది. దుబాయ్‌లో చివరి వరకూ అత్యంత ఉత్కంఠ భరితంగా జరిగిన ఆసియా కప్ క్రికెట్ ట్వంటీ20 టోర్నమెంట్ ఫైనల్‌లో పాకిస్తాన్‌ను 5 వికెట్ల తేడాతో భారత్ ఓడించిన విషయం తెలిసిందే. విజేత జట్టుకు ట్రోఫీని, అదే విధంగా ఇతర వ్యక్తిగత పతకాలు కూడా అందించడానికి ఏర్పాటు చేసిన వేదికపై నక్వీతోపాటు, దుబాయ్ స్పోర్ట్స్ సిటీ అధ్యక్షుడు ఖలీద్ అల్ జరూనీ, మరికొందరు ప్రముఖులు ఉన్నారు. అయితే, భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమేగాక, పహల్గామ్ ఉగ్రవాద ఘటన, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై నక్వీ అభ్యంతరకరమైన పోస్టులు పెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. అతని నుంచి ట్రోఫీని తీసుకునేది లేదని టీమిండియా ఇది వరకే నిర్ణయించినట్టు, అంతకు ముందు చోటు చేసుకు న్న ఘటనలు చెప్పకనే చెప్తున్నాయి. ఫైనల్‌లో, అంతకు ముందు లీగ్, గ్రూప్ దశల్లో పాకిస్తాన్‌లో జరిగిన మ్యాచ్‌లలో ఆ జట్టు ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం కూడా చేయలేదు. అదే విధానాన్ని కొనసాగిస్తూ, నక్వీ నుంచి ట్రోఫీని స్వీకరించేది లేది మైదానంలోనే, ప్రెజెంటేషన్ వేదికకు కొద్ది దూరంలో టీమిండియా ఆటగాళ్లు బైఠాయించారు. మరోవైపు నక్వీ ట్రోఫీతో చాలాసేపు వేచి చూశాడు. సుమారు గంటన్నర సేపు ఈ హైడ్రామా కొనసాగింది. నక్వీ నుంచి కాకుండా, జరూనీ నుంచి ట్రోఫీని తీసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని భారత క్రికెటర్లు స్పష్టం చేశారు. పాక్ జట్టుకు రన్నరప్ చెక్‌ను, వ్యక్తిగత మెడల్స్‌ను అందచేసిన తర్వాత నక్వీ ఆసియా కప్ ట్రోఫీ, భారత క్రికెటర్లకు ఇవ్వాల్సిన ఇండివిజువల్ మెడల్స్ తీసుకొని వెళ్లిపోయారు. ఈ ఘటనపై బిసిసిఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్ కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నక్వీ, ట్రోఫీని తనతో తీసుకెళ్లడం సరికాదని, అత్యవసర సమావేశాన్ని నిర్వహించిన తర్వాత బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రోఫీని తనతో తీసుకెళ్లే హక్కు నక్వీకి లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై నవంబర్‌లో జరిగే ఐసిసి సమావేశంలో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

**మాకు ఎవరూ చెప్పలేదు..** పాకిస్తాన్ మంత్రి నక్వీ నుంచి ఆసియా కప్ ట్రోఫీని, ఇతర పతకాలను స్వీకరించవద్దని తమను ఎవరూ కోరలేదని భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నా డు. 'మన దేశంతో యుద్ధానికి సిద్ధమవుతున్న వ్యక్తి నుంచి ట్రోఫీని ఎలా తీసుకుంటాం' అని ప్రశ్నించాడు. అయితే, అంతకు ముందు బిసిసిఐ కార్యదర్శి సైకియా ముంబయిలో మీడియాతో మాట్లాడుతూ నక్వీ నుంచి ట్రోఫీ తీసుకోరాదని ఇది వరకే నిర్ణయించినట్టు చెప్పాడు. ఇలావుంటే, ఆసియా ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్ ఫీజును పుల్వామా బాధితులకు విరాళంగా ఇస్తున్నట్టు సూర్య కుమార్ యాదవ్ ప్రకటించాడు.

**క్రికెట్‌ను అవమానించాడు..** భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ క్రికెట్‌ను అవమానించాడని పాకిస్తాన్ సారథి సల్మాన్ అలీ అఘా విమర్శించారు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందు తనతో కరచాలనం చేసిన అతను, మ్యాచ్‌ల సమయంలో పూర్తి భిన్నంగా వ్యవహరించాడని అన్నాడు. ఆసియా కప్ ట్రోఫీ, ఇతర పతకాలను నక్వీ తనతో తీసుకెళ్లడాన్ని అఘా సమర్థించాడు. ఎసిసి చీఫ్‌గా అధికారాలను వినియోగించుకున్నాడని పేర్కొన్నారు.

## అసెంబ్లీలో తీర్మానం (మొదటి పేజీ తరువాయి)

(యుడిఎఫ్) ప్రతిపక్షకూటమి ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు ఇచ్చింది.ఈ తీర్మానంలో, భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను అమలు చేసేందుకు ముందుకు సాగడాన్ని 'తొందరపాటు చర్య'అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యను సభ సమర్థిస్తూ భారత ఎన్నికల సంఘం అవలంబిస్తున్న ధోరణిపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇసిఐ తీసుకుంటున్న ఈ చర్య వెనక 'దుర్మార్గపు ఉద్దేశం' దాగి ఉందని అనుమానిస్తున్నట్లు సిఎం పినరయి విజయన్ సభకు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించడానికి భారత ఎన్నిక ల సంఘం ముందుకుసాగడంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నప్పటికీ జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)ని అమలుచేయడానికి భారత ఎన్నికల సంఘం 'దొడ్డిదారి' ప్రయత్నం సాగించడాన్ని సిఎం పినరయి విజయన్ ఎత్తి చూపారు. బిహార్‌లో ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియపై అటువంటి ఆందోళనలను ధృవీకరిస్తున్నదని, ఇది 'బహిష్కరణ రాజకీయాలను' ప్రతిబింబిస్తున్నదని ముఖ్యమంత్రి విజయన్ ఆరోపించారు. బిహార్‌లో అమలుచేసిన ఎస్ఐఆర్ జాబితా నుండి అశాస్త్రీయ వ్యక్తీకరణలను ప్రజలు వెలిబుచ్చారని విజయన్ చెప్పారు. అదే నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం కంకణం కట్టుకున్నదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.బిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క రాజ్యాంగ చెల్లుబాటు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉండగా, ఎన్నికలు జరుగనున్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ అమలుచేసేందుకు భారత ఎన్నికల సంఘం చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యమంత్రి తీర్మానంలో ప్రశ్నించారు.'దీనిని అమాయకమైన చర్యగా చూడలేం' అని వామపక్ష దిగ్గజం పినరయి విజయన్ ఉద్ఘాటించారు. ఇది భారత ఎన్నికల సంఘంపై అనుమానపు నీడను కమ్మేస్తుందని ఆయన ఆరోపించారు. కేరళ రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగబోతున్నాయి. ఆ తర్వాత వెంటనే కేరళ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో హడావిడిగా ఎస్ఐఆర్‌ను నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించడం వెనక ఒక దుష్ట తలంపు దాగి ఉందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సభకు తెలిపారు.

## సినిమా పైరసీ (మొదటి పేజీ తరువాయి)

(21), తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్ఫంట్ రాజ్ అమలదాస్ (32), సుధాకరన్ (31), వనస్థలిపురంకు చెంది న జాన కిరణ్‌కుమార్ (29), గోవాకు చెందిన అర్సలాన్ అహ్మద్ (23)లు ఒక ముఠాగా ఏర్పడి బిహార్‌లోని పాట్నాలో అశ్వనికుమార్ ఇంట్లోనే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని హ్యాకింగ్‌కు పాల్పడ్డారని సివి ఆనంద్ తెలిపారు. ప్రధాన నిందితుడు అశ్వనికుమార్ సినిమా థియేటర్లలో సినిమా విడుదల కాకముందే హెచ్‌డి క్వాలిటీలో హ్యాకింగ్‌కు పాల్పడి పైరసీ సినిమాలు తయారు చేసి అమ్ముకునేవారన్నారు. దేశంలోని ఆయా థియేటర్లకు సినిమాను సరఫరా చేసే డిజిటల్ మీడియా కంపెనీల ప్రధాన సర్వర్‌లను ఈ ముఠా హ్యాక్ చేసిందన్నారు. సర్వర్‌లను హ్యాక్ చేయడం ద్వారా కాపీ చేసిన సినిమాలను గేమింగ్, బెట్టింగ్ ఆర్గనైజర్‌లతో పంచుకున్నారని తెలిపారు. తద్వా రా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ సైట్‌ల ప్రచార కంటెంట్, ప్రకటనలను అనుమతించినందుకు నెలకు వారి నుంచి $10,000 పారితోషికాన్ని క్రిప్టోకరెన్సీలో అందుకున్నారని తెలిపారు. తద్వారా ప్రధాన నిందితుడు రూ.2 కోట్లు సంపాదించాడన్నారు. సింగిల్ సినిమా పైరసీ అయ్యిందని జూన్ 5న తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి యర్రమనీంద్రబాబు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠా గుట్టు బయటపడిందన్నారు. మీడియా సమావేశంలో ఐపిఎస్ అధికారులు విశ్వప్రసాద్, ధారా కవిత, సిఐలు ఎస్.నరేష్, సతీష్‌రెడ్డి, ఎన్.దిలీప్‌కుమార్, కె.మధుసూదన్‌రావు ఎస్‌ఐలు సురేష్, మహిపాల్‌తో పాటు చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నిందితుల నుంచి డిజిటల్ పరిక రాలు, ల్యాప్టాప్లు, హార్డిస్కు, క్రిప్టో ట్రాన్సాక్షన్ వివరాలను స్వాధీనం చేసుకున్నారు.

## అంగీకరించడం లేదు? (మొదటి పేజీ తరువాయి)

తెండు ఆకులను ఆకుపచ్చ బంగారంగా భావిస్తారని పేర్కొన్నారు. అడవులు, భూముల నుంచి గిరిజనులను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ అటవీ భూములను అదానీ వంటి వ్యక్తులకు అప్పగించాలని భావిస్తోందని విమర్శించారు. ఇప్పటికే అదానీకి ఓడరేవులు, విమానాశ్రయాలను అప్పగించారని, ఇప్పుడు అడవులను అప్పగించనున్నారని, ఇంకా ఏమి మిగులుతుందన్నారు. నేడు మనం ఎలాంటి భారత దేశం లో ఉన్నామని, ఇది ప్రజాస్వామ్య గణతంత్రమేనా? అని రాజా నిలదీశారు.

వామపక్ష తీవ్రవాదులకు వామపక్షాలు సైద్ధాంతిక మద్దతును ఇస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన వ్యాఖ్యలకు అర్థమేమిటో ఆయనే చెప్పాలని అన్నారు. అర్బన్ నక్సలైట్లు లేదా గ్రామీణ నక్సలైట్‌లు నేటి ప్రభుత్వ విధానాలకు సవాలు విసురుతున్నారని, మితవాద తీవ్రవాదులు భారత జాతీయతను పునర్ నిర్వచించాలని, భారతీయ చరిత్రను తిరగరాయాలని కోరుకుంటున్నారని, వీళ్ళలో ఎవరు ప్రమాదకారులు అని ప్రశ్నించారు. ''వాళ్ళు భారతదేశాన్ని పునర్‌నిర్వచించాలని భావిస్తున్నారు.

భారతదేశం లౌకిక, ప్రజాతంత్ర గణతంత్ర దేశం. దీనిని మతపరమైన దేశంగా పునర్‌నిర్వచించకూడదు. వాళ్లు భారత చరిత్రను తిరగరాయకూడదు. ఎవరు ప్రమాదకారులు? అమిత్ షా హోం మంత్రి. ఆయన బాధ్యతాయుతంగా మాట్లాడాలి'' అని రాజా అన్నారు.

నక్సల్స్ ముక్త్ భారత్‌ను సృష్టిస్తామన్న ప్రభుత్వ ప్రకటనపై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ – ముక్త్ భారత్ ఏమైందని ప్రశ్నించారు. రేపు వాళ్ళే కమ్యూనిస్ట్–ముక్త్ భారత్ అంటారని, మనకు ఒక రాజ్యాంగం ఉందని, దానిని వారు అర్థం చేసుకోవాలని, రాజ్యాంగం స్పష్టంగా ఉందని, భారతదేశం లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర దేశమని రాజా స్పష్టం చేశారు. ఆదివారం జరిగిన ''నక్సల్స్ భారత్'' అనే సెమినార్ ముగింపు సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ మావోయిస్టులతో కాల్పుల విరమణ ఉండబోదని అన్నారు.

## బతుకమ్మ విశ్వవ్యాప్తం
(మొదటి పేజీ తరువాయి)

చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. తీరొక్క పూలతో పూలతో పేర్చిన భారీ బతుకమ్మ చుట్టూ మహిళలందరు ఆడిపాడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ ఓపల్ సూచాత, మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**అడబిడ్డలు అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి**

మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ బతుకమ్మ ఖ్యాతిని ప్రపంచానికి చాటామని అన్నారు. బతుకమ్మ అంటే విమలక్క, విమలక్క అంటే బతుకమ్మ అని కొనియాడారు. గిన్నీస్ బుక్ రికార్డ్ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. అడబిడ్డలు అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గల్లి నుంచి గ్లోబల్ వరకు ఏదైనా సాధిస్తామని మహిళలు చాటారని అన్నారు.

మహిళలు ఏ రంగంలోనైనా ముందడుగు వేస్తారని, రెండు నెలల కృషితో కార్యక్రమం విజయవంతమని వెల్లడించారు. ఈ వేడుకలో మిస్ వరల్డ్ ఓపల్ సూచాత కూడా పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడిన మిస్ వరల్డ్ తెలంగాణ కల్చర్, సెలబ్రేషన్ భిన్నంగా ఉంటుందని తెలిపారు. స్వశక్తితో మహిళలు పైకి రావాలని కోరారు.

మహిళగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని వెల్లడించారు. 'నారీ శక్తిని గుర్తించాలి. స్వశక్తితో మహిళలు పైకి రావాలి. మహిళగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది. తెలంగాణ కల్చర్, సెలబ్రేషన్ భిన్నంగా ఉంటుంది' అని అన్నారు.

**'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడుతున్న మహిళలు**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ వేడుకలతో హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, సరూర్‌నగర్ పరిసరాలు వెలుగులీనుతున్నాయి. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. హనుమకొండ, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, తదితర ప్రాంతాల్లో మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడారు.

## షెడ్యూల్ విడుదల (మొదటి పేజీ తరువాయి)

స్వీకరణ, 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన ఉంటుంది. 19 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామనేషన్లకు గడువు విధించిన అధికారులు ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. రెండు విడుతలకు సంబంధించి నవంబర్ 11వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు. ఒకవేళా ఎక్కడైనా రి ఎన్నికల అనివార్యమైతే ఇందుకు సంబంధించి ఎన్నికల తేదీలను తర్వాత ప్రకటించనున్నారు.

**గ్రామ పంచాయితీ మొదటి విడుత ఎన్నికలకు 17న నోటిఫికేషన్ 31న ఎన్నికలు :**

గ్రామ పంచాయితీ మొదటి విడుత ఎన్నికలకు సంబంధించి అక్టోబర్17న తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా అక్టోబర్ 31వ తేదీ (శుక్రవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. 17వ తేదీ నుంచి 19వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. 20వ తేదీన స్క్రూట్నీ, సాయంత్రం 5 గంటలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 21వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, 22 సాయంత్రం వరకు పరిశీలిస్తారు. 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు విధించిన అధికారులు ఆ తర్వాత తుది జాబితాను ప్రకటించనున్నారు.

గ్రామ పంచాయితీ రెండవ విడుత ఎన్నికలకు **21న నోటిఫికేషన్ నవంబర్ 4న ఎన్నికలు :**

గ్రామ పంచాయితీ మొదటి విడుత ఎన్నికలకు సంబంధించి అక్టోబర్21న తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా నవంబర్ 4వ తేదీ (మంగళవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. 21 నుంచి 23వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 24వ తేదీన స్క్రూట్నీ నిర్వహించి సాయంత్రం 5 గంటలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 25న అభ్యంతరాల స్కీకరణ, 26 సాయంత్రం వరకు పరిశీలిస్తారు.

27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు విధించిన అధికారులు ఆ తర్వాత తుది జాబితాను ప్రకటించనున్నా రు.

**గ్రామ పంచాయితీ మూడవ విడుత ఎన్నికలకు 25న నోటిఫికేషన్ నవంబర్ 8న ఎన్నికలు :**

గ్రామ పంచాయితీ మూడవ విడుత ఎన్నికలకుఅక్టోబర్ 25న తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబర్ 8వ తేదీ (శనివారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. 25వ తేదీ నుంచి 27వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. 28న స్క్రూట్నీ, సాయంత్రం 5 గంటలకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 29న అభ్యంతరాల స్కీకరణ, 30వ తేదీ సాయంత్రం వరకు పరిశీలన ఉంటుంది. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణ, ఆ తర్వాత అధికారులు తుది జాబితాను ప్రకటించనున్నారు.

| ఎన్నికల వివరాలు | |
|---|---|
| ఎన్నికల జరగనున్న జిల్లాలు సంఖ్య | 31 |
| ఎన్నికల జరగనున్న మండలాలు | 565 |
| ఎన్నికల జరగనున్న జెడ్‌పిటిసి స్థానాలు | 565 |
| ఎన్నికల జరగనున్న ఎంపిటిసిలు | 5749 |
| ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ స్టేషన్లు | 31300 |
| మొత్తం జెడ్‌పిటిసి, ఎంపిటిసి పోలింగ్ స్టేషన్లు | 15302 |
| ఎన్నికల జరగనున్న గ్రామ పంచాయితీలు | 2,733 |
| ఎన్నికల జరగనున్న వార్డులు | 1,12,288 |
| మొత్తం గ్రామ పంచాయితీ పోలింగ్ స్టేషన్లు | 1,12,474 |
| గ్రామ పంచాయితీ పోలింగ్ ప్రాంతాలు | 15522 |
| గ్రామీణ ప్రాంతాల మొత్తం ఓటర్లు | 1,67,03,168 |
| పురుష ఓటర్లు | 81,65,894 |
| మహిళా ఓటర్లు | 85,36,770 |
| ఇతర ఓటర్లు | 504 |

## భగ్గుమన్న పిఓకె
(మొదటి పేజీ తరువాయి)

(ఎఎసి) పిలుపు మేరకు ప్రజలు వేలాదిగా వీధుల్లోకి వచ్చారు. గడచిన 70 సంవత్సరాలుగా తమ మౌలిక హక్కులను అణచివేసి తిరస్కరిస్తున్నారని దీనికి వ్యతిరేకంగా ఈ పోరాటం చేస్తున్నట్లు ఎఎసి ప్రధాన నాయకుడు షౌకత్ నవాజ్ మిర్ ప్రకటించారు. నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు విక్రయించాలని, రాజకీయ సంస్కరణలు తీసుకురావాలని, ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆర్థిక సమస్యలు పట్టించుకోవడంలేదని, వారికి ఎలాంటి రాజకీయ హక్కులూ ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారని విమర్శించారు. ఏ వ్యవస్థపైనా తాము పోరాటం చేయడంలేదని, తమ హక్కుల కోసం పోరాడుతున్నామని ముజఫరాబాద్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ స్పష్టం చేశారు. ఇప్పటివరకూ జరిగిందేదో జరిగిపోయింది, ఇప్పుడు మా హక్కులు మాకు ఇవ్వండి, లేదా ప్రజల నిరసన ఎదుర్కోండి అని ఆయన హెచ్చరించారు. అనేకరోజులుగా పిఓకే పాలకులకు, ఎఎసి నాయకులకు మధ్య జరుగుతున్న చర్చలు విఫలమై ప్రతిష్టంభన ఏర్పడిన తర్వాత ఈ ప్రజా నిరసన వెల్లువెత్తింది. ఎఎసి డిమాండ్లను ప్రభుత్వ ప్రతినిధులు నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పెద్దసంఖ్యలో భద్రతా దళాలను రంగంలోకి దింపింది. ప్రజలమధ్య ఒకరి నుండి మరొకరికి సమాచారం ప్రసారం కాకుండా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. ఇటీవలికాలో అవామీ యాక్షన్ కమిటీ ప్రజల్లో ఎంతో అభిమానం, ప్రాచుర్యం సంపాదించుకుంది. దశాబ్దాలుగా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ప్రజలను అభివృద్ధి పథం నుండి పక్కకునెట్టేసి వారిపై ప్రభుత్వం పెనుభారాలు విధిస్తోందని, రాజకీయంగా,ఆర్థికంగా ప్రజలను ప్రధాన స్రవంతికి దూరంచేసిందని అవామీ యాక్షన్ కమిటీ విమర్శిస్తూ వేలాదిమంది ప్రజలను సమీకరించింది. 38 అంశాలతో కూడిన ఒక ఛార్టర్‌ను ప్రభుత్వం ముందు ఉంచింది. పాకిస్థాన్‌లో నివసిస్తున్న కశ్మీరీ శరణార్థులకు పిఓకె అసెంబ్లీలో రిజర్వు చేసిన 12 సీట్లు తక్షణం రద్దుచేయాలని, వ్యవస్థీకృతమైన సంస్కరణలు చేపట్టాలని కమిటీ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. స్థానిక చట్టసభలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యానికి విలువా లేకుండాపోయిందని, స్థానిక ప్రజలకు విలువ ఇవ్వడంలేదని 38 అంశాల ఛార్టర్‌లో ఎఎసి విమర్శించింది. పాక్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం పరిష్కరించాలని కోరింది. ఈ డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరిగిందని విమర్శించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఏ ఎన్నికల్లోనైనా విజయం బిఆర్ఎస్‌దే : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడ ఎన్నికలైనా బిఆర్ఎస్ గెలుస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ప్రదీప్ చౌదరి, కెటిఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అబద్ధపు హామీలను గుర్తుచేసేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. కాంగ్రెస్ అభయ హస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారిందని ఎద్దేవా చేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకున్నట్టుగా, హైదరాబాద్ నగరం సమస్యలతో ఆగమాగం అవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నగరం కడతానంటూ ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వ అసమర్థతతో హైదరాబాద్‌లో చెత్త తీసేవారు కరువయ్యారని, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని ఆరోపించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారు, ఆశీర్వదిస్తారు

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/మధిర : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఆదరిస్తారు, ఆశీర్వదిస్తారని డిప్యూటీ సిఎం మలుల భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం మధిర క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరిచేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనస్సులకు బాగా తెలుసునని అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం బిసిలకు దశాబ్దాల కోరికను నెరవేర్చిందని అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. మీ కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బిఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితలకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బిఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదన్నారు. లక్ష రూపాయల రుణమాఫిని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేక పోయారని విమర్శించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లకు అందరూ సహకరించాలి

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం / హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల వల్ల ఎవరికీ అన్యాయం జరగదని ఆయన స్పష్టం చేశారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఉందని కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, దానిలో మార్పులు చేసుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందన్న ఆయన వివరించారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలు కూడా రిజర్వేషన్లకు మద్దతిచ్చాయని, మళ్లీ మాట మార్చకుండా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అందరి మద్దతుతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకెళ్తామని, ఇదే విషయాన్ని న్యాయస్థానంలోనూ ప్రస్తావిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



## హ్యాకింగ్‌కు ఇలా బ్రేక్ వేయండి

సినీ ప్రముఖులకు వివరించిన సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమాలు పైరసీ, హ్యాకింగ్‌ల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ చిత్ర పరిశ్రమ పెద్దలకు వివరించారు. తెలుగు సినిమా పరిశ్రమలోని హీరోలు, నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిజిటల్ పంపిణీ భాగస్వాములతో బంజారాహిల్స్‌లోని ఐసిసిసి భవనంలో సోమవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని సివి ఆనంద్ నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్ర పరిశ్రమ నుంచి చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, నాని, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి. వెంకట రమణ రెడ్డి (దిల్ రాజు) హాజరయ్యారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ..విడుదల కాకముందే సినిమాలను ఎలా హ్యాక్ చేస్తున్నారే విషయాన్ని ఆనంద్ వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. సినిమాలు హ్యాకింగ్, పైరసీ కాకుండా అడ్డుకట్ట వేసేందుకు తగు జాగ్రత్తలను వారికి వివరించారు. కంటిమీద కునుకులేకుండా చేసిన హ్యాకర్లను పట్టుకున్నందుకు చిత్రపరిశ్రమకు చెందిన వారందరు సివి ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.



## కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్ర రూపం

మొదటి ప్రమాద హెచ్చరికను దాటిన వరద ప్రవాహం

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికార యంత్రాంగం

ప్రజాపక్షం/కాళేశ్వరం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సోమవారం గోదావరి ఉగ్ర రూపం దాల్చి పరవళ్ళు తొక్కుతోంది. ఎగువలోని గోదావరి బేసిన్ ప్రాంతాల నుండి శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలోకి వరద నీరు భారీగా చేరుతుండటంతో బ్యారేజి గేట్లు ఎత్తి భారీ స్థాయిలో వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుండి ప్రవహిస్తున్న ప్రాణహిత వరద ఉధృతి పోటెత్తి కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం వద్ద గోదావరిలో వచ్చి చేరుతుండటంతో గోదావరి ఉగ్ర రూపం దాల్చి ఉరకలేస్తోంది.కాళేశ్వరం తీరం వద్ద గోదావరి వరద ఉధృతి అంతకంతకు పెరిగి 12.210 మీటర్ల నీటిమట్టం వద్ద జారీ చేసిన మొదటి ప్రమాద హెచ్చరికను దాటి సాయంత్రానికల్లా 13.240 మీటర్ల నీటిమట్టానికి చేరి డేంజర్ లెవల్ హెచ్చరిక చేరువలో వరద ప్రవాహం కొనసాగుతోంది.ఇదే విధంగా వరద నీరు 13.460 మీటర్ల నీటిమట్టానికి చేరితే అధికారికంగా డేంజర్ లెవల్ హెచ్చరిక ప్రకటన జారీ చేయనున్నారు. గోదావరి, ప్రాణహిత ఉభయ నదుల వరద ఉధృతి పోటెత్తి సోమవారం సాయంత్రానికల్లా 11.37 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ఉధృత రూపం దాల్చి పరుగులు పెడుతోంది. పుష్కర ఘాట్ తీరం వద్ద స్నాన ఘట్టాలను వరద నీరు పూర్తిగా ముంచెత్తగా, సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద జ్ఞాన దీపాలను ముంచెత్తి గోదావరి జలకళ సంతరించుకుని నిండుకుండలా మారింది. గోదావరి వరద ఉధృతి భారీగా పెరుగుతుండటంతో గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి వరద ఉధృతి పెరిగి మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల పంట భూములు బ్యాక్ వాటర్ తో నీట మునిగాయి.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ వేడుకలు

తొమ్మిదో రోజున ఘనంగా ముగింపు సంబురాలు

జనసంద్రంగా మారిన పద్మాక్షి, ఉర్సు గుట్ట



ప్రజాపక్షం/హనుమకొండ : సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. చారిత్రక కాకతీయుల రాజధాని ఓరుగల్లులో మహిళలు అంగరంగవైభవంగా జరుపుకున్న బతుకమ్మ సంబురాలు మిన్నంటాయి. వరంగల్, హన్మకొండ జంట జిల్లాల కేంద్రాలలోని పద్మాక్షమ్మ గుడి,వెయ్యి స్తంబాల గుడి,కాశీబుగ్గ, వరంగల్ ఉర్సుగుట్ట వద్ద బతుకమ్మ వేడుకలలో మహిళలు పెద్ద ఎత్తున వేలాదిగా పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన సద్దుల బతుకమ్మలతో రాత్రి 8 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో కొనసాగింది. ఆయా ప్రాంతాలలో రాత్రి వరకు బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు భారీ ఎత్తున వేడుకలు జరుపుకున్నారు. ఆడపడుచులంతా పల్లె ప్రాంతాల్లో దొరికే గునుగు, తంగేడు, గుమ్మడి పువ్వులు తీసుకువచ్చి బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో తొమ్మిదిరోజుల పాటు పూజలు చేసి తొమ్మదవ రోజు పోయిరా బతుకమ్మ అంటూ వీడ్కోలు అంటూ వీడ్కోలు పలికారు. చిన్నపెద్దలంతా కలిసి పట్టణంలో మహిళలు, యువతులంతా రంగురంగుల పువ్వుల కలర్లతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులంతా ఒక చోటికి చేరుకొని ఆటపాటలతో సందడిగా కోలాటాలు వేస్తూ పాటలు పాడుతూ.. ఆనందంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. తొమ్మిది రోజులు పూజలు చేసిన బతుకమ్మలను కోనేరులో నిమజ్జనం చేసి పోయిరా బతుకమ్మ పోయి రావమ్మా అంటూ బతుకమ్మలను నీళ్లలో నిమజ్జనం చేశారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఈవేడుకలు అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మతో ఉత్సవాలను ముగించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. దీంతో ఉమ్మడి జిల్లా అంతటా బతుకమ్మ వేడుకలు కన్నులపండువగా, అంగరంగవైభవంగా కొనసాగాయి. గతంలో రెండు, మూడు సంవత్సరాలు సద్దుల బతుకమ్మ రోజే భారీ వర్షాలు కురవగా ఈ సంవత్సరం కూడా సద్దుల బతుకమ్మ వేడుకలకు ముందే వర్షం కురిసింది. హనుమకొండ నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా సోమవారం రాత్రి ముగిశాయి. జిల్లా యంత్రాంగం, వరంగల్ నగర పాలక సంస్థ బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. హనుమకొండ 4వ డివిజన్ యాదవనగర్ చెరువుకట్టపై, 5వ డివిజన్‌లో హనుమాన్ నగర్‌లో కెనాల్ కట్టపై, వడ్డెపల్లిలోని చెరువు కట్టపై మహిళలు, యువతులు బతుకమ్మలతో పెద్ద ఎత్తున తరలివచ్చి నీళ్లలో నిమజ్జనం చేశారు.

### సద్దుల బతుకమ్మకు సిఎం శుభాకాంక్షలు

## ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో తయారు చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు . తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని అన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు రాష్ట్రమంతటా అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి, సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ప్రభుత్వం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించదని తెలిపారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని, చెరువులు, కుంటలను పదిలంగా కాపాడి భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందిస్తుందని, అందుకే అంబర్ పేట్ లో బతుకమ్మ కుంటను పునరుద్ధరించామని గుర్తు చేశారు.

## మావోయిస్టుల పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : మావోయిస్టులతో చర్చలు జరపబోమని వారి అంతం చూస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం దేశంలో కేంద్ర హోంమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. మావోయిస్టులతో తక్షణమే చర్చలు జరిపి ఆపరేషన్ కగారును నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులు కానీ, కమ్యూనిస్టులు కానీ అంతరాలు లేని సమాజాన్ని కోరుకుంటాయని, దేశ స్వాతంత్ర ఉద్యమం కూడా భూమికోసం భుక్తి కోసం స్వేచ్ఛ కోసం పోరాటం జరిగిందన్నారు. స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలలో లక్షల కోట్లకు అంబానీ అదాని లాంటివారు పరిగెడుతున్నా తిండి లేక లక్షాలాది మంది భిక్షాటన చేస్తున్నరన్నారు. బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అంతరాలు మరింత పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని అన్నారు. అమిత్ షా ఆపరేషన్ కగారు పేరుతో నక్సలైట్లను చంపడం పట్ల ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, ప్రగతిశీల శక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్చలు తర్వాతనే దేశ స్వాతంత్రం సిద్ధించిందనీ మావోయిస్టుతో ఆర్థిక, సామాజిక చర్చలు జరిపి పరిష్కరించాలని చాడా డిమాండ్ చేశారు.

## వాస్తవాలకు అద్దంపడుతూ వార్తలను అందించాలి

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇల్లు లేని జర్నలిస్టులకు ఇంటి సదుపాయాన్ని కల్పించాలని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా హెల్త్ కార్డులను మంజూరు చేసే అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఒకరి కోసం అందరూ, అందరి కోసం ఒకరు అన్నట్టుగా జర్నలిస్టులంతా ఒకరికొకరు తోడుగా ఉండాలని, వాస్తవాలకు అద్దం పడుతూ వార్తలను అందించాలని, విశ్వసనీయత పెరిగేలా సమాచారాన్ని అందించాలని సూచించారు. ఇటీవల మరణించిన 18 మంది జర్నలిస్టు కుటుంబ సభ్యులకు హైదరాబాద్, నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంకతో కలిసి మంత్రి సీతక్క ఒక లక్ష రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కొన్ని యాజమాన్యాలు వ్యతిరేకించినప్పటికీ జర్నలిస్టులు మాత్రం వెనక్కి తగ్గకుండా ఉద్యమ వ్యాప్తికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదని అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డ్యూటీలో భాగంగా మరణించిన జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తుందన్నారు. జర్నలిస్టులకు శిక్షణతో పాటు చికిత్స, దురదృష్టవశాత్తు మరణిస్తే ఆర్థిక చేయూత అందిస్తున్నామని, జర్నలిస్టు కుటుంబం ఒంటరి కాదని చెప్పడానికి, ఆ కుటుంబానికి తాము అన్నిరకాలుగా అండగా ఉంటున్నామని మంత్రి వివరించారు. మరణించిన జర్నలిస్టు కుటుంబంతో అనుబంధాన్ని కొనసాగిస్తామని, వారికి తోడుగా, తోబుట్టువుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. నిజమైన వార్త వ్యక్తిగత ప్రయోజనాలను కాకుండా ఎల్లప్పుడు సామాజిక ప్రయోజనాన్ని కోరుకుంటుందని, ఈ విధానాన్ని నిలబెట్టుకోవాలని మంత్రి సీతక్క కోరారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు వేతన వ్యవస్థ ఉన్నప్పటికీ హైదరాబాద్, జిల్లా కేంద్రం తప్ప మిగతా ప్రాంతాల్లో అమలు కావడం లేదన్నారు. గతంతో పోలిస్తే మూడింతలు జర్నలిస్టులపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టులకు వృత్తిపరమైన శిక్షణ ఇస్తున్నామని, ఇటీవల 'ఎఐ' వర్క్‌షాపును నిర్వహించామని శ్రీనివాస్ రెడ్డి వివరించారు. సి.హెచ్ ప్రియాంక మాట్లాడుతూ డిపిఆర్‌ఒలకు 'మీడియా అకాడమీ ఆడిటోరియం'లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నామని తెలిపారు.





## ఇక నుంచి మా వాళ్లు బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేయరు

ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇకపై సిని పరిశ్రమకు చెందిన హీరోలు, హీరోయిన్‌లు మరే వరైనా బెట్టింగ్ యాప్ యాడ్‌లో నటించరని ఎఫ్‌డిసి చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజ్ స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా కీలకమైన పైరసీ ముఠాను పట్టుకున్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌తో పాటు సైబర్ క్రైమ్ పోలీసు బృందాన్ని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తెలియక చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ హీరోలు, హీరోయిన్‌లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే యాడ్‌లో పాలు పంచుకున్నారన్నారు. ఈ ఉదంతంపై ఇడి, సిఐడి పోలీసులు దర్యాప్తు చేయడంతో బెట్టింగ్ యాప్‌ల నిజ స్వరూపం తమకు తెలిసిందన్నారు. సినీ ఇండస్ట్రీ నుంచి ఏ ఒక్కరూ బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేయరంటూ గతంలో తెలియక ప్రమోట్ చేశారని అసలు బెట్టింగ్ యాప్‌లు ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలిశాక ఆశ్చర్యపోయామని ఆయన తెలిపారు.

# 'స్థానిక' సమరానికి బిజెపి సై

కరీంనగర్, సిరిసిల్ల జడ్‌పి పీఠాలను కైవసం చేసుకుంటాం

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బిజెపి సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ' నాకు రాజకీయ జన్మనిచ్చిన కరీంనగర్ పార్లమెంటు ప్రజల కోసం, కాషాయ జెండాను నమ్ముకున్న నా కాషాయ జెండాను నమ్ముకున్న నా కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు.. గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు నేను సిద్ధం.. స్థానిక సమరంలో ఈసారి బిజెపి కొత్త చరిత్రను లిఖించబోతోంది. కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం అని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బిజెపి అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బిజెపి కార్యకర్తలకే ఈసారి ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని ప్రకటించారు.

టిక్కెట్లు ఇవ్వడంతో పాటు గెలిపించుకుని కాషాయ కార్యకర్తల నుదుటిన విజయతిలకం దిద్దుతామని తెలిపారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. నాటి బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాల వల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. గత బిఆర్ఎస్ పాలనలో పంచాయతీలకు నిధులివ్వకపోవడమే కాక అభివృద్ధి పేరుతో నాటి సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా వేధించింది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పైసల్లేవంటూ స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా ఈ పార్టీ చేతులెత్తేసింది. దేశ చరిత్రలో 22 నెలలుగా పంచాయతీలకు నయాపైసా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలంగాణ మాత్రమే. పంచాయతీ సిబ్బంది జీతాలివ్వడం లేదు. ట్రాక్టర్లకు డీజిల్ పైసలు సైతం ఇయ్యడం లేదు. పంచాయతీల్లో అంతో ఇంతో అభివృద్ధి చెందుతోందంటే ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వమే కారణం. ఏటా క్రమం తప్పకుండా పంచాయతీలకు ఠంచన్‌గా నిధులను ఇస్తోంది కేంద్ర ప్రభుత్వమే.. జాతీయ ఉపాధి హామీ పథకం మొదలు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (సిఆర్ఐఎఫ్), ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన దాకా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో చేస్తున్నవే. ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతామన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పల్లె పల్లెకూ వివరిస్తాం. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ చేసిన పాపాలను సైతం వివరించి ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం. పొరపాటున కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మాయమాటలు నమ్మి గెలిపిస్తే ఈసారి ఊరు వల్ల కాదు అవుతుందనే వాస్తవాన్ని ప్రజల ముందుంచుతాం. గెలుపే గీటురాయిగా భావించి టిక్కెట్లు ఇస్తాం.. కొన్ని చోట్ల గెలిచే అవకాశం లేకపోయినా రిజర్వేషన్ల మూలంగా టిక్కెట్లు రాకపోయినా నిరాశ చెందవద్దు. వారికి పార్టీలో, ఇతరత్రా పదవుల్లో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తాం. అంతిమంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాలు సాధించి కాషాయజెండా సత్తాను చాటాలని కోరారు.




## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 31 అర్జీలను, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థలు కలెక్టర్ భాస్కరరావుతో కలసి అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లాపంచాయతీ మున్సిపాలిటీ, సర్వే ల్యాండ్, హౌసింగ్, వైద్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పిడి విజయసింగ్ పాల్గొన్నారు.

## హమాలీలకు దసరా బోనస్ పంపిణీ



**ప్రజాపక్షం/యాదాద్రి :** దసరా పండుగను పురస్కరించుకొని సోవారం జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ జి.వీరారెడ్డి జిల్లాలో ఉన్న పౌరసరఫరాల సంస్థ గోదాంలో పనిచేస్తున్న 91 మంది హమాలీలకు మరియు 5 మంది స్వీపర్లకు దసరా బోనస్ ఒకరికి రూ.7500 చొప్పున మరియు రూ.900ల విలువ గల స్వీట్ బాక్సులు అందజేశారు. అదేవిధంగా ప్రతి ఒక్క హమాలీకి 2 జతల బట్టలు మరియు స్వీపర్స్‌కు 2 జతల చీరలు దసరా పండగ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ డి.హరికృష్ణ, ఆఫీసు సిబ్బంది కె.గణేష్, హమాలీలు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్ సాధించడం బిసి హక్కుల సమితి విజయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సాధించడం బిసి హక్కుల సమితి సాధించిన విజయమని బిసి హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించడం వెనుక బిసిల హక్కుల సాధన సమితి చేసిన అసమాన పోరాట చరిత్ర ఉందన్నారు. సోమవారం పట్టణంలోని బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా బిసిలు ఎదుర్కొన్న అనేక అవమానాలపై రాజీలేని పోరాటాలు చేశామన్నారు. గత 79 సంవత్సరాలుగా ఎంతో నష్టపోయామని ఇక నష్టపోతానికి వీల్లేదని భావితరాలకు మన త్యాగాలతో పునాదులు వేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు యల్లం యాదగిరి, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధే లక్ష్యం

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణాభివృద్ధే లక్ష్యంగా తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన రూ.6.60కోట్లతో పట్టణ శివారులోని పందిర్లపల్లి పెద్దచెరువు, చిన్నచెరువులకు మరమ్మతు పనులు, 15వ ఫైనాన్స్ జనరల్ ఫండ్స్ కింద మంజూరైన రూ.6.80కోట్లతో పట్టణంలోని పలు చోట్ల నూతన డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని రూ.93కోట్లతో నూతన నీటి సరఫరా పనులను చేపడుతున్నామని అవి పూర్తికాగానే కొత్తగా 6800 ఇండ్లకు నీటి సరఫరా చేపడ్తామన్నారు. అదేవిధంగా రూ.171కోట్లతో 136కి.మీ మేరా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, టీయుఎఫ్ఐడీసీ ఫండ్స్ ద్వారా రూ.93కోట్లతో సీసీ రోడ్లు, టాకా రోడ్డు వెడల్పు పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేలో భాగంగా ఈ సోమవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 25 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చి న ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.

## భువనగిరిలో దొంగనోట్ల కలకలం

పోలీసుల కేసు నమోదు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి జిల్లా కేంద్రంలో దొంగనోట్లు కలకలం సృష్టించాయి. నకిలీ రూ.500 నోట్లతో తిరుగుతున్న అంతరాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కునూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల నాగేంద్రబాబు భువనగిరిలోని కిలానగర్‌లో మొబైల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్దకు ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన దగ్గర రూ.11 వేల నగదు ఉందని తన బంధువులకు ఫోన్ పే చేయాలి అని రిక్వెస్ట్ చేశాడు. అట్టి మొబైల్ షాప్ ఓనర్ తన యొక్క ఫోన్ పే ద్వారా అతను చెప్పిన నెంబర్కు ఫోన్ పే చేశాడు. తర్వాత అట్టి వ్యక్తి ఇచ్చినటువంటి ర.11,000 నగదును తీసుకున్నాడు. అ తర్వాత చెక్ చేయగా అవి నకిలీవని గుర్తించాడు. ఇట్టి నకిలీ నోట్లను నిజమైన నోట్లుగా నమ్మపలికి మార్చినటువంటి వ్యక్తి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## గ్రూప్(-) 2 ఫలితాల్లో ఎంపిఒగా రజిత



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించినటువంటి గ్రూప్2 ఫలితాల్లో ర్యాంక్ 850 తో శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన జాల రజితకు మండల పంచాయతీ అధికారిగాని యామకం కావడం జరిగింది.అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించి పదవ తరగతి వల్లాల ఆదర్శ పాఠశాలలో చదివి ఇంటర్మీడియట్ కూడా వల్లాల మోడల్ కళాశాలలో,డిగ్రీ మల్లికార్జున డిగ్రి కాలేజీలో పూర్తి చేసి చిన్నతనం నుండే చదువుపై ఆసక్తి పెంచుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్ 2 ఫలితాల్లో మండల పంచాయతీ అధికారిగా నియామకవడం జరిగింది. ఆమె నియామకం పట్ల వారి కుటుంబ బంధుమిత్రులు,గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధిపై బిఆర్ఎస్ నేతలు చర్చకు రావాలి

మతితప్పిన జగదీష్‌రెడ్డిని గొల్లగూడ ఆస్పత్రిలో చేర్పించాలి

ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అధికారం కోల్పోయిన తర్వాత మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మతి తప్పి సోయి లేకుండా మాట్లాడుతున్నారని తక్షణమే గొల్లగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని డిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డితో కలిసి బిఆర్ఎస్ బాకీ కార్డుల పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రాజెక్టుల పేరుతో పేదల సొమ్మును దోచుకుతుందని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు.ఎస్సిలకు మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామని చెప్పి బాకీ పడిందని ఎద్దేవ చేశారు.అదేవిధంగా రైతులకు రుణమాఫీ ఐదు సంవత్సరాల వడ్డీ బాకీ,నిరుద్యోగులకు నెలకు రూ.3000,డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బాకీ పడిందన్నారు. వీటన్నింటినీ విస్మరించి ప్రజలను మోసం చేసిందని అన్నారు. తిప్పర్తిలో ఆరు గ్యారెంటీలపై విడుదల చేసిన కార్డుపై నల్లగొండ సెంటర్లో చర్చకు రావాలని సవాల్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 24 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత మా కాంగ్రెస్ పార్టీదే అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి మీకు, మీ చెంచాలకు లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప్ రెడ్డి, నరేష్ పురం దేవాలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ షబ్బీర్ బాబా, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గా అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగ రాజు పాల్గొన్నారు.

# రామచంద్రం త్యాగం గొప్పది : ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాతో రామచంద్రం చేసిన పోరాటాలు త్యాగాలు ఎంతో గొప్పవి అని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. ఖుదాబక్షపల్లి గ్రామ శాఖ సీనియర్ నాయకులు అయితగోని రామచంద్రం స్మారక స్థూపంను మాజీ ఎంఎల్ఏ ఉజ్జిని యాదగిరి రావుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌సి సత్యం మాట్లాడుతూ పోలీసుల నిర్బంధం, జైల్లు,ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కరుడుగట్టిన కమ్యూనిస్టువాదిగా రామచంద్రం త్యాగం వారి పట్టుదల ఎంతో గొప్పది అని కొనియాడరు. ఉజ్జిని యాదగిరి రావు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో పార్టీ పటిష్టమైన నిర్మాణం కలిగి ఉండడంలో రామచంద్రం పాత్ర ప్రాముఖ్యమైనదన్నారు. అమరజీవి ఎరజాల రాములు నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీలో చేరి పార్టీ కష్టన ష్టాల్లో ఉన్న తన వంతు సహాయ సహకారం అందించి గ్రామంలో అనేకమార్లు సర్పంచ్‌గా, సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎంపిటిసిలు గా గెలవడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమలో సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి శిరగోని బలరాం,ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు చెల్లం పాండురంగా రావు,సిపిఐమండల కన్వీనర్ బుర్ర శేఖర్, బిక్షం రెడ్డి, కళ్లెం యాదిరెడ్డి,ఆకుల రఘుమయ్య,ఎరుకలి నిరంజన్, ఇస్కిల్లా మహేందర్,గ్రామశాఖ కార్యదర్శి మేతరీ యాదయ్య,పొట్ట అశోక్,ఎరుజాల మహేందర్, ఈదయ్య పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ సత్యంకు భూ నిర్వాసితుల వినతి**

మండలములోని చర్లగూడెం భూ నిర్వాసిత రైతులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఖుదాబక్షపల్లి వచ్చిన సందర్భంగా చర్లగూడెం భూ నిర్వాసిత రైతులు కేవలం నష్టపరిహారం ఇచ్చి ఇండ్లు సర్వే చేసి డిఎల్ ఐఎస్ నెంబర్స్ వేసి ఇంతవరకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయలేదని నిర్వాసిత రైతులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులతో మాట్లాడి ప్యాకేజీ ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.

# నియమావళిని తు.చ తప్పకుండా పాటించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపిటిసి,జడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ తప్పకుండా పాటించాలని ఆమె అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం, గ్రౌండింగ్ వంటివి చేయకూడదని తెలిపారు . ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్ ఎస్‌టి, ఎస్ఎస్ టి బృందాలు పక్కగా పని చేయాలని అన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులతో ఎలాంటి సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు, సమీక్షలు నిర్వహించకూడదని, వారితో సమావేశాలలో పాల్గొనకూడదని చెప్పారు. ఇది వరకే ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు, అమలవుతున్న పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లా అంతటా గ్రామపంచాయతీ, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. ప్రత్యేకించి ముఖ్యమైన తాగునీరు, వైద్యం వంటి అత్యవసర పనులు కొనసాగుతాయని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు, ఎంపిటిసి,జడ్పిటిసి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయి వరకు అధికారులు అందరూ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలపై పూర్తిగా స్పష్టత కలిగి ఉండాలని ఆదేశించారు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున జిల్లా వ్యాప్తంగా ఎక్కడ రాజకీయ పార్టీలకు సంబంధించిన ,ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోయార్డింగులు, కటౌట్లు ,పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్‌డిఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా అధికారులు ఉన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంకండి



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు కావల్సిన వ్యూహాన్ని రచించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే కలిసి వచ్చే శక్తులతో ముందుకు సాగాలని తద్వారా పార్టీ బలోపేతానికి బలమైన ప్రయత్నాలు చేయాలని ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో సాధ్యమైన ఎక్కువ కేంద్రాలలో పోటీచేసి పార్టీ యొక్క విస్తరణలో భాగంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గతంలో గెలిచిన స్థానాలతో పాటు గతంలో రెండవ స్థానంలో నిలిచిన అన్ని స్థానాల్లో కూడా పోటీచేయాలని ఇటీవల కాలంలో తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలలో పార్టీ విస్తరించిందని అందుకు తగ్గట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పార్టీని మరింత విస్తృతపరచాలని ఆయన కోరారు. సమావేశానికి బద్దం కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేధికను ప్రవేశపెట్టగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, దూళిపాల ధనుంజయ నాయుడు, యల్లంల యాదగిరి, మేకల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, పోకల వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, బూర వెంకటేశ్వర్లు, సాయబెల్లి, దేవరం మల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జడ్పిటిసి, ఎంపిటిసి,సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుమిదినికి తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుమిదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు, పంచాయతీరాజ్ తదితర అధికారులతో ఎన్నికలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ త్రిపాఠి తెలియజేస్తూ జిల్లాలో రెండు విడతల్లో ఎంఎంపిటిసి,జడ్పిటిసి ఎన్నికలను నిర్వహించేందుకు ఆదేశించిన ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ,మొదటి విడతన నల్లగొండ, దేవరకొండ డివిజన్లకు సంబంధించి 18 , రెండవ విడతన చండూరు ,మిర్యాలగూడ డివిజన్లకు సంబంధించి 15 జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత నల్లగొండ, చండూరు డివిజన్లకు సంబంధించి 318 గ్రామపంచాయతీలు , రెండవ విడత మిర్యాలగూడ డివిజన్లోని 282 గ్రామపంచాయతీలు, మూడవ విడతన దేవరకొండ డివిజన్ పరిధిలోని 269 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలీస్ పరంగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను చేయడమే కాకుండా, ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులను పటిష్టం చేస్తామని ,కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసీపి మౌనిక, జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఆర్‌డిఓలు వై.అశోక్ రెడ్డి,రమణారెడ్డి , శ్రీదేవి, డిఈఓ బిక్షపతి, ఆటిఓ లావణ్య,ఇతర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

## అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గ్రామ పంచాయితీ, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో అధికారులు కమిషన్ ఆదేశాలకు లోబడి విధులు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలు చేయడం, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులతో ఎలాంటి సమావేశాలు, అధికారిక కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహించకూడదని చెప్పారు. ఇంతకు ముందు ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు, అమలులో ఉన్న పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అంతట గ్రామ పంచాయితీ, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు కోడ్ కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రభుత్వ పథకాల హోర్డింగ్‌లు, కటౌట్‌లు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి సిద్దార్థ, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మ, సంక్షేమ అధికారులు దయానందరాణి, శంకర్, శ్రీనివాస్, నర్సింహారావు పాల్గొన్నారు.

**అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు ఎన్నికల కమీషన్ ఆదేశాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పిటిసి, ఎంపిటిసి, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి ప్రొసీడింగ్ అధికారులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలన్నారు. ఇలాంటివి శాంతిభద్రతల మీద తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. అధికారుల కరదీపిక పుస్తకాన్ని క్షుణ్ణంగా చదువుకొని అర్థం కాని పక్షంలో మాస్టర్ ట్రైనర్స్‌ను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. మండలాల్లో పిఓ, ఓపిఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్పి సిఇఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, మాస్టర్ ట్రైనర్ రమేష్ పాల్గొన్నారు.



# రౌడీషీటర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

పది మంది నిందితుల అరెస్టు...

జిల్లా ఎస్పి కె. నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణంలోని కుసుమవారి గూడెం సమీపంలో ఓ హోటల్ వద్ద రౌడీషీటర్ చారగండ్ల శివ ఈనెల 26వ తేదిన హత్యకు గురికాగా ఈ కేసును పోలీసులు చేధించారు. హత్యలో మొత్తం 12 మంది నింధితులు ఉన్నట్లుగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేయగా 10 మందిని అరెస్టు చేయడంతో పాటు హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. మిగిలిన ఇరువురు నింధితులు పరారీలు ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం జిల్లా ఎస్పి కె నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీ ఫేజ్1కు చెందిన రౌడిషీటర్ శివకు మరికొంత మంది రౌడీషీటర్ల మధ్య గత కొన్ని రోజులుగా విభేదాలు ఉన్నాయి. పట్టణంలోని అన్నాదురైనగర్‌లో నివాసం ఉంటున్న పెద్ది లింగస్వామికి శివకు మధ్య గతములో గొడవలు పడగా కేసులు కూడా నమోదయ్యాయి. దీంతో పగలు పెంచుకున్న పెద్ది లింగస్వామి తన దగ్గరి మిత్రుడు ఎన్‌టిఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మాతంగి మధు అలియాస్ క్రరె మధు అతని స్నేహితులు కలిసి శివను హతమార్చేందుకు గత కొన్ని రోజుల నుండి పథకం రచించారు. దీనిలో భాగంగా ఇంట్లో ఉన్న ఈనెల 26వ తేదీన కుసుమవారిగూడెం వైన్స్ వద్ద గొడవ అవుతుంది మాట్లాడేందుకు రమ్మని ఫోన్ చేసి శివను అక్కడికి రప్పించారు. రాత్రి 10 గంటల వరకు వైన్ షాప్ ఎదురుగా ఉన్న విజయ్ హోటల్ వద్ద మందు తాగుతుండగా శివపై గొడ్డల్లు, కత్తులతో తలపై విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు డిఎస్పి, సిసిఎస్ సిఐ, రూరల్ సిఐ, ఎస్ఐలు టీంలుగా ఏర్పడి హత్యకేసును ముమ్మరంగా ధర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలు, నమ్మదగిన సమాచారంతో నింధితులను వారు గుర్తించారు. వీరిలో మాతంగి మధు, పెద్ది లింగస్వామి పట్టణంలోని సీతారాంపురంకు చెందిన చెవుల నరేష్, జెజెనగర్‌కు చెందిన జెక్కె సతీష్, కేసారం గ్రామానికి చెందిన భాషపంగుల సతీష్, సూర రామచంద్రు, తాళ్ళగడ్డకు చెందిన నేరెళ్ళ శ్రీరాములు, అన్నాదురైనగర్‌కు చెందిన గవ్వల తరుణ్‌కుమార్, నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటేష్, ఇందిరమ్మ కాలనీకి ఫేజ్2కు చెందిన జెల్ల ఉదయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. ఈ హత్య కేసులో మరో ఇద్దరు నిందితులైన జెజెనగర్‌కు చెందిన జెక్కి అనిల్, కృష్ణ టాకీస్ ప్రాంతానికి చెందిన వర్రె రామకృష్ణలు పరారీలో ఉన్నారు. హత్య కేసులో ఏ1 నిందితుడు మాతంగి మధుపై తొమ్మిది కేసులు ఉండగా, పెద్ది లింగస్వామిపై 5, జక్కి సత్తి అలియాస్ టిప్పర్ సత్తి 3 కేసులు సూర్యాపేట టౌన్ పోలీసు స్టేషన్‌లో నమోదై ఉన్నాయి. చెవుల సతీష్ పై 4 కేసులు నమోదై ఉండగా, రౌడిషీట్, సస్పెక్ట్ షీట్ ఉన్నాయి. భాషిగుంపుల సతీష్‌పై 1 కేసు, నేరెళ్ళ శ్రీరాములుపై 4, చింతపల్లి వెంకటేష్‌పై 2, జల్ల ఉదయ్‌కిరణ్‌పై 2 కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పి తెలిపారు. అనంతరం వారిని కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుండి ఒక స్కూటర్, మూడు మోటర్ సైకిళ్ళు, మూడు కత్తులు, రెండు గొడ్డళ్ళు, సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి కె నరసింహ మాట్లాడుతూ సమాజంలో అభద్రత భావం సృష్టించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పిడి యాక్ట్‌లు నమోదు చేయడంతోపాటు ఇలాంటి వ్యక్తులను జిల్లా బహిష్కరణకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్‌చంద్ర ముర్ము

**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్మును ప్రభుత్వం నియమించింది. ఆయన మూడేళ్ల పదవిలో కొనసాగనున్నారు. అక్టోబర్ 8న పదవీకాలం ముగియనున్న ఎం రాజేశ్వర్ రావు స్థానంలో ముర్మును నియమించారు. అక్టోబర్ 9న లేదా ఆ తర్వాత ఈ పదవిలో చేరిన తేదీ నుండి మూడు సంవత్సరాల పాటు ఆయన నియామకాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించిందని సోమవారం వర్గాలు తెలిపాయి. ముర్ము ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు.పర్యవేక్షణవిభాగాన్నిపర్యవేక్షిస్తున్నారు. ఆర్‌బిఐ చట్టం, 1934ప్రకారం,కేంద్రబ్యాంకుకు నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉండాలి. ఇద్దరు అంతర్గత స్థాయి నుండి, ఒకరు వాణిజ్య బ్యాంకింగ్ రంగానికి చెందినవారు,ద్రవ్యవిధానవిభాగానికిఅధిపతిగాఒక ఆర్థికవేత్త ఉండాలి. మిగిలిన ముగ్గురు డిప్యూటీ గవర్నర్లుగా టి రబీ శంకర్, స్వామినాథన్ జె, పూనమ్ గుప్తా ఉన్నారు. పదవీకాలం ముగియనున్న ఎం రాజేశ్వర్ రావు మొదటిసారిగాసెప్టెంబర్2020లోడిప్యూటీగవర్నర్‌గానియమితులయ్యారు.

## సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వారు
# రాహుల్ గొంతునొక్కే కుట్ర

### ప్రతిపక్ష నాయకుడిని చంపేస్తారని ఎబివిపి మాజీ నేత బెదిరించడం హేయమైన చర్య : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎబివిపి నాయకుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వారు, తమ దొంగతనం బయటపడిన వారు ప్రతిపక్ష నాయకుడి గొంతు నొక్కేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించింది. ఆర్‌ఎస్‌ఎస్ విద్యార్థి విభాగం అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిబి) మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రింటు మహదేవ్ రాహుల్ గాంధీని చంపేస్తామని బెదిరించడం హేయమైన చర్య అని ప్రతిపక్ష పార్టీ ధ్వజమెత్తింది. సోమవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ ఒక టివి చర్చ సందర్భంగా బిజెపి ప్రతినిధి బహిరంగంగా బెదిరింపుకు పాల్పడ్డాడని, దీనిపై కేరళ పోలీసులు ఎందుకు చర్య తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. బిజెపి ప్రతినిధి నుండి స్పష్టమైన బెదిరింపు ఉందని, ఇది పెద్ద కుట్రలో భాగమని తాను భావిస్తున్నట్లు హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశానన్నారు. అయితే హోంమంత్రి నుండి నా ఇంకా ఎటువంటి స్పందన రాలేదన్నారు. రాహుల్ గాంధీ ఛాతీపై కాల్చి చంపుతామని బిజెపి ప్రతినిధి ఒకరు టివి ముఖంగా చెప్పినా ఎటువంటి చర్య తీసుకోలేదని కాంగ్రెస్ మీడియా , ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. అంతకు ముందు రాహుల్ గాంధీ భద్రతపై (కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్) ఖర్గే జీకి సిఆర్‌పిఎఫ్ లేఖ రాసి దానిని లీక్ చేసిందని, మరి ఆయన భద్రతను ఎందుకు రాజకీయం చేస్తున్నారు? అలాంటి వాతావరణం ఎందుకు సృష్టిస్తున్నారని ఖేరా ప్రశ్నించారు. ఇది కుట్రలాగా కనిపిస్తోందని, ఈ కుట్ర ఎవరు పన్నుతున్నారని నిలదీశారు. సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వ్యక్తులు,వారి వ్యతిరేక ఆలోచనలను ఓడించడానికి ఆలోచనల ఆయుధాలు లేవని, ఈ కుట్రను బహిర్గతం చేయాలన్నారు. మొదట రాహుల్ గాంధీని దుర్భాషలతో నోరు మూయించడానికి ప్రయత్నించారు, ఇప్పుడేమో బుల్లెట్లతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రజలు గాంధీ లేవనెత్తిన సమస్యల పట్ల ఆకర్షితులవుతున్నారనే వాస్తవాన్ని బిజెపి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వారి దొంగతనం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిందని, సమయం ముగిసిందని వారికి తెలుసని ఖేరా ఒక వీడియో ప్రకటనలో బిజెపిపై గాంధీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణలను ప్రస్తావిస్తూ అన్నారు. కుట్ర ఎవరు పన్నుతున్నారో, అది ఏమిటో దేశానికి తెలుసు అని ఖేరా పేర్కొన్నారు. 'భారతదేశ భావజాలాన్ని ఓడించడంలో ఆర్‌ఎస్‌ఎస్ విఫలమైన ప్రతిసారీ, వారి సైనికులు భౌతిక హింసను ఆశ్రయిస్తారు. ఒక గాడ్సే గాంధీని చంపుతాడు. ఇప్పుడు, బిజెపి సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్నప్పుడు, వారి ప్రతినిధులు, నాయకులు రాహుల్ గాంధీని చంపుతామని బెదిరిస్తున్నారు' అని ఖేరా ఎక్స్‌లో పేర్కొన్నారు. లక్షలాది మంది పేద, అణగారిన, బలహీన వర్గాల గొంతును అణచివేయడానికి, రాహుల్ గాంధీని నోరు మూయించడానికి కుట్ర జరుగుతోందని ఖేరా అన్నారు. కాగా, ఒక టెలివిజన్ చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎబివిపి నాయకుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కెసి వేణుగోపాల్ ఆదివారం షాకు లేఖ రాశారు. ఆయనపై త్వరగా చర్య తీసుకోకపోతే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిపై హింసకు పాల్పడినట్లు, దాని సాధారణీకరణగా నిర్ణయించబడుతుందన్నారు. హింసను ప్రేరేపించే సిగ్గుమాలిన చర్యలో మహదేవ్ రాహుల్ గాంధీ ఛాతీపై కాల్చి చంపబడతారని బహిరంగంగా ప్రకటించారు. ఇది నోరు జారడం కాదు, అజాగ్రత్త అతిశయోక్తి కాదు. 'ఇది ప్రతిపక్ష నాయకుడు, భారతదేశంలోని అగ్రశ్రేణి రాజకీయ నాయకులలో ఒకరైన రాహుల్‌కు వ్యతిరేకంగా ఒక నిర్దయ, లెక్కింపు, భయంకరంగా చంపే బెదిరింపు అని వేణుగోపాల్ అన్నారు. అధికార పార్టీ అధికారిక ప్రతినిధి ఇటువంటి విషపూరిత మాటలు రాహుల్ గాంధీ ప్రాణాలను తక్షణ ప్రమాదంలో పడేయడమే కాకుండా, రాజ్యాంగం, చట్ట పాలన, ప్రతి పౌరుడికి ఇవ్వవలసిన ప్రాథమిక భద్రతా హామీలను కూడా దెబ్బతీస్తాయన్నారు. అందువల్ల వేగంగా నిర్ణయాత్మకంగా, బహిరంగంగా చర్య తీసుకోవడంలో విఫలమైతే, దానికి సహకరించినట్లుగా ప్రతిపక్ష నాయకుడిపై హింసను చట్టబద్ధం చేయడానికి, సాధారణీకరించడానికి ఒక వాస్తవ లైసెన్స్‌గా, కేంద్ర హోంమంత్రిగా మీ ప్రమాణ స్వీకారాన్ని తీవ్రంగా ఉల్లంఘించినట్లుగా పరిగణించబడుతుందని వేణుగోపాల్ అన్నారు. న్యాయం వేగంగా, స్పష్టంగా, కఠినంగా ఉండేలా రాష్ట్ర పోలీసుల ద్వారా తక్షణ, ఆదర్శప్రాయమైన చట్టపరమైన చర్య తీసుకోవాలని యావత్ భారదేశం డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు.

## తమిళ సిఎం స్టాలిన్‌కు రాహుల్ ఫోన్
# తొక్కిసలాట ఘటనపై ఆరా

### టివికె అధ్యక్షుడు విజయన్‌తో కూడా సంభాషణ



**న్యూఢిల్లీ :** తమిళనాడులోని కరూర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన తొక్కిసలాట గురించి విచారించడానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌తో ఫోన్‌లో మాట్లాడారని పార్టీ వర్గాలు తెలిపాయి. అదే విధంగా ఈ ఘటనలో తన మద్దతుదారుల మరణంపై సంతాపాన్ని తెలియజేయడానికి టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్‌కు కూడా ఫోన్ చేశారని చెప్పాయి. 'నా ప్రియమైన సోదరుడు రాహుల్ గాంధీ, కరూర్‌లో జరిగిన విషాద ఘటనపై ఫోన్‌లో నన్ను సంప్రదించినందుకు, హృదయపూర్వక ఆందోళనను తెలియజేసినందుకు, చికిత్స పొందుతున్న వారి విలువైన ప్రాణాలను కాపాడటానికి తీసుకున్న చర్యల గురించి విచారించినందుకు ధన్యవాదాలు' అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కరూర్ తొక్కిసలాట గురించి విచారించడానికి రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రికి ఫోన్ చేశారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. టివికె అధ్యక్షుడు విజయ్‌కు కూడా ఫోన్ చేసి తన మద్దతుదారుల మరణంపై తన సంతాపాన్ని తెలియజేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 27న పశ్చిమ తమిళనాడులోని కరూర్‌లో విజయ్ నేతృత్వంలో జరిగిన రాజకీయ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్య సోమవారం 41కి చేరింది. 60 మందికి పైగా ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు.

# 'ఐ లవ్ మహమ్మద్' వివాదంపై మతఘర్షణలు

### మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో హింసాత్మకంగా నిరసనలు
### పోలీసులు లాఠీచార్జి, 30 మంది అరెస్టు



**ముంబయి :** 'ఐ లవ్ మహమ్మద్' వివాదంపై మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి జరిపారు. 30 మందిని అరెస్టు చేశారు. అహల్యానగర్‌లో రోడ్డుపై చిత్రించిన 'ఐ లవ్ ముహమ్మద్' గ్రాఫిటీకి వ్యతిరేకంగా సోమవారం జరిగిన నిరసన హింసాత్మకంగా మారిందని, దీంతో రాళ్లు రువ్వుతున్న గ్రూపుపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని అధికారులు తెలిపారు. అహల్యానగర్–ఛత్రపతి శంభాజీనగర్ రహదారిని నిరసనకారులు దిగ్బంధించారని, గ్రాఫిటీకి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. కోత్వాలి ప్రాంతంలోని కోట్లాలో ఎవరో రోడ్డుపై 'ఐ లవ్ ముహమ్మద్' అని గీసిన తర్వాత ఈ నిరసన ప్రారంభమైందని, దీనిని ముస్లిం సభ్యులు వ్యతిరేకించారని, ఈ గ్రాఫిటీకి వ్యతిరేకంగా కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని ఒక అధికారి తెలిపారు. గ్రాఫిటీకి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పటికీ, కొంతమంది నిరసన తెలిపారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడాలని ఎంత చెప్పినా వినకుండా ఆ గ్రూపులోని కొంతమంది వ్యక్తులు రాళ్లు రువ్వడం ప్రారంభించారని, సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారని ఆయన అధికారి వెల్లడించారు. నిరసనలు, రోడ్డు దిగ్బంధనం, రాళ్ల దాడి ఘటనలకు సంబంధించి కనీసం 30 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అహల్యానగర్ పోలీసు సూపరింటెండెంట్ సోమనాథ్ ఘర్గే తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటానికి తాము లాఠీచార్ చేశామని, నిందితులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని, పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. పౌరులు వదంతులను నమ్మకూడదని, వ్యాప్తి చేయకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం యావత్మల్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, రాష్ట్రంలో సామాజిక శాంతికి భంగం కలిగించడానికి, వివిధ రకాల బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా సమాజాన్ని విభజించడానికి కుట్ర జరుగుతుందో లేదో అధికారులు కనుగొంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ సొంత మతాన్ని ఆచరించడానికి స్వేచ్ఛగా ఉంటారు కానీ, విభజనకు పాల్పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## 'నేడు' బిహార్ తుది ఓటర్ల జాబితా ప్రచురణ

### వచ్చేవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం
### 4, 5 తేదీలలో ఎన్నికల సన్నద్ధత పరిశీలన కోసం ఎన్నికల అధికారుల పాట్నా సందర్శన

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోన్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. బిహార్ తుది ఓటర్ల జాబితా నేడు (మంగళవారం) ప్రచురించబడుతుంది. ఎన్నికల సంఘం వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో మంగళవారంనాడు తుది ఓటర్ల జాబితాను ప్రచురించనుంది. ఎన్నికల అధికార యంత్రాంగం ఎన్నికల సన్నద్ధతను పరిశీలించడానికి అక్టోబరు 4, 5 వతేదీలలో పాట్నాను సందర్శించనుంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే వారం ప్రకటించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.అక్టోబర్‌చివరలో జరిగే ఛాత్ పండుగ తర్వాత ఎన్నికల మొదటి దశ నిర్వహించవచ్చు. బిహార్, కొన్ని అసెంబ్లీ ఉప ఎన్నికలకు 470 మంది పరిశీలకులను నియమించనున్నారు. అక్టోబరు 3న ఇక్కడ జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకులకు బ్రీఫింగ్ ఇవ్వబోతున్నారు. 243మంది సభ్యులు ఉన్న బిహార్ అసెంబ్లీ కాలం నవంబరు 22తో ముగియనుంది. కోవిడ్ 19 పాండమిక్ విపత్కర పరిస్థితుల నడుమ గత బిహార్ అసెంబ్లీ ఎన్నికలు మూడు దశలలో జరిగాయి. 22 ఏళ్ల తర్వాత ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ఒక ముగింపునకు చేరుకున్న నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాప్రచురించబడుతోంది.ఆగస్టు1న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 1వరకు వ్యక్తులు, రాజకీయ పార్టీల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించింది. ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య7.24 కోట్లుగా నమోదైంది. ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అర్హతలు కలిగిన కోట్లాది పౌరులు ఓటు హక్కును కోల్పోయారని ఆరోపించారు. అయితే ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది.

## 756 బి.డాలర్లు దాటిపోనున్న చైనాలో నీటి నిల్వ ప్రాజెక్టుల వ్యయం



**బీజింగ్:** చైనా ప్రభుత్వం ముందుచూపుతో నీటిని భావితరాలకోసం నిల్వ చేసేందుకు నీటి ప్రాజెక్టులపైనే భారీగా ఖర్చు పెడుతోంది. ఇప్పటికే నీటి ప్రాజెక్టులపైన చైనా భారీ ఖర్చు చేసింది. ఈ ఖర్చువల్ల కోట్లాదిమంది ప్రజలకు మేలు కలుగుతోంది. వరదనీటిని వృథాగా పోనీయకుండా దానిని సద్వినియోగం చేసేందుకు ఎక్కడికక్కడ ప్రాజెక్టుకలు నిర్మిస్తోంది. 2021 2025 వరకు 14వ పంచవర్ష ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న నీటి ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం 765.91 బిలియన్ డాలర్లు (5.4 ట్రిలియన్ యువాన్‌లు) దాటిపోయేలా ఉందని జలవనరుల శాఖామంత్రి లీ గుయాంగ్ సోమవారం చెప్పారు. 2022లో చైనా ప్రభుత్వం నీటి ప్రాజెక్టులమీద ఒక ట్రిలియన్ యువాన్లు ఖర్చుచేసింది. వరుసగా మూడు సంవత్సరాలపాటు ఇంతే మొతాన్ని ఖర్చుచేసి రికార్డు సృష్టించింది. 14వ పంచవర్ష ప్రణాళికాకాలంలో చైనా మొత్తం 172 భారీ నీటి ప్రాజెక్టులను ప్రారంభించింది. 2024 చివరినాటికి 95,000 రిజర్వాయర్లు నిర్మించింది. మరో 200 మధ్యతరహా, చిన్న నీటి బదిలీ ప్రాజెక్టులు నిర్మించింది. 6,924 ఇరిగేషన్ జిల్లాలను సృష్టించిందని చైనా మంత్రి లీ గుయాంగ్ చెప్పారు.

## తమిళనాడులో ఘటనపై చైనా సంతాపం

**బీజింగ్:** తమిళనాడులో సినీ నటుడు విజయన్ భారీ నిర్వహించిన రాజకీయ ఎన్నికల బహిరంగ సభలో తీవ్రమైన తొక్కిసలాట జరిగి 41 మందికి పైగా ఆయన అభిమానులు మరణించిన సంఘటనపై చైనా ప్రభుత్వం తీవ్ర సంతాపం ప్రకటించింది. తమిళనాడు కరూర్‌జిల్లా వేలుచామిపురం లో శనివారం జరిగిన ర్యాలీలో మరణించినవారిలో తొమ్మిదిమంది చిన్నారులు కూడా ఉన్నారు. ఈ విషాద ఘటనకు అంతర్జాతీయ మీడియా విపరీతమైన ప్రచారం ఇచ్చింది. చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ సోమవారం బీజింగ్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ సంఘటనను అత్యంత దురదృష్టకరమైనదిగా పేర్కొన్నారు. మృతులకు తీవ్ర సంతాపం ప్రకటించారు. మృతులు, గాయపడినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. భారత్‌లో ఉన్న చైనా దౌత్యకార్యాలయం వీలైనంత త్వరగా వారి సంతాపాన్ని సంబంధితులకు తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనలో చైనాకు చెందినవారు ఎవరూ మరణించలేదు. గాయపడలేదని గుయో జియాకున్ వివరణ ఇచ్చారు.

# సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయొద్దు

### తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హెచ్చరిక



**చెన్నై :** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయవద్దని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హెచ్చరించారు. ఈనెల 27న జరిగిన విషాద ఘటనలో 41 మంది మరణించడం చాలా బాధాకరమని, ఈ ఘటనలో బాధితులను ఒక ప్రత్యేక పార్టీకి చెందినవారుగా చూడకూడదని, తోటి తమిళులుగా చూడాలని ఆయన అన్నారు. 'కరూర్‌లో జరిగినది మహా విషాదం. తీవ్ర దుఃఖం కారణంగా నా హృదయం బరువెక్కింది. సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని సమీకరించిన తర్వాత, నేను చెన్నైలో ఉండలేకపోయాను. బాధితులను ఓదార్చడానికి కరూర్‌కు వెళ్లాను' అని ముఖ్యమంత్రి తన అధికారిక ఎక్స్ సైట్‌లోపోస్ట్ చేసిన వీడియో సందేశంలో తెలిపారు. సోషల్ మీడియాలోపోస్ట్‌లనుతాను చూస్తున్నానని పేర్కొంటూ, కొంతమంది ఈ ఘటన గురించి పుకార్లు వ్యాప్తి చేయడం లేదా అపవాదులకు పాల్పడటం విచారకరమని స్టాలిన్ అన్నారు. కరూర్‌లో జరిగిన విషాదం గురించి పుకార్లు వ్యాప్తి చేయవద్దని, సోషల్ మీడియాలో అపవాదులు వ్యాప్తి చేయవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ఇది ఇంతకు ముందు ఎన్నడూ జరగని విషాదమని, మళ్ళీ జరగకూడనిదని, తాను స్వయంగా ఆసుపత్రికి వెళ్ళినప్పుడు చూసిన దృశ్యాలు ఇప్పటికీ తన ముందు ఉన్నాయన్నారు. దుఃఖం కారణంగా తన హృదయం బరువెక్కిందన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, దానిని అందిస్తున్నట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ ఘటనపై మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగతీసన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏక వ్యక్తి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. 'సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు వ్యాప్తి చేస్తున్న పుకార్లు మరియు తప్పుడు వార్తలను నేను గమనిస్తున్నాను. ఏ రాజకీయ పార్టీ నాయకుడూ తన కార్యకర్తలు లేదా అమాయక పౌరులు చనిపోవాలని ఎప్పుడూ కోరుకోడు. ఈ సంఘటనలో, పార్టీ అనుబంధంతో సంబంధం లేకుండా, మరణించినవారు నావారే, వారు మన తమిళ సోదరులు' అని ఆయన అన్నారు. ఈ విచారకరమైన, దుఃఖకరమైన పరిస్థితిలో ప్రజలు బాధ్యతారహితమైన, దురుద్దేశపూరిత వార్తలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. భవిష్యత్తులో రాజకీయ పార్టీలు, ప్రజా సంస్థలు ఇటువంటి కార్యక్రమాలను ఎలా నిర్వహించాలో నియమ నిబంధనలను రూపొందించడం ప్రభుత్వ విధి అన్నారు. అందువల్ల కమిషన్ నివేదిక అందిన తర్వాత, అన్ని రాజకీయ పార్టీలు, పౌర సమాజాలతో సంప్రదించి నియమ నిబంధనలను రూపొందిస్తానని చెప్పారు. అందరూ సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'మానవ జీవితాలు అన్నింటికంటే గొప్పవి. ప్రతి ఒక్కరూ తమ రాజకీయ దృక్పథాలు, విధానపరమైన విభేదాలు, వ్యక్తిగత శత్రుత్వాన్ని పక్కనపెట్టి ప్రజల సంక్షేమం కోసం ఆలోచించాలని అభ్యర్థిస్తున్నాను. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా నిరోధించడం మనందరి కర్తవ్యం' అని ఆయన అన్నారు.

## దేశ ఆర్థికవృద్ధి, సాంఘిక ప్రగతికి..
# నైపుణ్యం, జ్ఞానమే చోదకాలు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ
### రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన ఐఎస్‌డిఎస్ ప్రొబేషనర్ల సమావేశంలో కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** సాంకేతిక ఆధారిత వృద్ధి మార్గంలో భారతదేశం ముందుకు సాగుతున్న నేపథ్యంలో 'యువత అధునాతన సాంకేతిక నైపుణ్యాలను స్వీకరించడమే కాకుండా వాటికి అనుగుణంగా ఉండటం అనివార్యం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సోమవారం ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐఎస్‌డిఎస్) ప్రొబేషనర్ల సమావేశాన్ని ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు. 'ఏ దేశ ఆర్థిక వృద్ధి, సాంఘిక ప్రగతికైనా నైపుణ్యం, జ్ఞానం నిజమైన చోదకాలు' అని ప్రొబేషనర్లకు ఉద్బోధించారు. అత్యున్నత నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని అభివృద్ధి చేసే దేశాలు ప్రపంచ సవాళ్లకు ప్రతిస్పందించడానికి, అభివృద్ధి సంబంధిత వివిధ ర ంగాలలో ఉద్భవిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సన్నద్ధంగా ఉంటా యి. 'భారతదేశం సాంకేతిక ఆధారిత ఆర్థికాభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతున్న నేపథ్యంలో మన యువత అధునాతన సాంకేతిక నైపుణ్యాలను స్వీకరించడం, వాటికి అనుగుణంగామారడంఅత్యవసరంఅని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. దృఢమైన భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని రూపొందించడంలో ప్రొబేషనరీలదేముఖ్యమైనపాత్ర' అని రాష్ట్రపతి అన్నారు. ఐఎస్‌డిఎస్‌లతో పాటు ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్, సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్ ప్రొబేషనర్లు కూడా రాష్ట్రపతిద్రౌపది ముర్ముచే రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించబడ్డారు. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ప్రొబేషనర్లను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తూ కొలువదగిన, పరిమాణాత్మకంగా సూచించదగిన ప్రభావవంతమైన పాలన యొక్క ప్రాముఖ్యతను అతిగా నొక్కిచెప్పలేమన్నారు. 'మర్థవంతమైన విధాన రూపకల్పన, అమలు ఖచ్చితమైన గణాంకాల విశ్లేషణలపై ఆధారపడి ఉం టుంది. నేటి డేటా ఆధారిత ప్రపంచంలో సంబంధిత గణాంకాలు అపారంగా పెరిగాయి' అని రాష్ట్రపతి విపులీకరించారు. భారతదేశం సామాజిక, ఆర్థిక, డిజిటల్ పరివర్తన యొక్క కొత్తయుగంలోకి ప్రవేశించిందని ముర్ము చెప్పారు.అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం వలన పాలనలో పారదర్శకత, సామ ర్థ్యం గణనీయంగా పెరిగిందన్నారు. 'ఈ సాంకేతిక చర్యలు నిరంతర డేటా ప్రవాహాన్ని సృష్టిస్తాయి. ఇది ప్రభుత్వం మరింత సమాచారంతో కూడిన, ప్రభావవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది' అని ముర్ము ఉద్బోధించారు. ఈ మూడు సేవలు ఎల్లప్పుడూ సమాజంలోని అత్యంత వెనకబడిన వర్గాల పురోగతిని నిర్ధారించే లక్ష్యంతో పనిచేసే విధంగా ప్రొబేషనర్లు చూడాలని రాష్ట్రపతి కోరారు. అభిరుచి, సమగ్రతతో సేవ చేయడంద్వారా మీరు మరిం త సంపన్నమైన, స్థితిస్థాపకమైన, సమ్మిళితమైన దేశాన్ని రూపొందించగలరని, మీ చిత్తశుద్ధి కలిగిన ప్రయత్నాల ద్వారా, మీరు మరింత బలమైన పురోగతి దేశంగా భారతదేశాన్ని ప్రపంచంలోనే ఒక ఆదర్శ దేశంగా నిలబెట్టే దిశగా కృషిచేయాలని, మీ అంకితభావంతో, ఆసక్తితో కూడిన పనితీరు భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశం గా తీర్చిదిద్దగలరనే నమ్మకం తనకు ఉన్నదని రాష్ట్రపతి ముర్ము ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాపక్షం
మంగళవారం, 30 సెప్టెంబరు

## కరూర్ విషాదానికి బాధ్యులెవరు?

తమిళనాడులోని కరూర్‌లో శనివారం రాత్రి రాజకీయ ఆకాంక్షతో రోడ్ షో చేస్తున్న పాపులర్ సినిమా యువ కథానాయకుడు సి.జోసెఫ్ విజయ్‌ను దగ్గరగా చూసేందుకు ఎగబడిన జనాల తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన, 60మందికిపైగా గాయపడిన విషాదానికి బాధ్యులు రాజకీయ ఆరోపణలు – ప్రత్యారోపణల మధ్య తప్పించుకోరాదు. పరిహారం చెల్లింపులతో పరిసమాప్తం కారాదు. రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే దర్యాప్తు కమిషన్ నియమించటంలోనే ఈ విషాదంలో ఇమిడిఉన్న రాజకీయ సున్నితత్వం విదితమవుతున్నది. మరోవైపు పోలీసు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు జరుగుతోంది. సినీనటుడు విజయ్ తమిళగ వెట్రి కజగం (టివికె) పేరుతో ప్రాంతీయ రాజకీయ పార్టీ ప్రారంభించి డిఎంకె అధికారాన్ని సవాలు చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చే సంవత్సరం ఆరంభంలో తమిళనాడు శాసనసభ ఎన్నికలు జరుగుతున్నందున రాజకీయ వేడి అప్పుడే రగులుకుంది. విజయ్ అట్టహాసంగా టివికె పార్టీ ఏర్పాటు చేసి తానే ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చారు. అభిమానులు విరివిగా హాజరై వెన్నుతట్టారు. కోలీ ఉడ్ మెగా స్టార్ ప్రజలకు చేరువకావటానికి సెప్టెంబర్ 13 నుంచి వారాంతపు రోడ్ షోలు జరుపుతున్నారు. రాజకీయాలు–సినీ గ్లామర్‌కు విడదీయరాని బంధం ఉన్న రాష్ట్రం లో తమ అభిమాన హీరో తమ మధ్యకు వస్తే అభిమానులు తండోపతండాలుగా ఎగబడకుండా ఉంటారా? ఆ విషయం విజయ్ పార్టీ నాయకులకు తెలియంది కాదు. సభలకు విశాలమైన జాగాలు ఎంచుకోవాలి. అభిమానులనుంచి హీరోను కాపాడుకునేందుకు బౌన్సర్లను నియమించుకున్నట్లే జనాలను నియంత్రించేందుకు పార్టీ కార్యకర్తలు నడుం కట్టాలి, పోలీసులకు సహకరించాలి. కాని విజయ్ 'యాత్ర'లో అన్నీ ఉల్లంఘనలే. పోలీసు ఆంక్షలను తమ రాజకీయ ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నంగా నిందించారు. అభిమానులు ప్రజా ఆస్తులను ధ్వంసం చేయటంపై పోలీసులు కేసులు పెడితే టివికె పార్టీ హైకోర్టుకు వెళ్లింది. కావాలంటే ప్రభుత్వ రాజకీయ పార్టీలనుంచి డిపాజిట్ కట్టించుకోమన్నారు. తమ ప్రచార వాహనాలవెంట అభిమాన జనాలు ఎగబడుతున్నా, గంటలతరబడి ట్రాఫిక్ జాం చేస్తున్నా విజయ్ వారిని నిరోధించే ప్రయత్నం చేయలేదు. యువకులు కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, మిద్దెలు, మేడలు ఎక్కుతున్నారు. కుటుంబాలు చిన్న పిల్లల్ని సైతం ఎత్తుకుని తమ 'వెండితెరవేల్పు' దర్శనం కోసం గంటలతరబడి ఎదురుచూస్తున్నారు. ఇటువంటి యాత్రల్లో పోలీసులను జనాలు పట్టించుకోరు. ఆర్గనైజర్లు కూడా గ్లామర్ అభిమానులే అయినందున వారూ తమ హీరో వెంట పరుగులు పెడుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడో ఒకచోట ఏదో ఒక విధమైన ప్రమాదం ముంచుకు రాకుండా ఉంటుందా?

కరూర్‌లో అటువంటి ప్రమాదం పెను విషాదమైంది. విజయ్ యాత్రా శకటాలు మధ్యాహ్నం 2గంటలకు రావలసిన సమయానికి సభకు నిర్దేశించిన వేలుసామిపురంలో 2–3 వేలమంది చేరారు. అయితే ఆయన 7.20కి వచ్చారు. పనిదినం ముగించుకున్న జనాలు పెద్ద ఎత్తున గుమిగూడారు. నిర్వాహకులు 10వేలమంది రావచ్చునని పోలీసు పర్మిషన్ తీసుకుంటే 27వేలమంది వచ్చారని పోలీసు అధికారులు చెప్పారు. ఇంకేముంది విజయ్ శకటంవైపు ఇసుకవేస్తే రాలనట్లుగా తోసుకున్నారు. తొక్కిసలాట జరిగింది. ఊపిరాడక కొందరు, జనం కాళ్ల కింద నలిగి కొందరు నుజ్జునుజ్జయినారు. జనాన్ని చెదరగొట్టి క్షతగాతులను ఆసుపత్రులకు చేర్చటమే పోలీసులకు చాలా కష్టమైంది. ఇంతటి విషాదానికి బాధ్యత ముమ్మాటికీ ఆర్గనైజర్లదే. వారి నాయకుడైన హీరో విజయ్‌కు నైతిక బాధ్యత ఉంటుంది.

ఇంతటి మానవ విషాదంలోనూ రాజకీయులది వక్రబుద్ధే. ఎఐడిఎంకె నాయకుడు పళని స్వామి వచ్చి డిఎంకె ప్రభుత్వాన్ని నిందిస్తాడు. టివికె నాయకులు ఈ ప్రభుత్వ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదంటూ సిబిఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. బిజెపి వారు ఎంపి హేమమాలిని నాయకత్వంలో విచారణ కమిటీ వేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ చాలా హుందాతనంగా వ్యవహరించారు. కరూర్ ఆసుపత్రికి వచ్చి మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు, దర్యాప్తు కమిషన్ నియమించారు. దాని నివేదిక ప్రకారం చర్యలుంటాయన్నారు.

ఈ ఘటన నుంచి పోలీసులు, రాజకీయ పార్టీలు పాఠాలు తీసుకోవాలి. రోడ్ షో లపై పునరాలోచించాలి. సభలన్నీ విశాలమైన ప్రదేశాల్లో, పగటివేళ జరుపుకోవాలి. పోలీసు సలహాలను పాటిస్తూ ఆర్గనైజర్లు తగు ఏర్పాట్లు చేయాలి. ప్రజలను నియంత్రించేందుకు పోలీసులకు తోడు పెద్ద సంఖ్యలో వలంటీర్లను ఏర్పాటు చేయాలి. ప్రజలు కూడా సెలబ్రిటీలకోసం ఎగబడటం మానుకోవాలి. గతకాలానికి భిన్నంగా ఇవాళ వారు ప్రతిరోజూ టీవీల్లో దర్శనమిస్తూనే ఉన్నారు. వారు మనలాంటి మానవాకృతులేగాని దైవాంశ సంభూతులు కాదు కదా!

## రాజ్యాంగంలోని సామాజిక న్యాయాన్ని పరిరక్షించుకోవాలి



రామ్ పునియాని

భారతీయ సమాజం అనేక అసమానతలలో చిక్కుకుంది. భారత రాజ్యాంగాన్ని తొలగించాలని కొన్ని శక్తులు కోరుకుంటున్నాయి. సమానత్వం కోసం సామాజిక పోరాటాల దిశగా అది ఒక పరికరం.

ఒకవైపు గ్రంథాలలో ఎక్కువ చేసి చూపిన పితృత్వపు విలువలు, మరోవైపు వర్ణ కుల వ్యవస్థకు సమాజంలో ప్రామాణికత కల్పించి, వాటికి పవిత్ర గ్రంథాలలో పవిత్రతను ఆపాదించారు. వర్ణ,కుల అసమానతలు ప్రస్తావన అనాదిగా వస్తూ, నేటికీ కొనసాగుతున్నాయి.

ఈ కుల సమానతలకు గట్టి వ్యతిరేకత గౌతమ బుద్ధుడు నుంచి రావడమే కాకుండా, ఆయన సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం గురించి ప్రవచించారు. ఆయన బోధన మూలం సమానత్వం, సమత. ఇవి సామాజిక వ్యవస్థను కొంత మేరకు ప్రభావితం చేశాయి. తదుపరి బ్రాహ్మణవాద శక్తుల ప్రతీఘాత విప్లవం ద్వారా కుల నిచ్చెనమెట్ల వ్యవస్థను కఠిన పద్ధతిలో పునరుద్ధరణ జరిగింది. మధ్య యుగకాలంలో రాజ్యాలలో అసమానతలు కొనసాగేవి. కబీర్, నామ్‌దేవ్, తుకారామ్, నార్సి మెహతా వంటి సంతులు కుల అసమానతల బాధలను పాటల రూపంలో వ్యక్తపరిచేవారు. కేరళలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా నారాయణ గురు పెద్ద ఉద్యమాన్ని ప్రారంభించారు.

బ్రిటీష్ వారి రాకతో, ఆధునిక విద్యను ప్రవేశపెట్టడంతో జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే వంటి వారు కులం, లింగ వ్యవస్థకు వ్యతిరేకంగా భారీ చర్యలు తీసుకొని, దళితులు, మహిళలకు సామాజిక న్యాయం దిశగా పాఠశాలలను ప్రారంభించారు. వారిని బాబా సాహెబ్ అంబేద్కర్ అనుసరిస్తూ చావ్దార్ తలాబ్ ఉద్యమం, కాలారామ్ మందిర్ ఉద్యమం, మనుస్మృతి దహనం ద్వారా సామాజిక న్యాయం కోసం పాటు పడ్డారు. ఆయన బహుజన హితకారిణి సభ, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ ప్రారంభించి, స్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా నడిపించారు. పుణె ఒప్పందం తరువాత గాంధీ ప్రత్యేక చొరవ తీసుకొని సామాజిక న్యాయం కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ దళితులకు ఆలయ ప్రవేశం, దళితులతో సహపంక్తి భోజనాల ఎజెండాతో ముందుకు సాగారు. అంతే కాకుండా పెరియార్ రామసామి చేపట్టిన 'ఆత్మగౌరవ పోరాటం' సైతం ఏ మాత్రం తక్కువ కాదు.

స్వాతంత్ర్యం రావడంతో పాటు రాజ్యాంగ సభ ఏర్పాటైంది. జాతిపిత మహాత్మా గాంధీ రాజ్యాంగ రచనా కమిటీకి ఛీఫ్‌గా బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును సూచించారు. అంబేద్కర్ అంకితభావం, నిబద్ధతతో కూడిన కృషి ఫలితంగా రాజ్యాంగంలో సమానత్వం, సామాజిక న్యాయం అంశాల చేర్పుతో పాటు, బలహీన వర్గాలకు అఫిర్మేటివ్ యాక్షన్ (రిజర్వేషన్)కు చోటు లభించింది.

'భారతదేశ ప్రజలగు మేము' అని ప్రవేశిక ప్రారంభమయ్యే పదాలే సమాజంలోని బలహీనవర్గాలను పట్టించుకునే విధంగా సమ్మిళిత రాజశాసనాన్ని సూచిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ సామాజిక న్యాయ విలువలను రాజ్యాంగ సభ ప్రతిబింబించడమే కాకుండా, రాజ్యాంగ సభలోని చర్చలు సామజిక న్యాయం పట్ల అత్యంత సానుకూల స్వరం కనిపిస్తుంది. అంటరానితనానికి వ్యతిరేక నిబంధనలు, రిజర్వేషన్‌లు, అఫిర్మేటివ్ యాక్షన్ నిబంధనలు సహా వివిధ నిబంధనలు భారతీయ ప్రజల రాజశాసనానికి వెన్నెముక కావడమే ఇందుకు కారణం.

"స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే ప్రాచీన భావనకు అదనంగా ప్రవేశికలో మనకు 'న్యాయం' అని కూడా ఉంది. ఈ పదం సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు ప్రధాన న్యాయాలను సూచిస్తుంది. ఇవి ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలలోని వేర్వేరు నిబంధనల ద్వారా ప్రవేశపెట్టబడినాయి. సామాజిక న్యాయం అంటే పౌరులు అందరూ కులం, వర్ణం, మతం, లింగ, తదితరాల ఆధారంగా సామాజిక తేడాలు లేనటువంటి సమాన ఆదరణ. "దీని అర్థం సమాజంలో ప్రత్యేకించిన వర్గానికి వర్తింపజేసే విశేష అధికారాలు లేకపోవడం. వెనుకబడిన వర్గాల (ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలు), మహిళల స్థితిగతులు మెరుగుపడడం. ఆర్థిక న్యాయం అంటే ఆర్థిక అంశాల



THE CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:
JUSTICE, social, economic and political;
LIBERTY of thought, expression, belief, faith and worship;
EQUALITY of status and of opportunity;
and to promote among them all
FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;
IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

ఆధారంగా ప్రజల మధ్య వివక్ష రాహిత్యాన్ని సూచిస్తుంది. ఇది సంపద, ఆదాయం, ఆస్తులలో ప్రస్ఫుటమయ్యే అసమానతలను నిర్మూలించడంలో భాగంగా ఉంటుంది. సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం మేళవింపు ద్వారా 'పంపిణీ న్యాయం' అనేదానిని సూచిస్తుంది. రాజకీయ న్యాయం పౌరులందరికీ సమాన రాజకీయ హక్కులు, ప్రభుత్వంలో సమాన గొంతుకను కల్పిస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ – న్యాయం అనే ఆదర్శం రష్యన్ విప్లవం (1917) నుంచి స్వీకరించబడింది."

మనకు ఇతర నిబంధనలు కూడా ఉన్నాయి " ప్రాథమిక హక్కుల అధ్యాయంలోని కింద పేర్కొన్న నిబంధనలు పౌర సమానత్వాన్ని కల్పిస్తాయి : ఎ) చట్టం ఎదుట సమానత్వం (అధికరణ 16). బి) జన్మస్థానం ఆధారంగా మతం, జాతి, కులం, లింగ వివక్షతల నిషేధం (అధికరణ 15). సి) ప్రభుత్వ ఉద్యోగాలలో సమాన అవకాశాలు (అధికరణ 16). డి) అంటరానితనం రద్దు (అధికరణ 17). ఇ) బిరుదుల రద్దు (అధికరణ 18)."(2)

ఇవి కుల వ్యవస్థలో కొనసాగుతున్న రుగ్మతల నిర్మూలనకు పునాది వేస్తాయి. సామాజిక ఉద్యమాలకు చట్టంలోని నిబంధనలతో బలం చేకూర్చడం ద్వారా సామాజిక న్యాయం అనే భావన ప్రభావవంతంగా అమలు జరుగుతుంది.

సామాజిక న్యాయం అనేది అత్యంత సమగ్రమైన పదం. మాజీ ప్రధాన న్యాయమూర్తి గజేంద్రగడ్కర్ ఒక సందర్భంలో వ్యక్తీకరించిన ప్రకారం "ఈ భావనలో సామాజిక న్యాయం అనేది సామాజిక, ఆర్థిక కార్యకలాపాలలో ప్రతి పౌరునికి సమాన అవకాశాలు కల్పించాలి, అసమానతలను అడ్డుకోవాలనే లక్ష్యం కలిగి ఉన్నది".

ఇదే కాకుండా, సామాజిక న్యాయం అనే లోతైన సిద్ధాంతాన్ని ప్రభావశీలంగా అమలుపరిచేందుకు రాజ్యాంగంలో మరిన్ని నిబంధనలు ఉన్నాయి. "అధికరణ 15(4) కింద సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల పౌరులు లేదా షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డు తెగల కోసం ప్రభుత్వం (రాజ్యం) ప్రత్యేక ఏర్పాటు చేయాలి. ఇదే పద్ధతిలో అధికరణ 16 (1) కింద ప్రభుత్వం ఉద్యోగాలలో సమానత్వం అనే అవకాశాన్ని అమోదించాలి. దీనికి అధికరణ 16(4)లో సమానత్వ సూత్రానికి మినహాయింపు ఉంది.

పౌరులలోని ఏదైనా వర్గానికి ప్రభుత్వ ఉద్యోగాలలో సరిపడ ప్రాతినిధ్యం లేదనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నట్లయితే, అలాంటప్పుడు నియామకాలలో రిజర్వేషన్‌ల కోసం ప్రభుత్వం ఏదైనా ఏర్పాటు చేయవచ్చు. అధికరణ 46 ప్రకారం ప్రజలలోని బలహీనవర్గాలు, ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల విద్యాపరమైన, ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించవచ్చును. అలాగే వారిని సామాజిక అన్యాయం, అన్ని రకాల దోపిడి నుంచి రక్షించవచ్చును'.

ప్రస్తుతం మనం సామాజిక న్యాయం అనే భావననే వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా కమిటీ ఛీఫ్ బిబేక్ దేబ్రాయ్ సహా అనేక మంది డిమాండ్ చేస్తున్న పరిస్థితిని మనం వీక్షిస్తున్నాం. రాజ్యాంగ మూల స్వభావాన్ని మార్చవద్దని కార్యనిర్వాహక వర్గానికి సుప్రీం కోర్టు ఆదేశించినందున, అది చాలా కాలంగా కొనసాగుతున్నందున, మనం కొత్త రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాలనేది ఆయన అభిప్రాయం. మరీ ముఖ్యంగా ఆయన రాజ్యాంగం వలస వారసత్వం కలిగి ఉన్నదని పేర్కొంటూ, అందులో అనేక నిబంధనలను ప్రత్యేకించి సామ్యవాదం, లౌకికవాదం, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అనే వేర్వేరు నిబంధనలను ప్రశ్నించారు.

భారతదేశం నాగరిక రాజ్యం (వేదాలు, మనుస్మృతి విలువలు కలిగి ఉందని అర్థం) అని, రాజ్యాంగం దానికి అతీతంగా ఉండాల్సిన అవసరం లేదని పలువురు హిందూ మితవాద సిద్ధాంతవాదులు వాదిస్తున్నారు. నాగరికతను మనం ఎలా నిర్వచించాలి? ఇలాంటి ముఖ్యులు స్పష్టంగా (బ్రాహ్మణవాద) హిందూత్వమే భారత మూల నాగరికత అని వ్యక్తీకరిస్తున్నారు. "ఇస్లాం, ప్రత్యేకించి ముస్లింలు, మరింత ప్రత్యేకంచి మొఘలులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా చరిత్ర అర్థాన్ని వక్రీకరించారని వారు వామపక్ష చరిత్రకారులను నిందిస్తున్నారు. చోళ వంశం వంటి హిందూ రాజులను జాతీయ సంభాషణలో తక్కువ ప్రాధాన్యతనిస్తూ, బైటి నుంచి వచ్చిన మొఘలులకు చరిత్ర వివరణల్లో అధిక స్థలాన్ని కేటాయించారని వారు చాలా బాధపడుతున్నారు."

భారత రాజ్యాంగం, అందులోని సామాజిక న్యాయం నిబంధనలను కేవలం రక్షించడమే కాకుండా భవిష్యత్తులో కూడా ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవడం నేటి అవసరం.

*(ఐపిఎ సర్వీస్)*

## హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసిన మంకొంబు సాంబశివన్ స్వామినాథన్ ఒక భారతీయ జన్యు శాస్త్రవేత్త, ప్రపంచ హరిత విప్లవ నాయకుడు, మానవతావాది, భారత రత్న. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి రకాలను అభివృద్ధి చేయుటలో ఆయన నాయకత్వం వహించడంతో భారతదేశంలో హరిత విప్లవ పితామహుడు అని పిలుస్తారు. బ్రిటిష్ వలస పాలనలో వ్యవసాయరంగంలో అభివృద్ధి నిలిచి పోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 నాటికి తిండి గింజలకు కటకటలాడే పరిస్థితి గోధుమలు, బియ్యం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే తప్ప ప్రజలకు నాలుగు మెతుకులు అందించలేని దురవస్థ ఉండేది. ఇలాంటి తరుణంలో స్వామినాథన్ హరిత విప్లవానికి బీజం వేశారు. నార్మన్ బోర్లాగ్‌తో కలిసి స్వామినాథన్ సాకార, శాస్త్రీయ ప్రయత్నాలు రైతులు, ఇతర శాస్త్రవేత్తలలో ఒక సామూహిక ఉద్యమానికి నాయకత్వం వహించటం, ప్రజా విధానాల మద్దతు 1960లో భారతదేశం కరువు లాంటి పరిస్థితులు నుండి కాపాడి ఆహారంకోసం విదేశీ దిగుమతులుపై ఆధారపడటం నుంచి బయటపడి ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించింది. 1999లో టైమ్స్ 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన 20 మంది ఆసియా వ్యక్తుల జాబితాలో గాంధీ, ఠాగూర్‌లతోపాటు ముగ్గురు భారతీయుల్లో ఆయన ఒకరు. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న మద్రాస్ ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో జన్మించారు. తన 98 ఏటా 2023 సెప్టెంబర్ 28 చెన్నైలో మరణించారు. బాల్యం నుండి వ్యవసాయం గురించి రైతులతో సంభాషించాడు. అతని ఉమ్మడి కుటుంబం వరి, కొబ్బరి, కాఫీ పండించింది. పంటల ధరల్లో హెచ్చుతగ్గులు తన కుటుంబం పై చూపే ప్రభావాన్ని, వాతావరణం మరియు తెగుళ్ల పంటలకు, ఆదాయాలకు కలిగించే వినాశనాన్నీ అతను చూశాడు. అతని తల్లిదండ్రులు అతని వైద్యశాస్త్రం చదవాల ని కోరుకున్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని అతను జంతు శాస్త్రంలో తన ఉన్నత విద్యను ప్రారంభించాడు. కేరళలోని తిరువనంతపురం లోని మహారాజ కళాశాలలో జంతు శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, 1940–44 మద్రాస్ విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పూర్తి చేసి జన్యు శాస్త్రం, మొక్కల పెంపకం అధ్యయనం కోసం 1947లో న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరర్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ కి వెళ్ళి1949 లో సైతో జెనెటిక్స్ లో అధిక డిస్టింక్షన్ తో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. ఆయన సివిల్ సర్వీసు పరీక్షల్లో పోటీపడ్డాడు. ఐపీఎస్‌కి ఎంపికయ్యారు. వ్యవసాయ పరిశోధనారంగంలో అడుగు పెట్టారు. ఆయన జన్యు శాస్త్రాన్ని ఎంచుకున్నారు.

నేటికీ దేశంలో రైతులు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. వ్యవసాయం వదిలి వెళ్లిపోయే సంఖ్య పెరుగుతోంది, మద్దతు ధరలు కోసం పార్లమెంటు చట్టం చేయాలని దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమం కొనసాగుతోంది. భవిష్యత్తు భారతావని ఆకలి చావులను చూడకుండా ఉండాలంటే, ఆహార భద్రత తోపాటు పౌష్టికాహారం 144కోట్లమంది భారతీయులకు అందించాలంటే స్వామినాథన్ సిఫారసులను అమలు చేయటమే మార్గం.

*(శతజయంతి ఉత్సవాల సందర్భంగా)*

## మానసిక ఆరోగ్యం విద్యార్థుల ప్రాథమిక హక్కు

ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి కేసు మానసిక ఆరోగ్య హక్కుల ప్రాధాన్యతను భారత దేశ గౌరవ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గుర్తు చేసింది

విద్యార్థి జీవితం ఒక అందమైన కల. కానీ ఆ కలను నశించే అత్యంత తీవ్రమైన క్షణాల్లో ప్రస్తుత విద్యావ్యవస్థ మానసిక ఒత్తిడితో కొట్టు మిట్టాడుతోంది. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు. ఇవన్నీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే చోటు కావాలి కానీ, ప్రస్తుతం విద్యార్థులను ర్యాంక్ లను ఇచ్చే ఒక యంత్రం లాగా మాత్రమే చూస్తున్నాయి. యువత మనసులను, వారి ఆలోచనలను మెల్లమెల్లగా నాశనం చేస్తున్నాయి.

ఇటీవల సుప్రీం కోర్టులో వచ్చిన ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి కేసు, ఈ సమస్యను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఈ విద్యార్థి బార్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్తో బాధపడుతూ, ఢిల్లీకి బదిలీ కావాలని కోరాడు. ఎందుకంటే ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఢిల్లీలో తక్కువ ఖర్చుతో, తగిన సదుపాయాలు లభిస్తున్నాయి. అలాగే తల్లిదండ్రులతో కలసి ఉండటానికి ఆ బదిలీ అవసరమని ఆయన వాదించాడు. కానీ, అతని వినతిని పక్కన పెట్టడం జరిగింది. ఈ సమస్య కేవలం ఒక విద్యార్థి హక్కుల విషయమే కాదు. ఇది మన విద్యా వ్యవస్థలోని మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఒక అతి పెద్ద సవాలు. మానసిక సమస్యలను మౌనంగా, అర్థం చేసుకోకుండా వదులుకుంటే, వాటి ప్రభావం విద్యార్థుల శారీరక, భావోద్వేగ, సామాజిక జీవితాన్ని ప్రమాదానికి కారణంగా మారుతుంది..

ఈ ఏడాది జులైలో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పులో చెప్పింది. మానసిక ఆరోగ్యం కూడా జీవన హక్కులో భాగం ఇది ఒక చారిత్రాత్మకమైన తీర్పు. కానీ ఆ తీర్పును ఎంతవరకు విద్యాసంస్థల్లో అమలు జరుగుతోంది అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది అనడానికి ఇది ఒక మచ్చుతునక మాత్రమే. వెలుగు లోనికి రానివి మరెన్నో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ జాతీయ సంస్థలు, రాష్ట్ర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఇవన్నీ కెరీర్‌ను నిర్మించడంలో మాత్రమే కాకుండా, విద్యార్థుల మానసిక సంక్షేమానికి కూడా బాధ్యత వహించాలి. విద్యార్థులలో మానసిక స్థాయి తగ్గట్లుగా అవగాహన, సపోర్ట్, సదుపాయాలు ఇవన్నీ తప్పనిసరిగా కలిపించాల్సిన బాధ్యత ఉంది. కాగా మానసిక సమస్యలను విద్యార్థి గౌరవానికి, సమాజంలోని మనస్థితికి సంబంధించిన హక్కులు గా మాత్రమే పరిగణించాలి. విద్యార్థులు ఒత్తిడి, విఫలత, ఒంటరితనం, సైకాలజికల్ కష్టాల నుండి బయటకు రావడానికి మద్దతు ఇవ్వాలి. ప్రతి విద్యార్థి తన మానసిక సమస్యల ను తేలికగా చెప్పుకొనే విధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి విద్యాసంస్థలో అందుబాటులో కౌన్సెలింగ్ సెంటర్ ఉండాలి.

ఇది ఒక విద్యార్థి కథ మాత్రమే కాదు, ఇది మన సమాజం, మన పద్ధతులపై ఒక ప్రశ్న. ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి కోర్టును ఆశ్రయించడం ద్వారా మానసిక ఆరోగ్య హక్కుల గురించి చర్చ మొదలైంది. ఇది ఒక కొత్త మార్గదర్శకం కావాలి. విద్యార్థుల మనసును అర్థం చేసుకోవడం, వారికి సరైన మద్దతు ఇవ్వడం ఇది ఇప్పుడు అత్యవసర కర్తవ్యం. విద్యార్థులు మన భవిష్యత్తు. వారి మానసిక ప్రశాంతత ఉంటే ఏదైనా వారు విజయాన్ని సొంతం చేసుకోగలుగుతారు. మానసిక ఆరోగ్యం మనం కాపాడాల్సిన కాపాడుకోవాల్సిన మౌలిక హక్కు.

డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి
970393532

## దేశంలో ఎరువుల కష్టాలు..

దేశవ్యాప్తంగా, ఎక్కడ చూసినా రైతులకు ఎరువుల కష్టాలే. యూరియా కోసం తెలంగాణ రైతాంగం పడుతున్న ఇబ్బందులను చూస్తునే ఉన్నాం. వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు నిరంతర కృషి జరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు మరో విధంగా ఉన్నాయి. ఎరువుల కోసం, ముఖ్యంగా యూరియా, డైఅమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) కోసం విదేశాలపై ఆధారపడటం, ఈ లక్ష్య సాధనకు ఒక పెద్ద సవాలుగా మారింది. దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచడంలో కొంత పురోగతి సాధించినప్పటికీ మన అవసరాలకు, మన ఉత్పత్తికి మధ్య ఇంకా పెద్ద అగాధం ఉంది. ఈ పరిస్థితి మన రైతులను, మన ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదొడుకులకు, రాజకీయ ఉద్రిక్తతలకు గురిచేస్తోంది. భారతదేశంలో అత్యధికంగా ఉపయోగించే ఎరువు యూరియా. 2023–24 ఆర్థిక సంవత్సరంలో, మన దేశంలో ఏకంగా 35.8 మిలియన్ టన్నుల యూరి యా వాడకం జరిగింది. హరిత విప్లవం తర్వాత పంట దిగుబడులను పెంచడానికి నత్రజని సంబంధిత ఎరువులను ఎక్కువగా ప్రోత్సహించడం వల్ల యూరియా వాడకం పెరిగింది. అయితే, దీనివల్ల భూమిలో పోషకాల అసమతుల్యత ఏర్పడి, దీర్ఘకాలంలో నేల ఆరోగ్యం దెబ్బతిని, ఉత్పాదకత తగ్గే ప్రమాదం ఉంది. భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఎరువుల వినియోగదారు అయితే, మూడవ అతిపెద్ద ఉత్పత్తిదారు కూడా. 2024 నాటికి, మన దేశంలో 32 పెద్ద యూరియా కర్మాగారాలు, 19 డిఎపి ఇతర సంక్లిష్ట ఎరువుల కర్మాగారాలు ఉన్నాయి.

2023–24లో మన మొత్తం ఎరువుల ఉత్పత్తి సుమారు 50.34 మిలియన్ టన్నులు. ఇంత పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, మన అవసరాలకు తగినంతగా మనం తయారు చేసుకోలేకపోతున్నాం. ముఖ్యంగా యూరియా కాకుండా ఇతర ఎరువుల విషయంలో ఈ కొరత ఎక్కువగా ఉంది. మన దేశంలో పొటాష్ నిల్వలు దాదాపుగా లేనందున, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) కోసం మనం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడతాము. ఇక డీఏపీ విషయానికొస్తే, దేశీయ ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ, అవసరమైన దానిలో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్నాం. ఈ దిగుమతుల కోసం మనం భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై పెద్ద భారం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన ఎరువుల దిగుమతి బిల్లు చాలా ఎక్కువగా ఉంది. మనం ప్రధానంగా కొన్ని దేశాల నుండే ఎరువులను కొనుగోలు చేస్తున్నాము. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి, ఎందుకంటే ఆ దేశాల్లో ఏవైనా సమస్యలు వస్తేన్మనకు ఎరువుల సరఫరా ఆగిపోతుంది. యూరియా కోసం ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యుఎఇ తదితర దేశాల మీద, డిఎపి కోసం చైనా, సౌదీ అరేబియా, మొరాకో, రష్యా పైన, ఎంఒపి కోసం కెనడా, రష్యా, బెలారస్, జోర్డాన్, ఇజ్రాయెల్ తదితర దేశాలపైనా ఆధారపడుతున్నాం. రష్యా, ఉక్రేన్ మధ్య యుద్ధం, పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు వంటి పలు అంతర్జాతీయ పరిణామాల వల్ల ఎరువుల సరఫరా గొలుసు బలహీనపడింది. దీనివల్ల ధరలు విపరీతంగా పెరిగి, రైతులకు ఎరువులు దొరకడం కష్టంగా మారింది. ఈ దిగుమతుల కోసం అవసరమైన విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశం చేసే ఎగుమతుల ద్వారా, విదేశీ నిల్వల ద్వారా సమకూర్చుకుంటుంది. ఎరువుల రంగంలో స్వావలంబన సాధించడానికి మన ముందు అనేక అడ్డంకులు ఉన్నాయి. ప్రధానమైనది ముడిసరుకుల కొరత. డిఎపి వంటి ఫాస్ఫేటిక్ ఎరువుల తయారీకి అవసరమైన రాక్ ఫాస్ఫేట్, ఫాస్ఫారిక్ యాసిడ్ కోసం మనం దిగుమతులపైనే ఆధారపడతాము. అలాగే, పొటాష్ ఎరువుల కోసం అవసరమైన ముడిసరుకు మన దగ్గర లేదు.

కొత్త ఎరువుల కర్మాగారాలు పెట్టాలంటే చాలా డబ్బు అవసరం. యూరియా తయారీకి కీలకమైన సహజ వాయువు లభ్యత, దాని ధర ఎప్పుడూ ఒక పెద్ద సమస్యే. ఈ రంగంలో పెట్టుబడులు రావాలంటే, ప్రభుత్వం స్థిరమైన, స్పష్టమైన విధానాలను అనుసరించాలి. దేశంలో ఎరువుల సమస్యను పరిష్కారం కావాలంటే, మనం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా దృష్టి పెట్టాలి. కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడకుండా, మరిన్ని కొత్త దేశాల నుండి ఎరువులను దిగుమతి చేసుకోవాలి. అంతర్జాతీయంగా సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ఇబ్బంది లేకుండా, తగినంత ఎరువులను ముందుగానే నిల్వ చేసుకోవాలి. ముడిసరుకులు ఉన్న దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా నిరంతర సరఫరాను నిర్ధారించుకోవాలి. మన దేశంలోనే రాక్ ఫాస్ఫేట్, పొటాష్ వంటి ముడిసరుకుల నిల్వలను కనుగొనడానికి అన్వేషణను ముమ్మరం చేయాలి. తక్కువ ఖర్చుతో ఎరువులను తయారు చేసే కొత్త సాంకేతికతలపై పరిశోధనలను ప్రోత్సహించాలి. 'భూసార ఆరోగ్య కార్డు' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రైతులు యూరియానే కాకుండా అన్ని రకాల పోషకాలను (నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్) సమపాళ్లలో వాడేలా చైతన్యపరచాలి. రసాయనిక ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి. మురుగునీరు, వ్యవసాయ వ్యర్థాల నుండి పోషకాలను తిరిగి సేకరించి, ఎరువులుగా మార్చే పద్ధతులను ప్రోత్సహించాలి.



ఎరువుల రంగంలో స్వావలంబన సాధించడం కేవలం ఆర్థిక అవసరమే కాదు, మన దేశ ఆహార భద్రతకు, రైతుల సంక్షేమానికి అత్యంత వ్యూహాత్మకమైన అవసరం.

సవాళ్లు పెద్దవే అయినప్పటికీ, ప్రభుత్వం, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు కలిసికట్టుగా కృషి చేస్తే, సుస్థిరమైన, స్వావలంబన కలిగిన వ్యవసాయ భవిష్యత్తును మనం తప్పక నిర్మించుకోగలం.

## పన్నుల తీరు మారాలి..

దేశంలో పన్నుల విధానం మారాలి. ఎంత సరళీకృతం చేస్తే అంత మంచిది. ప్రభుత్వ ఖజానాల్లోకి జిఎస్‌టి, టిడిఎస్, ఆదాయపు పన్ను, సుంకాలు, ఇతర పరోక్ష పన్నులు చేరుతాయి. ఒక వ్యక్తి తన ఆదాయంలో సగటున 35 నుంచి 40 శాతం మొత్తాన్ని వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తాడు. వివిధ అభివృద్ధి పథకాల నుంచి ప్రభుత్వ శాఖ నిర్వహణ వరకూ అనేకానేక ఖర్చులను చెల్లించడానికి పన్నుల వసూళ్లు చాలా కీలకం. కానీ, ఇంతటి ముఖ్యమైన విషయాన్ని ప్రభుత్వాలు చూసీచూడనట్టు వ్యవహరించడం విచిత్రం. వివిధ కారణాలు, ప్రత్యేకించి రాజకీయ అంశాలు ఇందులో ముడిబడి ఉన్నాయి. దీనికితోడు సామాన్యులకు అర్థంకాని లేదా చేరువకాలేని రీతిలో ఆదాయ పన్ను విధానాలు, ఫైలింగ్ పద్ధతులు ఉన్నాయి. ఫలితంగా మొత్తం ప్రజలలో చాలా తక్కువమంది మాత్రమే ఆదాయపు పన్ను ఫైల్ చేస్తున్నారు. అంటే దేశంలో ఆరు శాతం కంటే తక్కువగానే ఫైల్ చేస్తున్నారంటే, పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. ఇందులో అత్యధిక సంఖ్యలో పన్ను చెల్లించేవారుగా మధ్య తరగతి వేతనదారులను పేర్కోవాలి. పేదలు ప్రత్యక్షంగా పన్నులు చెల్లించకపోయినా, వారికి ప్రభుత్వం కొన్నింటిని అందజేస్తోంది. అందులో ఉచిత ఆహారధాన్యాలు, సబ్సిడీ ఇంధనం, ఆరోగ్య సేవలు, విద్య తదితర అంశాలు ఉన్నాయి. పన్నుల విధానంలో దృష్టి సారించాల్సిన మరో అంశంగా పన్నుల వడపోతలో ఉన్న అసమానతలను పేర్కోవాలి. ధనికులు, పెద్ద కంపెనీలు వివిధ రకాలైన పన్ను వడపోతలు, మినహాయింపులు, చట్టపరమైన మార్గాలను ఉపయోగించి పన్ను భారాన్ని తగ్గించుకోవడం పరిపాటి. ఇది పన్ను వ్యవస్థలో అసమానతలను పెంచుతున్నది. చిల్లర దుకాణాల నుంచి పెద్దపెద్ద స్టోర్ల వరకూ అత్యధికశాతం లావాదేవీలు బిల్లులు లేకుండానే కొనసాగడం మనకు కొత్తకాదు. ఇది బహిరంగ రహస్యమైనప్పటికీ, ఎవరూ పట్టించుకోరు. వేళ్లూనుకున్న అవినీతి, లంచాలు తీసుకునే అధికార యంత్రాంగం ఈ దుస్థితికి ప్రధాన కారణాలు. ఎవరైనా చిరువ్యాపారి పన్ను నిజాయితీగా పన్ను కట్టడానికి ముందుకొస్తే, అతను ఎదుర్కొనే సమస్యలు కోకొల్లలు. సింగిల్ విండో విధానం లేనేలేదు. ఏ విధంగా రిటర్న్ ఫైల్ చేయాలన్నది చాలా మందికి ఒక పజిల్. అత్యంత సంక్లిష్టమైన విధానాలు, బ్రోకర్లను తప్ప పన్ను చెల్లింపుదారులను లక్ష్యపెట్టని సిబ్బంది, అధికారులు దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను కూల్చేస్తున్నారు. ప్రభుత్వాలే లంచగొండులకు ఊతమిస్తుంటే, అధికార యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. పన్ను విధానంలో సమూలమైన మార్పులు చేసి, వ్యవస్థలో ఉన్న లంచగొండితనాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తే తప్ప, దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడదు.

## తొర్రూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/తొర్రూరు :** బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ తొర్రూరు పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలు మార్మోగాయి. సోమవారం తెలంగాణ సాంప్రదాయమైన బతుకమ్మ పండుగను మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. రంగు రంగు పూలను తీసుకువచ్చి అందరిని ఆకట్టుకునే విధంగా బతుకమ్మలను తయారు చేశారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి, తదితర పువ్వులతో చిన్నా, పెద్ద తేడా లేకుండా మహిళలు బతుకమ్మలను పేర్చారు. తొర్రూరు పెద్ద చెరువు వద్ద బతుకమ్మలను ఉంచి మహిళలంతా కలిసి బతుకమ్మ ఆట, పాటలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకొని స్వీట్లు తినిపంచుకున్నారు. ఆయా చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పెద్ద చెరువు వద్ద సంబంధిత అధికారులు లైట్లు, తదితర ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని జయరాం తండా గ్రామానికి చెందిన బానోతు బాలునాయక్ కూతురు బానోతు అనిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హన్మకొండ గార్డియన్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటుండగా సోమవారం బాధితులను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ అధ్యక్షుడు సుందర్ రాథోడ్ నాయక్, కర్ర



రవీందర్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు లేలాకుల మధూకర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ బానోతు పద్మ రవి తదితరులు పాల్గొన్నారు.



## కె.రవికి అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ డిప్లొమా

**ప్రజాపక్షం/జనగామ :** గోవాలో సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు జరిగిన జేకేఏ మాన్‌సూన్ ట్రైనింగ్ క్యాంప్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో డాన్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించబడగా వీటిలో కె రవి ఇంటర్నేషనల్ షోడాన్ బ్లాక్ బెల్ట్‌లో విజయవంతంగా ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ షైహన్ టి ఇషి, వైస్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ శిహాన్ వై ఒగురా, ఆనంద్ రత్న, తెలంగాణ, ఏపీ చీఫ్ సెన్‌సాయ్ రాపోలు సుదర్శన్ సమక్షంలో రవికి సర్టిఫికెట్ అందజేశారు.

## ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.విశ్వేశ్వర్‌ను గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ.మహేందర్‌ను పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

**కమీషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.వంశీకృష్ణను సంగెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎల్.నరేష్‌ను మీల్స్ కాలనీ ఎస్ఐగా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రిక్షా కార్మికునికి దక్కిన గౌరవం



గ్రూప్ 2లో రిక్షా కార్మికుని కుమారుడు సబ్ రిజిస్ట్రార్‌గా నియామకం

**ప్రజాపక్షం/తొర్రూరు :** పట్టణ కేంద్రానికి చెందిన రిక్షా కార్మికుడు నకిరకంటి శంకర్ రిక్షా నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. రిక్షా కార్మికుడు శంకర్ కుమారుడైన నకిరకంటి మధు గ్రూప్ 2లో సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులు కావడంతో శంకర్‌కు గౌరవాన్ని తెచ్చిపెట్టింది. పట్టణ కేంద్రానికి చెందిన పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన నకిరకంటి మధుకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదగాని సోమయ్య, పరుపాటి రామ్మోహన్‌రెడ్డి, ధరావత్ జైసింగ్‌నాయక్, పాల శ్రీనివాస్, పైండ్ల సోమన్న, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి మాతగా దర్శనం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఎర్ తోట సమీపంలో ఉన్న కనుకదుర్గ దేవస్థానం నందు దేవి శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రులు మొదటి రోజు ప్రారంభం నుండి నేటి వరకు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందడం జరిగిందని అలాగే సోమవారం కార్యక్రమంలో భాగంగా కివి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ దాసి సతీష్ మూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీ హోమంలో, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాలకుర్తి ఆంజనేయ శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన గండ్ర నవీన్ రెడ్డి సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు జాయినింగ్ రిపోర్ట్ సమర్పించారు. విధుల్లో చేరిన నవీన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందిస్తూ, ప్రజలకు సేవలందించే క్రమంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం తండ్రి, తండ్రి బంధుమిత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర కేడర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం పొందడం అభినందనీయమని అన్నారు. విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని బాధ్యతలను సమర్థవంతంగా నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ సాధనలో ప్రోత్సాహించిన తల్లితండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## గ్రూప్–1లో డిఎస్‌పిగా విజయ్



**ప్రజాపక్షం/మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఆర్లగడ్డ తండాకు చెందిన జాటోత్ బాలాజీ పెద్ద కుమారుడు జాటోత్ విజయ్ గ్రూప్ 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. కష్టపడి పట్టుదలతో చదువుకున్న విజయ్ తొలి ప్రయత్నంలోనే గ్రూప్ 1లో డిఎస్పీగా విజయం సాధించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, మరిపెడ మాజీ ఎంపిపి గుడిపూడి మంజుల అభినందించారు.

# సల్లంగా సూడమ్మా.. మా సద్దుల బతుకమ్మ

### జనసంద్రంగా బతుకమ్మ కుంట

**ప్రజాపక్షం/జనగామ :** చల్లంగా చూడమ్మా సద్దుల బతుకమ్మా...మా జీవితాలలో వెలుగులు నింపు, పాడిపంటలతో సుఖసంతోషాలు పంచు అంటూ మహిళలు సద్దుల బతుకమ్మను ఆనందంగా సాగనంపారు. 9 రోజుల క్రితం ఎంగిలి పూల బతుకమ్మతో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కాగా సోమవారానికి 9 రోజులు కావడంతో జనగామ పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఎంతో ఆనందోత్సాహాల మధ్య మహిళలు బతుకమ్మ జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను అలంకరించి అగరుబత్తీలు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి ఇంటి దగ్గరి నుంచి బయల్దేరి కుటుంబ సమేతంగా బతుకమ్మ కుంటకు తరలివచ్చారు. మహిళలతో బతుకమ్మ కుంట కిక్కిరిసిపోయింది. ఇటీవల రూ.1కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయడంతోపాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అవన్ని ఆకర్షణగా ప్రజల్ని ఉట్టిపడేశాయి. బతుకమ్మ కుంట గ్రౌండ్ మధ్యలో భారీ బతుకమ్మను పేర్చి దాని చుట్టూ మహిళలు ఆటపాటలతో ఆడారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో



పాటు బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాల లక్ష్మి, మార్కెట్ కమిటి చైర్మన్ బనుక శివరాజ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి పల్లా నీలిమతోపాటు రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం అధికారికంగా మంగళవారం సెలవు ప్రకటించి బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చినప్పటికీ పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ పండుగ జరుపుకోవడం విశేషం. అధికారులు సైతం సోమ, మంగళవారం బతుకమ్మ పండుగ జరుపుకునేలా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి లోటుపాట్లు లేకపోవడంతో బతుకమ్మ ఉత్సవాలు జనగామలో ఘనంగా జరిగాయి. కొందరు మహిళలు తమ ఏరియాలోని ప్రధాన కూడలి వద్ద బతుకమ్మ ఆటలు ఆడి మళ్లీ ఆ బతుకమ్మలను బతుకమ్మ కుంటకే తీసుకొచ్చారు. బతుకమ్మ ఆటలను చూసేందుకు పట్టణ పుర ప్రముఖులు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# కుటుంబ సంక్షేమ నిధి చెక్కును అందజేసిన మంత్రి



**ప్రజాపక్షం/ములుగు :** వరంగల్ జిల్లా టిజిఎంఎస్ వంచనగిరి టిజిటి హిందీ ఉపాధ్యాయులు పోరిక రమేష్ ఇటీవల యాక్సిడెంట్‌లో మరణించగా సోమవారం ఆయన స్వగ్రామం అన్నంపల్లిలో టిఎస్‌యూటిఎఫ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. టిఎస్‌యూటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి చెక్కును తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపి బలరాం నాయక్ టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి టిఎస్‌టియూఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్ చేతుల మీదుగా సోమవారం జరిగిన సంస్మరణ సభలో పోరిక రమేష్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టిఎస్‌టియూఎఫ్ ప్రవేశపెట్టిన కుటుంబ సంక్షేమ నిధి ఎంతో ఆదర్శవంతమైందని, ఇది ఒకరి కోసం అందరం అందరి కోసం ప్రతి ఒక్కరం అనే నినాదంతో ప్రవేశపెట్టి ఉపాధ్యాయులకు ఆదర్శవంతంగా నిలుస్తున్నారని అన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సంస్కరణ సభలో టిఎస్‌సిటిఎఫ్ ములుగు జిల్లా బృందం, టిఎస్‌యూటిఎఫ్ వరంగల్ జిల్లా బృందం, హన్మకొండ బృందం, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్ :** తెలంగాణ పూల పండుగ బతుకమ్మ ముగింపు చివరి రోజు "సద్దుల బతుకమ్మ"ను పురస్కరించుకొని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో నుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ పండుగ అని అన్నారు. దేవతలను అర్చించే పువ్వులే బతుకమ్మగా పూజలందుకోవడం తెలంగాణ ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ఆరాధనను, కృతజ్ఞత భావనను తెలియజేస్తుందని తెలిపారు. సబ్బండ వర్గాలు సమిష్టిగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని వెల్లడించారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ రాష్ట్రం నిండైన బతుకమ్మను తలపిస్తున్నదని అన్నారు. గ్రామాల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై తొమ్మిది రోజుల పాటు సాగిన బతుకమ్మ ఆడబిడ్డల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలు సాంస్కృతిక శోభను సంతరించుకున్నాయని అన్నారు. ఈ సందర్భంగా విజయాలను అందించే విజయ దశమిని స్వాగతిస్తూ సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బతుకమ్మల నిమజ్జన సమయంలో స్వీయ జాగ్రత్తలతోపాటు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని జగన్మాత గౌరీదేవిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రార్థించారు.

# పేదవాడి సొంతింటి కల సాకారం చేసిన ప్రభుత్వం

### వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల స్వంత ఇంటి కల సాకారం అవుతుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గం 1,55,56,65 డివిజన్ల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 40 మందికి మంజూరు పత్రాలను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 22వేల 500కోట్లతో 4లక్షల 50వేల ఇళ్ల నిర్మాణం చేపట్టిందని తెలిపారు.అందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో 175కోట్లతో 3వేల 500ఇల్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు కొంక హరిబాబు, అయ్యాల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, దేవరకొండ అనిల్ కుమార్, శనిగరపు అనిత, బత్తుల స్వాతి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్ తో పాటు మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలోని పలు దేవాలయాలను, దుర్గామాత మండపాలను పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం హన్మకొండలో గల శ్రీ శ్రీ శ్రీ సిద్దేశ్వర దేవాలయాన్ని నాయిని రాజేందర్ రెడ్డి తన అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డితో కలిసి సందర్శించి ఆలయ పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 54వ డివిజన్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆ తరువాత 4వ డివిజన్లో ఫ్రెడ్స్ యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యంత భారీ దుర్గామాత విగ్రహన్ని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా 52 అడుగుల భారీ విగ్రహన్ని ప్రతిష్టించిన కమిటీ సభ్యులను అభినందించారు. కాజీపేటకు చెందిన కడిపికొండ, విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలిస్ స్టేషన్ వద్దగల మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు.అలాగే వరంగల్ మట్టెవాడలో, ఎంజీఎం కూడలిలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాలను సందర్శించి దుర్గామాతను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అంగరంగ వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, తొమ్మిదిరోజులు నిష్ఠతో భక్తి శ్రద్దలతో ఉత్సావాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, సయ్యద్ విజయశ్రీ రజాలి,గుంటి శ్రీనివాస్, రవీందర్, కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్లు స్థానిక డివిజన్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్, మహిళా నాయకులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేసే ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిసిసి జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు సామ పాపయ్య డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ భూపోరాట కేసులో భాగంగా సోమవారం వారు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, భూపోరాటం చేసి ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని బయ్యారం ఉక్కు పరిశ్రమ పోరాటంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలన్నారు, కోర్టుకు హాజరైన వారిలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మేక వీరన్న, కేదాసు రమేష్, రాములు నాయక్, పోచారం కృష్ణ ఉన్నారు.

## ఒక్కరే ఎస్సీ మహిళ.. ! రిజర్వేషనూ ఎస్సీ మహిళే

**ప్రజాపక్షం /సంగెం :** కొంతమందికి అదృష్టం అనుకోకుండా తగులుతోంది. అలాంటి అవకాశం వస్తోందని వారు ఊహించి కూడా ఉండరు. అలాంటిది సంగెం మండల పరిధిలోని ఆశాలపల్లి గ్రామ పంచాయతీలో అనూహ్య పరిణామం జరిగింది. ఈసారి సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో.. గ్రామంలో కేవలం ఒకే ఒక్క ఎస్సీ మహిళా ఓటరు అయిన కొంగర మల్లమ్మకు అదృష్టం తలుపు తట్టింది. ఏకైక ఎస్సీ మహిళ కావడంతో ఆమె ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## పీఎం ధన్–ధాన్య కృషి యోజన పథకానికి జనగామ జిల్లా ఎంపిక

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జనగామ :** ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం వ్యవసాయ రంగంలో ఒక చారిత్రాత్మక మార్పు తెచ్చే పథకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో అన్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, మెరుగైన నీటిపారుదల, రుణాల సులభతరం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 100 జిల్లాలను గుర్తించగా ఇందులో తెలంగాణ నుంచి ఎంపికైన 4 జిల్లాల్లో జనగామ జిల్లా కూడా ఉందన్నారు. ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన వ్యవసాయంలో అత్యంత నిరంతర నిర్మాణాత్మక సవాళ్లను పరిష్కరిస్తూ ఉత్పాదకతను పెంచడానికి స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడానికి, జీవనోపాధిని మెరుగుపరుచడానికి రూపొందించిన సమగ్ర వ్యవసాయ కార్యక్రమం అని తెలిపారు.

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపి కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సాంస్కృతిక జీవన ధార అన్నారు. పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ ఆడపడుచులు ఆనందంగా కలసి పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ ఐక్యత, స్నేహం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. బతుకమ్మలో ప్రతి పువ్వు ఒక ప్రత్యేకత కలిగి ఉంటుందని, అవి జీవన సమతౌల్యాన్ని సూచిస్తాయని ఎంపీ వివరించారు. తల్లి ప్రకృతికి కృతజ్ఞతగా జరుపుకునే ఈ పండుగలో మన సంస్కృతి, సంప్రదాయాలు, స్త్రీ శక్తి ప్రతిఫలిస్తాయని తెలియజేసారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, వారి జీవన ఉత్సాహం ఈ పండుగ ద్వారా ప్రతిఫలిస్తుంది అని అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ కుటుంబాలను, బంధాలను, సమాజాన్ని ఒకే తాటిపైకి తెస్తుందని తెలిపారు. ప్రతి ఇంటా సుఖశాంతులు నిండాలని, తెలంగాణ సంస్కృతి మరింత విశ్వవ్యాప్తంగా వెలుగొందాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

## కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కలెక్టర్ కొత్తపల్లి కుశీల్



**ప్రజాపక్షం/ములుగు :** డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన కొత్తపల్లి కుశీల్ వంశీ సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను కలిసి కలెక్టర్‌కు జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. విధుల్లో చేరిన కొత్తపల్లి కుశీల్ వంశీని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అభినందిస్తూ ప్రజలకు సేవలందించే క్రమంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం తల్లి తండ్రి బంధు మిత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర కేడర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం పొందడం అభినందనీయమని అన్నారు. విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని బాధ్యతలను సమర్థవంతంగా నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కోచింగ్ తీసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ సాధనలో ప్రోత్సహిచాలని తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరు నెలలుగా రేషన్ డీలర్లకు కమీషన్ పెండింగ్.. కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్ :** ఉమ్మడి హనుమకొండ జిల్లాలో ఉండే రేషన్ డీలర్ల యొక్క ఆరు నెలల కమీషన్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ రేషన్,డీలర్ అధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఆరు నెలల నుండి 426 మంది కమీషన్ విడుదల చేయకుండా కాలయాపన చేసుకుంటూ దసరా పండుగ సందర్భంగా మా కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు..తక్షణమే తమ విన్నపానికి కలెక్టర్ స్పందించి తక్షణం పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని, కమిషన్ విడుదల చేయకుంటే స్వచ్ఛందంగా బందును పాటించి ప్రభుత్వంకు నిరసన తెలుపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చింతలపాని అన్వేష్ రెడ్డి, విజయ్ కుమార్ జాన్, గంగారపు పద్మ యాదగిరి, రవీందర్ రెడ్డి, రవీందర్, ఏలియా, లక్ష్మి నారాయణ, అరుణ, విమల పాల్గొన్నారు.

## దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు



దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**మన తెలంగాణ/రాయపర్తి:** మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో దేవిశరన్నవ రాత్రి ఉత్సవాల్లో సోమవారం పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాలు మనకు ధైర్యం, శక్తి, సమైక్యతను ప్రసాదించే శుభదినాలు అన్నారు. సంస్కృతిక సాంప్రదాయాలకు నిలయం తెలంగాణ రాష్ట్రం అన్నారు. పండుగల ద్వారా ప్రజల మధ్య ఐక్యత, స్నేహ భావం మరింతగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, పాలకుర్తి సోమనాథ్ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకన్న, గజవెల్లి శేఖర్, గుగులోతు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ప్రజాపక్షం/అశ్వాపురం: నేడు బతుకమ్మ పండుగలో భాగంగా చివరి రోజైన సద్దుల బతుకమ్మతో పండుగ ముగియనుంది. 9వ రోజు సద్దుల బతుకమ్మను నిర్వహించే మహిళలు 9 దొంతరలుగా బతుకమ్మను పేర్చి, అంతా ఒక చోట చేరి ఆడి పాడి బతుకమ్మలను గంగమ్మలో నిమజ్జనం చేసారు. కులాలకు అతీతంగా, పేద ధనిక తారతమ్యం లేకుండా, చిన్న పెద్ద అందరూ కలిసి ఘనంగా జరుపుకునే పండగ ఈ బతుకమ్మ పండుగ, నేడు సద్దుల బతుకమ్మ నాడు తంగేడు, గునుగు, కట్ల, చేమంతి, బంతి, మల్లె, మొల్ల, మొగిలి, సంపెంగ, కలువ, తామర వంటి పూలతో బంగారు బతుకమ్మను పేర్చి సాంప్రదాయబద్ధంగా గౌరమ్మను పూజిస్తారు. రాగిపళ్లెంలో తంగేడు ఆకులు అమర్చి, వాటిపై తంగేడు పూల కట్టలు పేర్చి, మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ చాలా అందంగా బతుకమ్మను పేర్చుతారు. దానిపై పసుపుతో గౌరమ్మను తయారు చేసి పెడతారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను పూజించి సాయంత్ర సమయంలో ఆడబిడ్డలు అందరూ పట్టు చీరలు ధరించి అందంగా ముస్తాబై ఒక చోటకు చేరుతారు. బతుకమ్మలను మధ్యలో పెట్టి ఆడి పాడి బతుకమ్మను చివరకు గంగమ్మ చెంతకు చేరుస్తారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్



ప్రజాపక్షం/భద్రాచలం: మోడల్ కోడ్ అమల్లో ఉన్నందున, ఆ కోడ్ ముగియగానే వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. కోడ్ అమల్లో ఉండగా, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తామని అన్నారు. దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి ఎమ్మెల్యే జారే



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాల్టీ అభివృద్ధికి నియోజకవర్గ శాసనసభ్యునిగా ప్రజలు కోరుకునే విధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. సోమవారం అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని డ్రా నిర్వహించి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం అశ్వారావుపేట కొత్త మున్సిపాల్టీ అభివృద్ధి కోసం రూ.15కోట్లు నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులతో నూతన మున్సిపాల్టీ భవనం, ఆధునిక మున్సిపల్ మార్కెట్, పబ్లిక్ టాయిలెట్స్, ట్యాంక్ బండ్ అభివృద్ధి, దొంతికుంట చెరువు నందు సిసి రోడ్లు, డ్రైనేజిల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా కొత్త బిటి రోడ్లు, రైతుల కోసం పంట పొలాలకు వెళ్లేందుకు గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజిల నిర్మాణం కోసం కూడా నిధులు సమీకరించామని, త్వరలోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీలో ప్రజల అవసరాలకనుగుంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

### ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ కళాశాల మైదానం నందు దీపావళి షాపులు ఏర్పాటు చేయుటకు అనుమతి ఇప్పించాలని కోరుతూ వ్యాపారస్తులు దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కుంకుమ పూజలు, అన్నదానం



ప్రజాపక్షం/రఘునాథపాలెం : దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారి మండపం వద్ద కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద కుంకుమ పూజలు, సరస్వతి పూజలు నిర్వహించారు. చంద్ర భాస్కర్‌రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కుంకుమ పూజ, సరస్వతి పూజలో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకలను కూడా అమ్మవారి మండపం వద్ద మహిళలు ఆటపాటలతో సందడిగా నిర్వ హించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల విధులు



ప్రజాపక్షం/జూలూరుపాడు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, మండల విద్యాశాఖాధికారి జుంకీలాల్‌లు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని ఉపాధ్యాయులకు, ఇతర శాఖల అధికారులు, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి తులసీ రాం, శిక్షకులు సుధాకర్‌రెడ్డి, సంపత్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్కని కలిసిన మార్కెట్ చైర్మన్ గంగారావు



ప్రజాపక్షం/వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, టిసిసి అధ్యక్షులు దుర్గాప్రసాద్‌తో కలిసి మధిరలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. మార్కెట్ చైర్మన్ గంగారావు భట్టివిక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వృత్తి విద్యా కోర్సులు అభ్యశించే విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కా కుండా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునే దిశగా శ్రమి ంచాలని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని రుద్రంపూర్ ఏరియా, 5 ఇంక్లైన్‌నో అధునాత సాంకేతిక కేంద్రం (ఏటీసీ)ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యశించే విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఏటీసీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అ న్నారు. ఐటిఐలను ఏటీసీలుగా మారుస్తూ విద్యార్థులను సాంకేతిక రంగంలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకు న్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చె ప్పారు. ఇది నైపుణ్య శిక్షణ విస్తరణలో ఒక కీలక అడుగని అభినందించారు. ఏటీసీల ద్వారా యువతకు పారదర్శకమైన శిక్షణను అందించడం వల్ల రాష్ట్రం టెక్నాలజీ హాబ్‌గా అభివృద్ధి సాధిస్తుందని చె ప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ గొప్ప అవకాశా న్ని యువకులు సద్వినియోగం చేసుకుని ఉన్నతం గా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు వంగా వెంకట్, వట్టికొండ మల్లిఖార్జున రావు, నాయకులు తోట రాజు, ప్రిన్సిపల్ గోనెల రమేష్, సిబ్బంది శోభన్‌బాబు, బి రాము, నర్మద, చెన్ను సామ్యేల్ లక్కీ పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే బస్టాండ్‌కు ఈ దుస్థితి : కూనంనేని

### నూతన బస్టాండ్ ఏర్పాటు కోసం కృషి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆర్టీసి బస్టా ండ్ ఇంత అధ్వాన్నంగా ఉందని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసరాలు ప్రయాణికులకు అనువుగా ఉండాలే గానీ ఎక్కడా చూసినా చెత్తా చెదారం పేరుకోవడం తోపాటు వర్షపు నీరు నిల్వ, ప్రయాణికులు వేచి ఉండేందుకు కూడా అనువుగా లేదని, భయంకరమైన దుర్గంధం ఎదజల్లుతోందని మండిపడ్డారు. అధికారులు టార్గెట్ల కోసం సిబ్బందిని వేదించడం మానుకుని అభివృద్ధి పై కనీస దృష్టి సారించాలన్నారు. ప్రయాణికులు ప్రాంగణం మరీ ఇంత దారుణంగా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం కేంద్రంగా నూతన బస్టాండ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో పాటు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కందుల భాస్కర్, ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బంది న్నారు.



## విలేజ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆది ఖర్మయోగి అభియాన్ కార్యక్ర మం అమలులో భాగంగా జిల్లా పం చాయితీల సమగ్రాభివృద్ధి కోసం వి లేజ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం టెలికాన్ఫిరెన్స్ ద్వారా అన్ని శా ఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 130 గ్రామపంచాయితీల్లో విలేజ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం అత్యవసరం అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం బోర్వేల్ మరమ్మత్తులు, కొత్త బోర్వేల్‌లు, రోడ్లు, వాటర్ ట్యాం కు లు, విద్యుత్ సదుపాయాలు, వ్యవసాయ ఆధునీకరణ, డ్రోన్ల వినియోగం, ట్రాక్టర్లు, వాటర్‌సెట్స్, అంగన్ వాడీ కేంద్రాల నిర్మా ణం, విద్యార్థుల కోసం డైనింగ్ హాల్స్, వైద్య సదుపాయాలు, గ్రామాలలో పంట విస్తీర్ణం వివరాలు వంటి అంశాలను చేర్చి నివేదికలు సమర్పించాలన్నారు. సెప్టెంబర్ 30వ తేదిలోగా పంచాయితీలలో కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.

## రసవత్తరంగా మారిన తిరుమలాయపాలెం రాజకీయం

### చక్రం తిప్పుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ?

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయటంతో ఎంతో ఆసక్తికర పరిణామాలతో తిరుమలాయపాలెం మండలంలో రసవత్తర రాజకీయం చోటు చేసుకుంది. ముఖ్యంగా మండలంలోని 40 గ్రామపంచాయతీల పరిధిలో బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఎక్కువశాతం ఉండటం అందరూ బిసికి ఎంపిపి, జెడ్పిటిసి రిజర్వేషన్ అవుతుందని భావించినప్పటికీ తిరుమలాయపాలెం జెడ్పిటిసి స్థానానికి ఎస్టీ రిజర్వేషన్ కావటం కోసమెరుపు. దీనిలో భాగంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు స్థానిక గిరిజన నేతల భార్యలు ముందు ఉంచే క్రమంలో మల్లగుల్లాలు పడుతున్న సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్ణయంతో సంశయంలో పడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఖమ్మం జిల్లా జెడ్పి చైర్మన్ స్థానం ఎస్సీ రిజర్వ్ కావడంతో పొంగులేటికి అత్యంత సన్నిహితంగా ఉన్న వైరా స్థానిక కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయభాయిని తిరుమలాయపాలెం జెడ్పిటిసి అభ్యర్థిగా నిర్ణయించేందుకు పాలేరు క్యాంపు కా ర్యాలయంలో సమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావటంతో మండలంలో ఇంకొక ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే మండలంలో ఎస్సీ ఎంపిటిసి మహిళ స్థానాలు పిండిప్రోలు, తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం, బీరోలు నాలుగు ఎస్సీ రిజర్వేషన్లు కాగా ఎస్సీ మహిళా అభ్యర్థులు రంగంలోకి దిగేందుకు సిద్ధం అవుతున్న సమయంలో ఆసక్తి పరిణామం చోటు చేసుకుంది. తిరుమలాయపాలెం మాజీ ఎంపిపి అశోక్ సతీమణి సుమలత, జూపెడ గ్రామానికి చెందిన లంజపల్లి శ్రీనివాస్, సత్యమని రజిత, కొక్కిరేణి గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ అంబేద్కర్ సతీమణి అశ్విని బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ముగ్గురిలో ఎవరికి కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఇస్తుందో వేచి చూడాల్సిందే.



# ‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం

ప్రజాపక్షం/పాల్వంచ : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గెలుపే లక్ష్యంగా పని చేయాలని, దీని కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మండల పరిధి దంతెలబోర, నాగారం, బసవతారక కాలని ఎంపిటిసి స్థానాల పరిధిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. సర్పంచ్, ఎంపిటిసిలతో పా టుగా, జెడ్పిటిసి స్థానంలో గెలిచేందుకు తగిన వ్యూహాలను సమీక్షించారు. అనంతరం ముత్యాల మాట్లాడుతూ పార్టీ బలపరచిన వారిని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల వలె పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గ్రామాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రభుత్వం నుండి అధిక నిధులు తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. స్థాని సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి స్థానాలతో పాటుగా ఎకైన జెడ్పిటిసి స్థానాన్ని గెలిచి తీరాలని స్పష్టం చేశారు.అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని అనుకూలంగా మార్చుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతూ గెలుపు కోసం పోరాడాలన్నారు. ఎంఎల్ఏ సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకొందామన్నారు. మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాం బాబు, నాయకులు ఎల్లంకి శివరావు, పోలేబోయిన వెంకటేశ్వరరావు, తాళ్ళ వెంకటేశ్వర్లు, పొందు రోశయ్య, నెల్లెల నాగరాజు, కంటె గోవర్ధన్, చంచలపురి శ్రీనివాసరావు, బానోత్ రంజిత్, సాయిలు వెంకన్న, మేక రాంబాబు, బదావత్ శ్రీను, రెంటాల సుందర్‌రావు, గోపాల క్రిష్ణ, జర్పుల మోహన్, విజయ్‌రావు, శ్రీను పాల్గొన్నారు.



# అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ద్వారకాపురి కాలనీలో ఇళ్ల స్థలాలు లేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు పంపిణీ చేయాలని, సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్ల నష్టపోతున్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని కోరుతూ సిపిఐ సత్తుపల్లి ద్వారకాపురి కాలనీ శాఖ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ పున్నం సత్యనారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలో వేలాదిమంది పేదలు ఇళ్ల స్థలాలు లేక ఒక్కొక్క ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు నివాసముంటున్నాయని, గత టిఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో పేదలను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, ద్వారకాపురి కాలనీ శాఖ కార్యదర్శి ఎరజాల రాజశేఖర్, శేఖర్, ద్వారకాపురి కాలనీ శాఖ అధ్యక్షుడు సీమోను ,నాగరాజు, మహేష్ ,ఖాసిం, మాలతి, పద్మ, తులసి, మాణిక్యం, నాగన్న, సూరయ్య, శ్రీదేవి, వెంకటమ్మ, రమణమ్మ, సుబ్రహ్మణ్యం, బ్రహ్మం, చారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమ్మతల్లిని దర్శించుకొన్న ఎంపి రఘురామ్‌రెడ్డి

### టిఆర్‌వికెఎస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజాపక్షం/పాల్వంచ : అమ్మదయతో రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు, జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఖమ్మం పార్లమెంట్ సబ్యులు రామసహాయం రఘురామ్‌రెడ్డి అన్నారు. పాల్వంచ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మండల పరిధి పెద్దమ్మతల్లి దేవాలయాన్ని సంధర్శించారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్లాంట్ నిరామణం కోసం పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించిన ఎంపి రాఘు రాం రెడ్డిని కార్మికులు, ఉద్యోగులు ఎంపిని ఘనంగా సన్మానించారు. టెన్నిస్ కోర్టును పరిశీలించిన ఎంపి పాల్వంచ మున్సిపాలిటి పరిధి శ్రీనివాస కాలనీలో గల టెన్నిస్ కోర్టు, మిని స్టేడియాన్ని సందర్శించి పరిశీలించారు. అథ్లెటిక్ ట్రాక్, డ్రైనేజి, ఎంట్రన్స్ రోడ్, గేట్, ట్రెక్కింగ్ తదితర సదుపాయాలను కల్పించాలని జిల్లా టెన్నిస్, ఒలంపిక్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి ఎంపిని కోరారు. స్పంధించిన ఎంపి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మురళి, చీకటి కార్తీక్, సందుపట్ల శ్రీనివాస్, టిఆర్‌వికెఎస్ కేటిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కురుమిళ్ళ రవికుమార్, సుభాని, నాయకులు దంచనాల రాంబాబు, ముత్యాల రాంబాబు, మల్లెల వీరనారాయణ, నాదెళ్ళ రవికుమార్, తోట అనిల్, ధర్మరాజుల నాగేశ్వరరావు, పి. శంకర్, వై. వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, నాయకులు కాపర్తి వెంకటాచారి, మసూద్. కిషోర్, మనోజ్ పాల్గొన్నారు.

## మోరంపల్లిబంజర్‌లో.. భారీగా పట్టుబడ్డ గంజాయి

### పోలీసుల అదుపులో గంజాయి నింధితుడు

ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ఫారెస్ట్ చెక్ పోస్ట్ ప్రాంతంలో సోమవారం భారీగా గంజాయి పోలీసులకు పట్టుబడింది. హర్యానా రిజిస్ట్రేషన్‌కు చెందిన కారులో గంజాయి తరలిస్తుండగా బూర్గంపాడు పోలీసులకు విశ్వసనీయ సమాచారం మేరకు బంజరు గ్రామంలో పట్టుకొని విచారణ చేపట్టారు. ఇది ఇలా ఉండగా భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్నటువంటి చెక్ పోస్ట్ దాటి గంజాయి తరలి వెళ్లడంపై పలు అనుమానాలు రేకెత్తిన్నాయి. స్థానిక మండలానికి చెందిన పాత్ర ఉన్నట్టా లేనట్టా అనే సందేహాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ నుండి భద్రాచలం చేరుకొని బూర్గంపాడు మండలానికి రావడానికి ఎలాంటి రెక్కీ లేకుండా, ఎవరి పాత్ర లేకుండా తరలి వెళ్లాలంటే ఇబ్బందులతో కూడుకున్న విషయమే గంజాయి రవాణా విషయంలో బూర్గంపాడు మండలానికి చెందిన వారి పాత్ర ఉంటే వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుందన్నే సందేహం లేకపోలేదు. గంజాయి రవాణాకు పోలీసు శాఖ వారు పట్టుకోవాలంటే అట్టి రవాణా జరుగుతున్న తీరు పూర్తి సమాచారం ఉంటే తప్ప నిలువరించే ప్రయత్నాలు చేయటం కష్ట సాధ్యమే నంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. సారపాక కేంద్రంగా గంజాయి రవాణా చేసే వ్యక్తులు, మండలానికి చెందిన మరి కొన్ని ప్రాంతాలకు చెందిన వారు గంజాయి రవాణా, గంజాయికి బానిసలుగా అవుతున్న తీరుపై పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి అరికట్టాలని మండల ప్రజలతో పాటు పలువురు మేధావులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం మండలం లో పర్యటించారు. మండలం లోని అమ్మగూడెం లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. కొరట్లగూడెం, గువ్వలగూడెం లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. కోనాయిగూడెం, నేలకొండపల్లి గ్రామాలలో సీసీ రోడ్ల కు శంఖుస్థాపన చేశారు. పలువురు మంత్రి ని కలిసి వివిధ సమస్యల పై విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, అడపాల రామారావు, నల్లాని మల్లిఖార్జునరావు, రాయపూడి నవీన్, నంబూరి రామారావు, యర్రబోయిన నర్సయ్య,పెంటమల్ల పుల్లమ్మ, మేకల వేంకటేశ్వర్లు, విజయ్ బాబు, కడియాల నరేష్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట మండలంలోని స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో 11 ఎంపిటిసిలకు 27 గ్రామపంచాయతీలకుగాను రిజర్వేషన్లు ప్రకటించినట్లు ఎంపిడిఓ బి.అప్పారావు తెలిపారు. తిరుమలకుంట బిసి జనరల్, కొత్తమామిళ్లవారిగూడెం బిసి మహిళ, నందిపాడు ఎస్టీ జనరల్, గుమ్మడివల్లి ఎస్టీ మహిళ, బచ్చువారిగూడెం జనరల్ , గాండ్లగూడెం జనరల్, నారాయణపురం జనరల్ మహిళ, వినాయకపురం ఎస్టీ జనరల్, ఊట్లపల్లి ఎస్టీ మహిళ, అచ్యుతపురం ఎస్టీ జనరల్,, నారవారిగూడెం బిసి జనరల్ మొత్తం ఎంపిటిసిలకు గాను ఎస్టీ 5, జనరల్ 3, బిసి 3 స్థానాలు, 27 గ్రామపంచాయతీలకు గాను 25 గ్రామపంచాయతీలు ఎస్టీకి రిజర్వ్ కాగా బిసి,జనరల్, జనరల్ కేటగిరి ఒకటి వీటిలో 12 ఎస్టీ మహిళలు, 13 ఎస్టీ పురుషులకు రిజర్వేషన్లు ఖరారైనట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించటంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం ఊపందుకుంది. ఇప్పటికే ఎంతో మంది ఆశావాహులు పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎస్టీ తో పాటు జనరల్, బిసి కేటగిరిలకు ప్రాధాన్యత కల్పించి ఎస్సీలకు ఒక స్థానం కూడా ఇవ్వకపోవడంతో ఎస్సీ చెందిన వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

## బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించిన మేయర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులోని బతుకమ్మ ఘాట్‌ను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని సోమవారం బతుకమ్మ ఘాట్ వద్ద మేయర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సందర్భంగా ఘాట్ వద్దకు మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున వస్తారని దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల భద్రతతో పాటు స్వచ్ఛత, త్రాగునీటి సౌకర్యం, లైటింగ్, పారిశుధ్యం తదితర అంశాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణలాల్, డిఈ శ్రీనివాసులు, కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఘాట్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, సద్దుల బతుకమ్మ వేడుకలను అంతరాయం లేకుండా సజావుగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



# క్రీడ

# అన్‌స్టాపబుల్ టీమిండియా..

## రెండేళ్లలో మూడు ట్రోఫీలు కైవసం!



ప్రపంచ క్రికెట్‌లో ఒక్కో జట్టు కొంతకాలం పాటు ఆధిపత్యం చెలాయించడం చూశాం. 1970–80వ దశకంలో వెస్టిండీస్ అజేయశక్తిగా అవతరించగా.. ఆపై ఆస్ట్రేలియా వంతు. స్టీవ్ వా కెప్టెన్సీ నుంచి రికీ పాంటింగ్ సారథ్యంలో వరల్డ్ కప్ టోర్నీల్లో హ్యాట్రిక్ విజయాలతో చరిత్ర సృష్టించింది ఆసీస్. ఆ తర్వాత ఇంగ్లండ న్యూజిలాండ్ పుంజుకోగా.. గత రెండేళ్లుగా భారత జట్టు శకం నడుస్తోంది. 'టోర్నీ, ఫార్మాట్ ఏదైనా కప్ మాదే' అన్నట్టుగా చెలరేగుతున్న టీమిండియా.. అంతర్జాతీయంగా అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్లుతోంది.

రెండేళ్లలో మూడు ట్రోఫీలు గెలవడం అంటే మామూలు విషయం కాదు. అందుకు నిలకడగా రాణించడం ఒక్కటే సరిపోదు ఒత్తిడిని చిత్తుచేయ గల సత్తువ కూడా ఉండాలి. ఇప్పుడు టీమిండి యాకు ఈ రెండూ ఉన్నాయి. అందుకే అజే యంగా ట్రోఫీలను ఎగరేసుకుపోతోంది. 2023లో సొంతగడ్డపై ఓటమన్నదే ఎరుగ కుండా వన్డే వరల్డ్ కప్ ఫైనల్ చేరిన రోహిత్ శర్మ బృందం.. అనూహ్యంగా ఆస్ట్రేలియా చేతిలో కంగుతిన్నది. ఆ ఓటమి నుంచి త్వరగానే తేరు కున్న టీమిండియా నిరుడు వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ 20 వరల్డ్ కప్‌లో పంజా విసిరింది.
లీగ్ దశ నుంచి సూపర్ 8, సెమీ ఫైనల్లో అదిరే విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. దక్షిణాఫ్రి కాతో హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో కోహ్లీ అర్ధ శతకంతో మెరవగా, బుమ్రా బెంబేలె త్తించాడు. పాండ్యా ఓవర్లో డేవిడ్ మిల్లర్ కొట్టిన బంతిని బౌండరీ లైన్ వద్ద సూర్యకుమార్ స్టన్నింగ్ క్యాచ్ అందుకోగా 7 పరుగుల తేడాతో గెలుపొందిన రోహిత్ సేన రెండోసారి పొట్టి వరల్డ్ కప్‌ను ముద్దాడింది. అంతేనా.. ఆ తర్వాత హిట్‌మ్యాన్ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ బరి లోకి దిగిన భారత్ ప్రత్యర్థులకు దడ పుట్టించింది. ఇంగ్లాండ్ ఆస్ట్రే లియా, పాకిస్థాన్, న్యూజిలాండ్‌పై విజ యభేరితో ఫైనల్ చేరింది. టైటిల్ పోరు లోనూ జూలు విది ల్చిన భారత క్రికెటర్లు కివీస్‌కు చెక్ పెట్టారు. మార్చి 25న జరిగిన ఫైనల్లో బ్లాక్‌క్యాప్స్ నిర్దేశించిన 251 పరుగుల లక్ష్యాన్ని మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే ఊదిపడేసింది టీమిండియా. దాంతో.. 17 తర్వాత ఛాంపి యన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

### సీనియర్లు లేకున్నా..

ఇక ఆసియా కప్‌లో సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకున్నా సరే.. యువరక్తంతో నిండిన టీమిండియా నూ వరుస విజయాలతో ఫైనల్ చేరింది. సూర్యకుమార్ యాదవ్ సార థ్యంలో లీగ్ దశ, సూపర్4లో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్.. ఫైనల్లోనూ దాయాదిని మట్టికరి పించింది. దుబాయ్ ఇంటర్నేషన్ స్టేడియంలో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఛేదనలో తిలక్ వర్మ(69 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడగా.. తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియ న్‌గా అవతరించింది. మరో ఐదు నెలల్లో టీ20 వరల్డ్ కప్ ప్రారంభ కానున్నందున.. టీమిం డియా జైత్రయాత్ర ఇలానే కొనసాగాలని అభి మానులు కోరుకుంటున్నారు.

# ఇంగ్లాండ్ పేసర్ క్రికెట్‌కు వీడ్కోలు



ఇంగ్లాండ్ వెటరన్ పేసర్ క్రిస్ వోక్స్ అంత ర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన పదిహేనేళ్ల సుదర్ఘ కెరీర్‌కు సోమవారం అల్విదా చెప్పేశాడీ పేసగన్. భారత్‌తో టెస్టు సిరీస్‌కు ముందే గాయం నుంచి కోలుకున్న వోక్స్ & మరోసారి గాయపడడంతో కెరీర్ ప్రమాదంలో పడింది. చివరిదైన ఓవల్ టెస్టులో ఎడమ భుజం పక్కకు జరగడంతో యాషెస్ సిరీస్‌లో ఆడాలనుకున్న అతడి కల చెదిరింది. దాంతో.. గాయా లతో వేగలేకనే తనకెంతో ఇష్టమైన ఆటకు దూరమవ్వాలని నిర్ణయించుకు న్నాడీ స్పీడ్‌స్టర్. 'క్రికెట్‌కు వీడ్కోలు పలకాల్సిన సమయం వచ్చేసింది. అందుకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నా. ఇంగ్లాండ్ తర పున ఆడాలనేది నా చిన్నప్పటి కల. నా డ్రీమ్‌ను నిజం చేసుకున్నందుకు చాలా అదృష్టవంతుడిని. ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించడం, మూడు సింహాలు ముద్రించి ఉన్న జెర్సీని ధరించడం.. గత పదిహేనేళ్లుగా మైదా నంలో సహచరులతో గడపడం మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చాయి. టీమ్‌మేట్స్‌లో చాలామంది నాకు జీవితకాల మిత్రులుగా మారిపోయారు. ఇన్నేళ్ల నా కెరీర్‌ను చూసి నేను చాలా గర్వపడుతున్నాను' అని వోక్స్ తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. అంతేకాదు తన ఈ ప్రయాణంలో ఎంతగానో సహకరించిన అభిమానులు, కుటుంబం, భార్య అమీ, కూతుళ్లు లైలా, ఎవీలకు కృతజ్ఞతలు తెలపాడు వోక్స్.
అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీలో చివరిదైన ఓవల్ టెస్టులో ఫీల్డింగ్ చూస్తూ గాయపడ్డాడు వోక్స్. ఎడమ భుజం స్థానభ్రంశం చెందడంతో నొప్పితో మైదానం వీడిన అతడు ఐదో రోజు జట్టు కోసం క్రీజులోకి వచ్చాడు. చేతికి పట్టీతో వచ్చిన అతడు అట్కిన్సన్‌తో కలిసి పోరాడాడు. కానీ, సిరాజ్ సంచలన స్పెల్‌తో సూపర్ విక్టరీ కొట్టిన టీమిండియా సిరీస్ సమం చేసింది. ప్రస్తుతం కోలుకుంటున్న అతడిని యాషెస్ సిరీస్‌కు పక్కనపెట్టేశారు సెలెక్టర్లు. ఇక గాయాలతో వేగించి చాలు.. జట్టుకు తన సర్వీస్ కూడా చాలు అనుకున్నాడు కాబోలు.. రిటైర్మెంట్ వార్తతో ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు షాకిచ్చాడు వోక్స్.

### 62 మ్యాచుల్లో 192 వికెట్లు

ఆస్ట్రేలియాపై 2011లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఈ స్పీడ్‌స్టర్ 62 మ్యాచుల్లో 192 వికెట్లు తీశాడు. విదేశాల్లో కంటే స్వదేశంలోనే ప్రమాదక రమైన బౌలర్‌గా ముద్ర పడిన వోక్స్ ఇంగ్లాండ్ గడ్డపైనే 23.47 సగటుతో 148 వికెట్లు పడగొట్టాడు.ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు, సెంచరీతో 'లార్డ్స్ హానర్స్ బోర్డు'లోకి ఎక్కాడీ లెజెండరీ బౌలర్. ఇయాన్ మోర్గాన్ సారథ్యంలో వన్డే వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో వోక్స్ సభ్యుడు. జోస్ బట్లర్ నేతృత్వంలో పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిచాడీ పేసర్.

# యువతరంగం

## ఫోకస్

## రంగుల విప్లవకారుడు విన్సెంట్ వాన్ గో



ప్రపంచ కళా చరిత్రలో సజీవమైన భావోద్వేగాలు, రంగుల విస్ఫోటనాలతో చిత్రాలను మలిచిన గొప్ప చిత్రకారులలో విన్సెంట్ వాన్ గో ఒకడు. అతని జీవితం కేవలం కళాత్మక ప్రయాణమే కాదు, మానసిక పోరాటం, ఆత్మవేదన, ఇంకా ప్రకృతితో ఆయనకున్న అనుబంధానికి ప్రతిరూపంగానూ నిలుస్తుంది. 1853 మార్చి 30న నెదర్లాండ్స్‌లోని గ్రూట్‌జున్డర్ట్ అనే చిన్న పట్టణంలో జన్మించిన వాన్ గోకు చిన్నప్పటి నుంచే ప్రకృతి, గ్రామీణ జీవితం పట్ల మక్కువ ఉండేది. మొదట ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుని పాస్టర్ కావాలని అనుకున్నాడు. కానీ తరువాత కళ పట్ల ఆకర్షణ పెరిగి తన ప్రతిభను చిత్రలేఖనంలో వినియోగించాడు. ప్రతి



రంగులో ఒక భావాన్ని, ప్రతి రేఖలో ఒక భావోద్వేగాన్ని నింపేవా కాబట్టే, అతని పెయింటింగ్స్ అంతటి విశిష్టను సంతరించుకున్నాయి. 'స్టారీ నైట్', 'సన్‌ఫ్లవర్స్', 'ది బెడ్‌రూం' వంటి చిత్రాలు ఆయన ప్రత్యేకతను ప్రతిబింబిస్తాయి. పసుపు, నీలం, ఆకుపచ్చ వంటి తేలికపాటి రంగులను ప్రకాశవంతంగా చూపించడంలో ఆయనకు అద్భుతమైన నైపుణ్యం ఉండేది. దళసరి, గిరికీలు తిరిగే బ్రష్ స్ట్రోక్స్ వాన్ గో కళకు ప్రత్యేకత. ఇవే ఆయన చిత్రాలకు జీవం పోసాయి. ఇంతటి ప్రతిభావం తుడైనప్పటికీ, వాన్ గో జీవితం సాఫీగా సాగ లేదు. ఆయన తరచూ ఒంటరితనం, డిప్రెషన్, ఆందోళనలతో పోరాడేవాడు. 1888లో ఆయన తన స్నేహితుడు గౌగిన్‌తో గొడవ తర్వాత తన చెవి ఒక భాగం కోసుకున్న సంఘటన ప్రసిద్ధి చెందింది. చివరికి 1890, కేవలం 37 ఏళ్ల వయసులోనే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. నిజానికి వాన్ గోకు చిత్రాలకు అతను జీవించినప్పటి కంటే మరణించిన తర్వాత గొప్ప పేరు వచ్చింది. కళా ప్రపంచంలో ఒక విప్లవం సృష్టించాయి. నేటి రోజుల్లో ఆయన చిత్రాలు కోట్ల విలువ గలవిగా పరిగణించబడుతున్నాయి. ఆధునిక కళలో ఆయనను ఒక మాస్టర్‌గా గౌరవిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే, వాన్ గో జీవితకాలంలో కేవలం ఒకే ఒక్క చిత్రం మాత్రమే అమ్ముడైంది. మొత్తం మీద వాన్ గో సుమారు 2100 కళాకృతులు సృష్టించాడు, అందులో 860 ఆయిల్ పెయింటింగ్స్ ఉన్నాయి. ఆయన లేఖలు కూడా సాహిత్య విలువ కలిగినవిగా గుర్తింపు పొందాయి. నేటి యువత నేర్చుకోవాల్సిన పాఠాన్ని వాన్ గో జీవితం చెబుతుంది. ప్రతిభకు తగిన గుర్తింపు వెంటనే రాకపోవచ్చు, కానీ నిజమైన కళ ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన రంగులలోని శక్తి, భావోద్వేగాలు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రేరేపిస్తున్నాయి. ఈ వాస్తవం తెలుసుకొని, ఆత్మనూన్యతతో బాధపడడం గానీ, ఆత్మహత్యలకు ప్రయత్నించడంగానీ చేయకూడదని వాన్ గో జీవితం స్పష్టం చేస్తుంది.



## టీనేజ్ శాస్త్రవేత్త హేమన్

ఏదైనా గొప్ప పరిశోధన చేయడానికి, అరుదైన ఆవిష్కరణలు చేయడానికి ఎంతో విజ్ఞానం.. అంతకు మించిన అనుభవం అవసరం. కానీ, ఇథియోపియాకు చెందిన హేమన్ బెకెలే మాత్రం టీనేజ్‌లోనే శాస్త్రవేత్త అవతారం ఎత్తాడు. అతను చర్మ కేన్సర్ చికిత్సకు ఉపయోగపడే అరుదైన





సబ్బును అభివృద్ధి చేసి, 2024లో ప్రతిష్టాత్మక టైమ్ మ్యాగజైన్ 'కిడ్ ఆఫ్ ఇది ఇయర్' అవార్డు దక్కించుకున్నాడు. తన చిన్నతనంలో ఇథియోపియాలో శ్రామికులు పగలంతా ఎండలో శ్రమించడం, ఫలితంగా పలు రకాలైన చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడడాన్ని చూసిన హేమన్, వారి సమస్యను పరిష్కరించడానికి ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు. రసాయన శాస్త్రంపై ఆసక్తి ఉండడంతో, ఏడేళ్ల వయసులోనే ప్రయోగాలు చేయడం ఆరంభించాడు. చాలా తక్కువ వ్యయంతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి రాబడాలనే లక్ష్యంతో సరళమైన, లిపిడ్ నానోపార్టికెల్స్ ఉపయోగించి, చర్మంలోకి ఇంకిపోయేలా ఇమ్యూనోథెరపీ సబ్బును రూపొందించాడు. హేమన్ అభివృద్ధిచేసిన స్కిన్ కేన్సర్ ట్రీట్ సబ్బులో సాలిసిలిక్ యాసిడ్, గ్లైకోలిక్ యాసిడ్, ట్రెటినాయిన్ వంటి క్రియాశీల పదార్థాలు ఉంటాయి. ఇవి చర్మంపై కేన్సర్ కణాలను నివారించేందుకు సహాయపడతాయని నిపుణులైన శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్న విషయం. అతను కనిపెట్టిన సబ్బు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ఉపశమనం ఇవ్వడం ఖాయం. ముఖ్యంగా, ఆధునిక చికిత్సలు అందుబాటులో లేని పేద దేశాల్లో, మరింత ప్రత్యేకించి ఆఫ్రికా దేశాల్లో కూడా వ్యాధి నివారణకు సులభమైన వైద్యం అందుబాటులోకి రావాలన్నదే హేమన్ ఆలోచన. ఈ లక్ష్యంతోనే అతను పరిశోధనలు చేశాడు. చర్మ వ్యాధులు, కీలకంగా చర్మ కేన్సర్‌ను అదుపు చేసే సబ్బును కనిపెట్టి, '3ఎం యంగ్ సైంటిస్ట్ చాలెంజ్'లో విజేతగా ఎంపికయ్యారు. 25,000 డాలర్ల బహుమతి గెలుచుకున్నాడు. ప్రస్తుతం 16 సంవత్సరాల హేమన్ ఈ సబ్బుని మరింత అభివృద్ధి చేయడానికి పరిశోధనను కొనసాగిస్తున్నాడు. పూర్తిస్థాయిలో ఈ సబ్బు మార్కెట్‌కి రావడానికి మరికొంత కాలం పడవచ్చు. కాగా, హేమన్ పరిశోధనకు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# మోదీ, కెసిఆర్‌లపై కేసులు నమోదు చేయాలి : విజయసారథి డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** నల్ల చట్టాలు, ఆర్టీసీ ఉద్యమ కేసులో వామ పక్ష ఉద్యమకారులపై తప్పుడు కేసులు పెట్టించిన మోదీ, కెసిఆర్‌లపై కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. నాడు ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులో భాగంగా సోమవారం వారు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. విజయ సారథి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, గౌని ఐలయ్య మాట్లాడారు. నల్ల చట్టాలు రద్దు చేయాలని,ఆర్టీసీని విలీనం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమించిన నేపథ్యంలో నాడు అధికారంలో ఉన్న ప్రధాని మోడీ ముఖ్యమంత్రి కేసీఆర్ లు అక్రమంగా ఉద్యమకారులపై కేసులు పెట్టించారని, వామపక్ష పార్టీలు చేసిన పోరాటంలో భాగంగా నల్ల చట్టాలు రద్దుచేసి మోడీ జాతికి క్షమాపణ చెప్పాడన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఇది వారి విజయమన్నారని, మోడీ, కేసీఆర్ మెడలు వంచింది వామపక్ష పార్టీలే అన్నారు.కేసీఆర్ కాలగర్భంలో కలిసిపోయాడని రానున్న కాలంలో మోదీకి కూడాఅదే గతి పడుతుందని, ఉద్యమకారులపైపెట్టిన అక్రమ కేసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎత్తివేయాలని కోరారు. కోర్టుకు హాజరైన వారిలో నల్లు సుధాకర్ రెడ్డి, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, హాలావత్ లింగ్య నాయ,క్ దేవేందర్, పెరుగు కుమార్, రెసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, చొప్పరి శేఖర్, నర్రా శ్రావణ్, మేక వీరన్న, కనకం పద్మ, సమ్మెట రాజమౌళి, ఎండి మదర్, సాంబయ్య, రావుల రాజు, నాగయ్య, శ్రీలత, ఆలకుంట్ల సాయిలు, ఉప్పలయ్య ఉన్నారు.

# పెండింగ్ వేతనాలు ఇవ్వండి

## ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండు చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్‌కు సోమవారం పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలలు, కలెక్టర్ బడ్జెట్ ద్వారా పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. జిల్లా ఏరియా సిహెచ్‌సి ఆసుపత్రులలో కాంట్రాక్ట్ పద్ధతుల్లో వివిధ ఏజెన్సీల కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు రాక కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగకి కార్మికులు పస్తులు ఉండే దుస్థితి నెలకొన్నదన్నారు. కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా నేత ఎస్. సంతోష్, ఆస్పత్రి కార్మికులు లక్ష్మ న్న, ప్రవీణ్, రాములు, యాదేష్,ఆనంద్, రాజు, శ్రీనివాసులు, రా జలింగం, వెంకటేష్, కవిత కృష్ణవేణీ, రాములమ్మ,లక్ష్మి ,గోవిందమ్మ,అరుణ,మమత పాల్గొన్నారు.

# 5న సిపిఐ 'శత వసంత'సభ




## హాజరుకానున్న డి.రాజా, నారాయణ, పువ్వాడ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు సభకు సంబంధించి ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం అక్టోబర్ ఐదున ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరుగుతుందని సిపిఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యులు ఎస్‌కె సాబీర్ పాషా, దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం ఐదున మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని,సిపిఐరాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావుఅధ్యక్షత వహిస్తారన్నారు.ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, గౌరవ అతిథులుగా బినోయ్ విశ్వం, కె.నారాయణ, అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి హాజరవుతారని పాషా, సురేష్ లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఆహ్వాన సంఘసమావేశానికిసిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, తమిళనాడు రా ష్ట కార్యదర్శి ఎం. వీరపాండ్యన్, పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, కర్ణాటక రాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సుందరేష్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, ఈటి నర్సింహ, బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

# సిపిఐకి తిరుగులేదు : కూనంనేని

## సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సుజాతనగర్ మండలం, సర్వారం, చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండా, పాల్వంచ మండల దంతెల బోరగ్రామాలకు చెందిన 220 కుటుంబాల వారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎకెసే సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. స్థానిక జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో జరిగిన కార్యక్రమంలో చేరికలు చోటు చేసుకోగా ఎర్రకుండువాకప్పిప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు.కూనంనేని మాట్లాడుతూ ప్రజల కష్టాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేది ఎర్రజెండానే అని పేర్కొన్నారు. గడిచిన ఇరువై నెలల కాలంలో ఎంఎల్‌ఏగా నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం శ్రమిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సిపిఐకి తిరుగులేదని, ప్రజలకు అందిస్తున్న సేవలు ఫలితంగా వారు సిపిఐని ఆదరిస్తున్నారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎకెసే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, నాయకులు రామ్ చందర్, బానోత్ గోవింద్, మన్నెం వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని రక్షించుకోడానికి ఉద్యమాలు ఉధృతం

## ఆదిలాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్:** పంజాబ్ రాష్ట్రం చండీగఢ్ రాజధానిలో ఈ నెల 21 నుండి 25 వరకు జరిగిన జాతీయ సిపిఐ 25వ మహాసభల వివరాలను ఆదిలాబాద్ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శిముడుపు ప్రభాకర్‌రెడ్డి మీడియాకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత,దేశ ప్రజలందరూ ముందుకు సాగాలని మహాసభ పిలుపునిచ్చిందని తెలిపారు. స్వతంత్ర పోరాటంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేసిన ఆయన, నేడు కొందరు మతోన్మాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మోడీ ప్రభుత్వం ఇప్పటికే దేశ సంపదను విదేశీ కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేసిందని,ఇంకా ఈ దేశాన్ని తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తోందని ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ ప్రయత్నాలను తిప్పికొట్టడానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడాని కి, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి,సెక్యులర్ భారతదేశాన్ని కాపాడుకోవడానికి సిపిఐ శ్రేణులు,యువకులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. మరింత ఉధృతంగా ఉద్యమాలు చేయాలని జాతీయ మహాసభ పిలుపునిచ్చిందన్నారు. నల్ల డబ్బు తీసుకొచ్చి ప్రతి పేదవాడి ఖాతాలో 15 లక్షలు ఇస్తానని చెప్పి,పేదల జేబుల నుంచే జీఎస్టీ పేరు మీద డబ్బులు గుంజుతున్నారని 18 శాతం జీఎస్టీ విధించి పేదవాళ్ల కడుపు కొడుతున్నారని ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటల రాములు,బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి అర్దంగి రమేష్,ఆదిలాబాద్ మండల కార్యదర్శి మహబూబ్ ఖాన్, సిపిఐ సీనియర్ నాయకులు బుర్రి సాటువాజీ, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు ఖండాల గణేష్ పాల్గొన్నారు.

# సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/డిండి:** పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో ఈనెల 21 నుండి 25 వరకు జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలో నూతనంగా జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్‌ఎస్ డిండి మండల పార్టీ అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్‌రావు, మండల నాయకులు సూదిని కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

# బాధితులకు న్యాయం చేయండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ (మేడ్చెల్) :** గతవారం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలువేసుకుని ఉంటున్నారని చెప్పి హైడ్రా అధికారులు ఇండ్లను కూల్చివేశారని,పేద, మధ్యతరగతి ప్రజలే నష్టపోయారని, న్యాయం చేయాలని సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమామహేష్ మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు కబ్జాలు జరిగాయని, అప్పటి నాయకులు, అధికారులు కొందరూ సహకరించడం వల్ల ప్రజలు ఆ స్థలాలనుకొని అక్కడ నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇప్పుడు అవి అక్రమ నిర్మాణాలని కూల్చివేయడం వల్ల వారికి తీవ్ర నష్టం కలిగిందన్నారు. బాధితులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, కార్యవర్గ సభ్యులు వి.శ్రీనివాస్, ఇమామ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గానికి ధన్యవాదాలు: ఓమయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్ర మహాసభను జయప్రదం చేసిన కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఓమయ్య అన్నారు. శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీ దడువాయి చాట గుమాస్తా స్వీపర్ కార్మికుల రాష్ట్ర రెండవ మహాసభను నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోనిర్వహించామన్నారు. విలేరుల సమావేశంలో మాట్లాడారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి హాజరై కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీనివ్వటం జరిగిందన్నారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నామన్నారు.

### కార్యవర్గం ఎన్నిక

రాష్ట్రకార్యనిర్వాహకఅధ్యక్షులుగా ఓమయ్య అధ్యక్షులుగా మునీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజ్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నిజామాబాద్‌కు చెందిన పరశురాం, సభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్, బాలాంజనేయులు, శ్రీహరి, సుధాకర్ గౌడ్, అనసూయ, నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ హరిత



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లా కలెక్టర్‌గా ఎం హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ ఎం హరిత బా ధ్యతలు స్వీకరించారు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



ప్రజాపక్షం/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, ఎంపిటిసి, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రి లక్ష్మణ్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్నప్పుడే నాయకుడు అవుతారని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పించి గౌరవిస్తామని అన్నారు. నాలుగు శాఖల బాధ్యతలు చూస్తున్న దళిత నాయకుడినైనా తాను ముఖ్యమంత్రి పక్కన కూర్చునే అవకాశం రావడం పార్టీకోసం తాను చేసిన అంకిత భావమే కారణమన్నారు. రాబోవు స్థానిక ఎన్నికలలో సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని సూచించారు. పోలీస్ బందోబస్తులు ఈ ఆడంబరాలు శాశ్వతం కావని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ధర్మపురి మండల నేతలు పాల్గొన్నారు.

## మహాశక్తి ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కరీంనగర్ పట్టణంలోని చైతన్యపురిలో గల శ్రీమహాశక్తి అమ్మవారి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకుని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, గందె మహేష్, వాల రమణారావు, బోనాల శ్రీకాంత్, వాల రమణారావు, బోనాల శ్రీకాంత్, నక్క కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, దిండిగాల మహేష్, ఏవి రమణ, జంగిలి సాగర్, తుల బాలయ్య, తోట రాములు, ఒంటెల సత్యనారాయణ, ఐలేందర్ యాదవ్, గూడూరు మురళి, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ఎస్ నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు సత్తినేని శ్రీనివాస్, సుధీర్ రెడ్డి, తొంటి రాజేందర్, మిడిదొడ్డి నవీన్, మేచినేని పవన్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, పలువురు నాయకులు తదితరులున్నారు.

## ప్రాణాలు పోతే గానీ పట్టించుకోరా!



ప్రజాపక్షం/మల్లాపూర్: వాహనదారులకు కావాల్సిన పత్రాలు లేకుండా రోడ్డెక్కితే జరిమానాలు విధించే అధికారులు, రహదారులపై పెద్ద మొత్తంలో గుంతలుపడి వాహనదారులు ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్న పట్టించుకోవడం లేదని మా ప్రాణాలకు ఏది భరోసా అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు ప్రయాణికులు. వివరాల్లోకి వెళ్తే మల్లాపూర్, ఖానాపూర్ నుండి మెట్‌పల్లి వెళ్లే రహదారులపై హుస్సేన్ నగర్, ముత్యంపేట గ్రామాలలో పెద్ద మొత్తంలో గుంతలు ఏర్పడి నీరు నిలిచి ఉండడంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మోకాలి లోతు గుంతలలో నీరు ఉండడంతో వాహన చోదకులకు గుంతలు ఏర్పడక ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలు అవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారి వెంబడి ఇంత పెద్ద మొత్తంలో రోడ్డు చెడిపోయినప్పటికి కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో వర్షాలు పడి రోడ్డు చెడిపోతున్నా తాత్కాలిక మరమ్మత్తులు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వందలాది వాహనదారులు పడుతున్న అవస్థలు అన్ని ఇన్ని కావు. ఈ గుంతల రహదారిపై ఆర్ అండ్‌బి అధికారులు గానీ మండల స్థాయి అధికారులు గానీ పిర్యాదు చేసినా స్పందించడం లేదని, వాహన చోదకులు వాపోతున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చేది ఎవరంటూ అధికారులను సూటిగానే ప్రశ్నిస్తున్నారు ప్రయాణికులు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి తక్షణమే గుంతల రహదారిని శాశ్వత మరమ్మత్తులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరి కృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేటలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తప్పెట శంకర్,పిసిసి కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో నంగునూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఐలేని యాదగిరి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బిసిలకు 42% రిజర్వేషన్ కల్పించినదని,బిసిల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న తమ పార్టీ అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా కన్వీనర్ ముత్యాల యాదగిరి,వెంకట్ రెడ్డి,రమేష్,జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికలు

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ లోకల్ బాడీ ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్ వివరాలను ప్రకటించడంతో కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవోలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు విడతల్లో ఎంపిటిసి, జడ్పిటిసి, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ (సర్పంచ్ వార్డు సభ్యులు) ఎన్నికలు మొత్తం ఐదు విడతల్లో నిర్వహించనున్నారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నవంబర్ 11 వరకు పూర్తి కానుందని వివరించారు. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో జిల్లాలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు.

**విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి**

ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్పగించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని, అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన శిక్షణ సిబ్బందికి ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌వో బి.వెంకటేశ్వర్లు, జడ్పి సీఈవో శ్రీనివాస్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, డిపివో జగదీష్, జడ్పి డిప్యూటీ సీఈవో పవన్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం



హుస్నాబాద్/ప్రజాపక్షం: తెలంగాణ లో మహిళల పెద్ద పండుగైన సద్దుల బతుకమ్మ పండుగ సొమవారం హుస్నాబాద్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపల్ అధికారులు లైటింగ్, కట్టకు చుట్టు గిల్స్‌లు ఏర్పాట్లును చేశారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు ఎన్నరైలు పెద్దసంఖ్యలో పాల్గోన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలు ఉట్టి పడే విధంగా మహిళలు చక్కని బతుక్మమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తు బతుకమ్మ వేడులను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం మహిళలు చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. బతుకమ్మ పాటలతో ధూం ధాం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ బిసి మరియు రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు పాల్గోన్ని ప్రతి మహిళలను పలకిరిస్తు వారితో ముచ్చటించారు. బతుకమ్మను ఎత్తుకుని వారితో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రందాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ అకుల రజిత వెంకన్న, అనితరెడ్డితో ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు.

## దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రిహరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: దసరా శ్రీదేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా సిద్దిపేట రూరల్ మండలం సీతారంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గ అమ్మవారిని మాజీ మంత్రి హరీష్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌రావు అమ్మవారి శాశ్వత షెడ్ నిర్మాణం కొరకు ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా మండలంలోని పుల్లూరు, బండచర్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లనుదర్శించుకున్నారు. సిద్దిపేట నియోజక వర్గం ప్రజలు సుబిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ద్వారా ప్రసవానికి దగ్గర గా ఉన్న గర్భిణీ మహిళలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రెగ్నెన్సీ గుర్తింపు నుంచి ప్రసూతి వరకు అన్ని దశలలో ప్రభుత్వ వైద్య సహాయం పొందాలని, ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్, టీకాలు 100% జరిగేలా చూడాలని అన్నారు.ఆర్.బి.ఎస్.కే బృందాల పనితీరును పర్యవేక్షించాలని , పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ పిల్లల ఆరోగ్య స్థితిగతులను రెగ్యులర్ గా చెక్ చేయాలని, అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందజేయాలని అన్నారు.ఎన్.సి.డీ స్క్రీనింగ్ ప్రతి హెల్త్ సెంటర్ పరిధిలో పక్కాగా జరగాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణి శ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

**నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారా-నికి చర్యలు**

భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం, భూ భారతి దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులు, పెండింగ్ భూ సేకరణ తదితర అంశాల పై కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గర్రెపల్లి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/సుల్తానాబాద్: గర్రెపల్లి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు.సోమవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాటు చేసిన పరమశివుని విగ్రహ ప్రతిష్ఠాపన చేసి అనంతరం బతుకమ్మ ఘాటును గ్రామ ప్రజలతో స్థానిక నాయకులతో కలిసిప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు 16 లక్షల రూపాయలతో గర్రెపల్లి చెరువు వద్ద నిర్మించిన విగ్రహాలు ఆహ్లాదాన్ని అందించే విధంగా ఉన్నాయన్నారు.గ్రామంలో చక్కటి వాతావరణాన్ని నెలకొల్పి ప్రజలు సాయంకాలం వేళలో ఆనందంగా గడిపేందుకు గ్రామంలో ఉన్న ప్రకృతిని అందంగా మలిచి ప్రజలకు చేరువలోకి తీసుకువచ్చేం దుకు కృషి చేసిన వారిని అభినందించారు. కన్నా రమేష్ గౌడ్ గ్రామంలో చెరు వులో శివుడి విగ్రహాన్ని అలాగే బతుకమ్మ ఘాటును ఏర్పాటు చేసేందుకు దాతల సహకారంతో ముందుకు వచ్చి అకుంఠిత దీక్షతో విగ్రహాలను పూర్తి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇక్కడి ప్రజలకే కాకుండా మండల ప్రజలకు ఈ ప్రాంతం చక్కటి టూరిజంలా ఉపయోగపడుతుందని అన్నారు. రానున్న రోజులలో మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విగ్రహాల నిర్మాణానికి సహకరించిన ఊరు పెద్దలు దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి: వెలిచాల



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: ఎన్నో ఏండ్ల పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాకారం చేస్తున్నారని, కరీంనగర్ నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు ఈ బతుకమ్మ దసరా పండుగకు ఒక ప్రత్యేకత ఉందని, ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి దసరా కానుకగా అందిస్తున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన 194 లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను వెలిచాల రాజేందర్‌రావు చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు చర్ల బూత్కూర్ గ్రామంలో రాజేందర్‌రావుకు గ్రామ ప్రజలు, మహిళలు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ప్రొసీడింగ్స్ కాపీలను అందజేసిన అనంతరం వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ దసరా కానుకగా కరీంనగర్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి 4 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేవారని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలో కరీంనగర్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను వెంటనే మంజూరు చేయాలని కోరానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారని, లబ్ధిదారులందరికీ ప్రొసీడింగ్స్ అందించాలని సూచించారని రాజేందర్‌రావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అధికారులను పురమాయించి కరీంనగర్ కార్పోరేషన్‌తో పాటు కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు యుద్ధప్రాతిపదికన అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో చర్ల బూత్కూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దసరా పండుగను 3వ తేదీకి మార్చాలి

అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన ఎఐటియుసి



ప్రజాపక్షం/పెద్దపల్లి: సింగరేణిలో దసరా పండుగ సెలవు ను అక్టోబర్ 2 కు బదులుగా 3 కు మార్చాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్స్ , ఓసిపి 5 లలో అధికారుల కు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు. సోమవారం జిడికె 2వ ఇంక్లైన్ లో మరియు ఏరియా హాస్పిటల్ లలో వారు అధికారుల కు వినతి పత్రాలు ఇచ్చిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే దసరా పండుగ జాతి పిత మహాత్ముడైన గాంధీ జయంతి అక్టోబర్ 2న రావడం దసరా పండుగను అత్యంత వైభవంగా సింగరేణి ఉద్యోగులు జరుపుకొనుటకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. పండుగ రోజున గనుల పైన మేకలతో మైసమ్మ పూజలు చేస్తూ సంవత్సర కాలమంతా నిర్దేశిత లక్ష్యసాధనలో మాకు ఎటువంటి ప్రమాదములు జరగరాదని భావోద్వేగంతో, భక్తి పారవశ్యంతో అమ్మవారిని కోరుకుంటారని వారు తెలిపారు. ఆ సందర్భంగా అమ్మవారి మొక్కు తీర్చునప్పుడు మద్యం ప్రధాన భూమిక పోషిస్తుందని , పూజకు సంబంధించిన అవసరమైన ప్రధాన వనరులు అక్టోబరు రెండు తారీకున మహాత్మాగాంధీ జయంతి కారణంగా నిషేధించ బడినవని వారు తెలిపారు. అందువల్ల ఉద్యోగుల కోరికను మన్నించి యాజమాన్యం సహృదయంతో ఆలోచించి కార్మికుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ 2 తారీఖున వచ్చిన దసరా పండుగను అక్టోబర్ 3వ తారీకు కు మార్చాలని సింగరేణి లో కార్మిక వర్గం కోరుతున్నారని వారు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు సిద్ధమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, ఉప్పులేటి తిరుపతి,పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీం పాషా, ఎరవెల్లి రాజయ్య, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, నాయిని శంకర్, గొడిశల నరేశ్, ఎం.చక్రపాణి, పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేదే బతుకమ్మ



ప్రజాపక్షం/ సిద్దిపేట : తెలుగు సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుపడుచుల అంబరాల సంబురమైన సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని తెలంగాణ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకుంటారు.అలాగే సిద్దిపేటలో జిల్లా అత్యంత వైభవంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుంది. బహుల అమావాస్య రోజును ఎంగిలి పూల బతుకమ్మతో బతుకమ్మ పండుగ ఆరంభమవుతుంది. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ (పెద్ద)తో వేడుకలు ముగుస్తాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు, ఎర్ర చెరువు, చింతల చెరువు ప్రాంతాలో మున్సిపల్ పక్షాన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని వేలాది మంది కోమటిచెరువు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు కాబట్టి అక్కడ ప్రత్యేక విద్యుత్ లైటింగ్,గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. పోలీసులు ట్రాఫిక్ను మళ్లించటం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సద్దుల బతుకమ్మను ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

**కరీంనగర్:** ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ.. రామ రామరామ ఉయ్యాలో రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ మహిళల పాటలతో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు గునుగు, చామంతి, బంతి, పట్టుకుచ్చుల పువ్వులు వంటి తీరొక్క పువ్వులతో బతుకమ్మను అందంగా ముస్తాబు చేశారు. నూతన వస్త్రాలు ధరించి సాయంత్రం వేళ బతుకమ్మలతో ప్రధాన వీధుల వద్దకు చేరుకున్నారు. తెచ్చుకున్న సద్దులను పంచుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.





**ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంతో సహా అన్ని గ్రామాలలో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరిపారు. సోమవారం గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు.సకల జనమహిళామణులు ఆనందంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆడబిడ్డలు తంగేడు ,చామంతి,తెల్లనిగునుగు పూలకు రంగులు అద్ది పేర్చిన బతుకమ్మను పూజిస్తూ ఆటపాటలతో అలరించారు.పైన పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచారు.ప్రకృతిని,పూలను మహిళలు పేర్చి రామరామ ఉయ్యాలో అంటూ చప్పట్లతో ఆటలు ఆడారు. కొవ్వొత్తులను, అగరువత్తులతో అలంకరించి ఊరంతాకదిలి ఒక్కచోట చేరారు.అనంతరం బతుకమ్మను కీర్తిస్తూ ఊరేగింపుగా వెళ్ళి బతుకమ్మను అందుబాటులో ఘాట్‌లలో, గిద్ద చెరువు వద్ద బతుకమ్మను నిమజ్జనం చేశారు. మహిళలు వారి వెంట తెచ్చుకున్న ఫలహారాలు ఒకరినొకరు ఇచ్చుకున్నారు. వివిధ ప్రజాప్రతినిధులు ఉండగా పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా సమీక్షించారు.

**మల్యాల:** తెలంగాణ యాస,భాష,సంస్కృతి ,సంప్రదాయాలకు అద్దం పట్టే సద్దుల బతుకమ్మ సంబరాలు మల్యాల,ముత్యం పేట గ్రామల లో సోమవారం అంబరాన్ని అంటాయి .ఎనిమిది రోజులు చిన్న బతుకమ్మలతో ఆడి పాడిన మహిళలు తొమ్మిదో రోజు తీరొక్క తంగేడు, గున్న పూలతో పెద్ద బతుకమ్మను పేర్చి,గౌరమ్మను అమర్చి ప్రధాన వీధుల్లో చేరి బతుకమ్మ పాటలతో మహిళలు,యువతులు,సందడిగా గడిపారు.స్థానిక మల్యాల చెరువులో,వరద కాల్వలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.





# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాతను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి పూజారి సంజీవరావు తీర్థ ప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాష్, రమేష్, కాశయ్య, గొట్టం నర్సింలు, నాయకులు గంగాగౌడ్, అలీ, రామాగౌడ్, గూడెపు భూమయ్య, మోతె జనార్దన్‌గౌడ్, సంగమేశ్వర్, మల్లేష్, బుచ్చిగొండ, సురేష్‌యాదవ్, అనిల్, తుకారాం పాల్గొన్నారు.

## 3న వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలి

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికులకు ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి, దసరా పండుగ రెండు ఒకే రోజు రావడంతో వార్షికంగా పొందే వేతనంతో కూడిన సెలవు ఒకటి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, అక్టోబర్ 3న వేతనంతో కూడిన ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలని ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య అన్నారు. ఏరియాలోని ఆర్‌కె 7 గనిలో సోమవారం ఆ గని పిట్ కార్యదర్శి మారేపల్లి సారయ్య ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టి, గని మేనేజర్ తిరుపతికి మెమొరండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు సంవత్సరమంతా కష్టపడి సంస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తారని, ఎంతో ఆశతో ఎదురు చూసే దసరా పండుగను ఆత్మీయతతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకునే ఉత్సవమని అన్నారు. అక్టోబర్ 3వ తేదీని వేతనంతో కూడిన ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిఎం చర్చల ప్రతినిధి చంద్రశేఖర్, అధికారిక ప్రతినిధి రాజ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ పవన్,షిఫ్ట్ సెక్రటరీలు యాదగిరి, నాయకులు మధుకర్, మోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## దసరా సెలవు 3న ప్రకటించాలి



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మికుల ఆకాంక్ష మేరకు దసరా పండుగ సెలవును అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు కాకుండా అక్టోబర్ 3న మాస్టర్‌తో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని గుర్తింపు సంఘం (ఎఐటియుసి) బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కెకె 5, కెకె ఓసి, ఏరియా వర్క్‌షాప్, జిఎం కార్యాలయం, సివిల్ డిపార్ట్మెంట్, ఏరియా స్టోర్, సెక్యూరిటీ డిపార్ట్మెంట్‌లలో యూనియన్ నాయకత్వంలో వినతిపత్రాలు సమర్పించారు. తెలంగాణ ప్రాంత సంప్రదాయం ప్రకారం దసరా రోజున గనులపై మైసమ్మ తల్లికి పూజలు చేసి, మేకలు కోసి, కుటుంబ సమేతంగా ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ అని, అయితే అక్టోబర్ 2న మద్యపానం, మేకలు కోయడంపై నిషేధం ఉన్నందున, ఆ రోజు సెలవు ప్రకటిస్తే కార్మికులు తమ సంప్రదాయాన్ని పాటించలేరని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కోల్‌ఇండియాలో ప్రకటించిన విధంగానే సింగరేణి యాజమాన్యం కూడా దసరా సెలవును అక్టోబర్ 3వ తేదీకి మార్చాలని కోరారు. ఉ కార్యక్రమంలో నాయకులు భీమనాథని సుదర్శన్, దర్శి సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్, పెద్దపెల్లి బానయ్య, తిరుపతి, సివి రమణ, అగ్గేటి రాజేశ్వరరావు, ములకలపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు




**ప్రజాపక్షం/కాసిపేట :** సింగరేణిలో రాజకీయ జోక్యం విడనాడి, పారిశ్రామిక సంబంధాలలో కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఎఐటియుసి కేంద్ర సెక్రటరీ అక్బర్ అలీ, కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. సోమవారం కాసిపేట 1వ, 2వ గనుల వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కష్టార్జిత లాభాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్న ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. సంస్థకు బకాయిలు ఇప్పటికీ ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయం అన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి కారణంగా మద్యం నిషేధం అమలవుతుండటంతో ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా దసరా పండుగ జరుపుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఉద్యోగుల మనోభావాలను గౌరవించి దసరా పండుగ తేదీని అక్టోబర్ 3కి మార్పు చేసి వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం కాసిపేట గని మేనేజర్ సతీష్, 2వ గని మేనేజర్ జి. లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఆఫీస్ బేరర్ నాగశ్వర్ రావు, ఫిట్ సెక్రటరీ మినుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, వి. రాంచేందర్, పార్వతి సురేష్, రంజిత్ కుమార్, అశోక్, గణేష్, అనీల్, జె. తిరుపతి, రాజేందర్, ఆడెపు రవీందర్ పాల్గొన్నారు.

## ఒడ్డె ఓటన్న జీవితం స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/రాంచంద్రపురం :** రాంచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన వడ్డె ఓటన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఒడ్డె ఓటన్న జీవితం స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని, భావి తరాలకు ఒడ్డే ఓటన్న జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. సిపాయిల తిరుగుబాటుకు ముందు స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాల వాడ నరసింహారెడ్డితో కలిసి బ్రిటీష్, సేనలపై విరోచిత పోరాటం చేసిన మహోతన్న వ్యక్తి ఓటన్న అని కొనియాడారు. అతడి త్యాగాలను భావితరాలకు అందించే లక్ష్యంతో విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీమని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎసిపి రాజావెంకటరెడ్డిలకు అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో





పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ ఈనెల 30 పదవీ విరమణ చేస్తున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండి.నసీరుద్దీన్‌ను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పూలమాలలు శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

**ఎడపల్లి :** ఎడపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంపిడిఒ కార్యాలయాలను సందర్శించి ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆరా...** ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్షించారు. లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తైన ఇళ్లను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహణ

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదన్నారు. నోటిఫికేషన్ విడుదల అయినందున ఎన్నికల అధికారులు పకడ్బందీగా, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం 17వ వార్డుకు చెందిన దివ్యాంగులైన పాదం శ్రీలత, పూదరి శ్రీనివాస్ దంపతులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, కాజీపేట మండలం మల్కేపల్లి గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ తమ గ్రామంలో సర్పంచ్ రిజర్వేషన్ మార్పుపై, బెల్లంపల్లి పట్టణానికి చెందిన హరికిషన్ పాండే శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ గురించి, నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కె. శ్రీనివాస్ తన భూమిలోకి అక్రమ నిర్మాణంపై, మంచిర్యాల పట్టణానికి చెందిన పిన్న సాయితేజ సాదాబైనామా క్రమబద్ధీకరణ తిరస్కరణపై అర్జీలను అందజేశారు. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ప్రశాంతంగా 'స్థానిక' ఎన్నికల నిర్వహణ

ఎస్‌పి కాంతిలాల్ పాటిల్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** అక్టోబరులో ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ ఆదేశించారు. ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తతతో నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని సూచించారు. ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం, ఇతర సామాగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని తెలిపారు. సమావేశంలో ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్, కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీదుద్దీన్, డిసిఆర్‌బి డిఎస్‌పి విష్ణుమూర్తి, స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, జిల్లాలోని సిఐలు, ఎస్‌ఐలు, ఐటి కోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** పండుగ ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలో దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు(బంగల్పేట్ చెరువు)ను కలెక్టర్ పరిశీలించారు. చెరువుగట్టు వెంబడి రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని, మెరుగైన లైటింగ్‌తో పాటు, క్రేన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎవరు చెరువులోకి దిగకుండా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అంతకుముందు కలెక్టర్ బంగల్పేట్ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇటీవలి నిర్మల్ జిల్లాకు జల్ సంచాయ్‌జన భాగిధారి కార్యక్రమంలో అవార్డు లభించినందున,అధికారులను కలెక్టర్ అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి, ఎన్నికల నియమావలి ముగిసి వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. అధికారులంతా ఎన్నికల కోడ్‌ను తప్పనిసరి పాటించాలి ఆదేశించారు. ఎలక్షన్ కోడ్ జిల్లాలో పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్‌పోలియో విజయవంతానికి చర్యలు

కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** అక్టోబర్ 12నుండి 14వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమం జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,88,895 మంది 05 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారని, వీరందరికి పల్స్ పోలియో చుక్కల మందు వేయాల్సి ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సర్వే ద్వారా అంచనా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 1583 అంగన్వాడీ సిబ్బంది 1505, ఆశావర్కర్లు, 904 మంది సిబ్బందితో పల్స్ పోలియో ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగనిర్మల కలెక్టర్ తెలిపారు. ప్రతి తల్లి దండ్రులు తమ ఐదు సంవత్సరాల లోపు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ జానకిరెడ్డి, డిడబ్ల్యుఒ లలిత కుమారి, అడిషనల్ డిఆర్‌డిఒ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/కొడిపల్లి :** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కొడిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు, ఎంపిఒ కరిముల్లా , సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఘనం'గా బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్/పెంచికల్‌పేట్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళా పోలీసులు, అధికారులు, సిబ్బంది, హోమ్‌గార్డులు, వివిధ వింగ్స్‌లో పని చేసే సిబ్బంది బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ ఆడడం ఆనందంగా ఉందని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడం గర్వకారణమన్నారు. జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మలను పేర్చి ఆడుతూ ఐక్యత, ప్రేమ ప్రతిఫలించేలా పాటలు పాడి సంబరాలు జరిపారు. అనంతరం ఎస్‌పి సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, మహిళా ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

**కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని సర్సిల్క్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు నివాసంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. హరీష్ బాబు సతీమణి శివాని ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మనందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు నింపాలి అని ఆకాంక్షించారు.

**సంగారెడ్డి :** సంగారెడ్డి పోలీసు కుటుంబాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్, ఫంకజ్ ఉత్సవాలకు హాజరైనారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పువ్వులను పూజించే ప్రత్యేక సంస్కృతి అని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళ్యాని, డివిజన్ పోలీసు అధికారులు ఇన్స్పెక్టర్ సబ్ ఇన్స్పెక్టర్‌లు సిబ్బందిపాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ధర్పల్లి మండలంలో సంప్రదాయ పద్ధతిలో పాటలు పాడుతూ మహిళలు బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. జిన్నా సాయిలు సభ్యుల ఆధ్వర్యంలో పండగ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలు అందంగా ముస్తాబై బతుకమ్మలను తీసుకవచ్చి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. అనంతరం మర్రి చెట్టు కింద బ్రిడ్జి వద్ద ఆడివాడీ వాగులో నిమజ్జనం చేశారు.







# హమాలీ, దడువాయి, చాట, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ, దడువాయి, చాట, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ నెల 27న నిజామాబాద్‌లో ఘనంగా జరిగిన రాష్ట్ర 2వ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్య కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నిజామాబాద్ రూరల్ ఎంఎల్‌ఎ డాక్టర్ భూపతి రెడ్డి హాజరయ్యారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ తెలిపారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు.

**నూతన కమిటీ ఎన్నిక :** రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎస్.విలాస్, అధ్యక్షులుగా గుంపల్లి మునీశ్వర్, కార్యనిర్వాక అధ్యక్షులుగా వై.ఓమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్. బాలరాజ్, ఉపప్రధాన కార్యదర్శిగా మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షులుగా చామకూర యాకూబ్, దామెర కృష్ణ (వరంగల్), ఎల్లయ్య (హైదరాబాద్), కలమ్మ అదిలాబాద్, శివాజీ నిర్మల్, కార్యదర్శులుగా సిక్కుల సమ్మయ్య అడగల్లి కామారెడ్డి జిల్లా, పరుశురాం (నిజామాబాద్) గన్నారపు రమేష్ (వరంగల్ ) ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యనిర్వాక సభ్యులుగా శ్రీహరి (నిజామాబాద్) గుడ్డేటి రాజు( జనగాం) శ్రీనివాస్ (బోధన్), గట్టయ్య (హైదరాబాద్) ముత్యం (నిర్మల్) అనసూయ (నిజామాబాద్) శ్రీనివాస్ (నిజామాబాద్) విరసం (జనగాం) నాగులు (వరంగల్) చుంచు ముత్యాలు (మహబూబాబాద్) మల్లేష్ (ఆదిలాబాద్) బుల్లి వీరస్వామి (జనగాం), నరసయ్య (నిర్మల్), ఎడ్ల నాగులు (వరంగల్)ఎన్నికైయ్యారు. రాష్ట్ర సమితి



సభ్యులుగా రామరాజు, నరసయ్య బి రాజు సుధాకర్ గౌడ్, నగేష్ గౌడ్, నరేష్, కేశవరం కాశీరాం, ఎల్లారెడ్డి,సత్యం పిట్లం గారాలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.










































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com